VISALAANDHRA VIJAYAWADA Phone No. 376

6 పేజీలు 6 నయాపైసలు రిజిష్టర్డు నెం A 193

ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్ష పదవికి శ్రీ అల్లూరి రాజీనామా

హైదరాబాద్, ఏప్రిల్ 8

అఖిలభారత కాంగ్రెసు కార్యదర్శిగా నియమితులైన అల్లూరి సత్యనారాయణరాజుగారు ఆంధ్ర ప్రదేశ్ కాంగ్రెసు అధ్యక్ష పదవికి నేడు రాజీనామా ఇచ్చారు.

ఆంధ్ర కాంగ్రెసు కమిటీ సర్వసభ్య సమావేశం ఏప్రిల్ 24న కొత్త అధ్యక్షుణ్ణి, కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకొనడానికి సమావేశమవుతుంది.

విశాలాంధ్ర

సంపుటి 7 * విజయవాడ బుధవారం చైత్రం 19-1880 [ఏప్రిల్ 9-1958] * సంచిక 19

భోపాల్‌లో విద్యార్థుల కొట్లాట

భోపాల్, ఏప్రిల్ 8

స్థానిక వైద్య కళాశాల విద్యార్థులు నూటయాభై మంది కర్రలతో, పోలిటెక్నిక్ విద్యార్థుల హాస్టల్‌పై దాడిచేశారు. ఈ గలాటాలో 16 మంది విద్యార్థులు గాయపడ్డారు.

విదేశాలలోని సైన్యాల ఉపసంహరణకు కృశ్చేవ్ ప్రతిపాదన

యూరప్‌నుంచి పాశ్చాత్య సేనలు పోతే, రష్యా సేనలుకూడా పోతాయని ప్రకటన

బుడాపెస్ట్‌సమీపంలో జరిగిన బహిరంగసభలో ప్రసంగం

బుడాపెస్టు, ఏప్రిల్ 8

పశ్చిమ యూరప్ దేశాలలోని పాశ్చాత్య సేనలను ఉపసంహరణకు అంగీకరిస్తే, తూర్పు యూరప్ దేశాలనుంచి సోవియట్ సేనలను తాము ఉపసంహరించగలమని రష్యా ప్రధాని కృశ్చేవ్ ప్రకటించారు.

పశ్చిమ రాజ్యాలు కనుక పశ్చిమ యూరప్ దేశాలనుంచి తమ బలాలను ఉపసంహరించటానికి అంగీకరిస్తే, సోవియట్ యూనియన్ తన సేనలను తూర్పు జర్మనీ, పోలెండ్, రుమేనియా హంగరీ దేశాలనుంచి ఉపసంహరిస్తుందని సోవియట్ ప్రధాని కృశ్చేవ్ ఓగ్‌లెడ్‌లో జరిగిన బహిరంగ సభలో ప్రసంగిస్తూ చెప్పారు.

పశ్చిమ యూరప్ దేశాలనుంచి ఉపసంహరించబడిన పశ్చిమరాజ్యాల సైనిక దళాలను రద్దుచేయటానికి అంగీకరిస్తే, తూర్పు యూరప్ దేశాలనుంచి ఉపసంహరించిన సోవియట్ సైనిక దళాలనుకూడా రద్దుచేస్తామని కృశ్చేవ్ చెప్పారు.

హంగరీలో విప్లవ ప్రతీఘాతకులు ప్రారంభించిన తిరుగుబాటును అణచటానికి జోక్యం కల్పించుకోవాలా వద్దా అన్న విషయంపై అనేక రాత్రుళ్లూ, పగళ్లూ దీర్ఘాలోచన చేసిన పిమ్మటనే జోక్యం కల్పించుకోక తప్పదన్న నిర్ణయానికి సోవియట్ యూనియన్ వచ్చినదని ఆయన వెల్లడించారు.

హంగరీలోని అభివృద్ధినిరోధకులు విదేశాలనుంచి సహాయం పొందుతూ, హంగరీ విప్లవ శక్తులను రక్తపుటేరులలో ముంచెత్తటానికి ఉద్యమించినప్పుడు, ఆ తిరుగుబాటును సైనిక శక్తితో అణచటం తప్ప మరొక మార్గం కన్పించలేదన్నారు.

ఆ రోజున సోవియట్ యూనియన్‌ను అత్యంత క్లిష్టసమస్య ఒకటి ఎదుర్కొన్నది. ఇప్పుడేమి చేయాలి? హంగరీలోని కష్టజీవులకు న్యాయం చేకూర్చడమే సోవియట్ ధ్యేయం.

"అయినప్పటికీ ఆరోజున నిర్దిష్టమైన చర్య తీసుకోవటానికి ఎన్నో విషయాలు ఎంతో దీర్ఘంగా ఆలోచించవలసి వచ్చింది. విప్లవ ప్రతీఘాతకులతో పెడమార్గంపట్టిన కొంతమంది కార్మికులుకూడా చేరారు.

ఒక దేశానికి ఆర్థిక సహాయం చేయటం వేరు; ఆ దేశంలోని విప్లవ ప్రతీఘాతకులను అణచటానికి సైన్యాన్ని పంపించటం వేరు.

వర్గ శత్రువుపై దెబ్బతీయవలసి వస్తే, ఏనాడూ మా చేతులు వణకలేదు. కాని, హంగరీలో వచ్చిన చిక్కల్లా, విప్లవప్రతీఘాతకులలో కొందరు కార్మికులు కూడా వున్నారు. వర్గ శత్రువులకు, తప్పు మార్గం పట్టిన కార్మికులకు మధ్యగల వ్యత్యాసాన్ని తుపాకిగుళ్ళు పాటించలేవుకదా.

మిత్రులారా, నా మాట నమ్మండి. జోక్యం కల్పించుకోవాలన్న నిర్ణయం చేసేముందు మేము అహోరాత్రులు ఎడతెరపిలేని దీర్ఘాలోచన చేశాం. బుడాపెస్టు వీధులలో విప్లవ ప్రతీఘాతకులు కమ్యూనిస్టులను ఉరితీసి, చంపుతున్నందున, కార్మికవర్గానికి చెందిన ఉత్తమ పుత్రులను నిలబెట్టి, కాల్చి చంపుతున్నందున, ఫాసిస్టులు అధికారం హస్తగతం చేసుకోవాలని చూస్తున్నందున, మేము జోక్యం కల్పించుకోక తప్పలేదు. ఆరోజున సోవియట్ సైన్యం జోక్యం కల్పించుకోకపోతే, హంగరీ ప్రజలు కన్న అత్యుత్తమ కలలన్నీ రక్తపు టేరులలో మునిగిపోయి వుండేవని కృశ్చేవ్ అన్నారు.

* * *

అసమానతను తొలగించడం ద్వారానే సోషలిజాన్ని సాధించడం సాధ్యం అని ప్ర. సో. పార్టీ అధ్యక్షుడు శ్రీ గంగాశరణ్‌సిన్హా అంటున్నారు.

జాతీయైక్యత అత్యంత ప్రధానం

పత్రికా గోష్ఠిలో శ్రీ అజయఘోష్ ఉద్ఘాటన

రత్నసింగ్‌నగర్ (అమృతసర్), ఏప్రిల్ 7

"భారత జాతీయైక్యతను పదిలపరచడం అత్యంత ప్రధానమని మాపార్టీ భావిస్తూంది. కమ్యూనిస్టుపార్టీనీ, దేశంలోని ప్రజాతంత్ర శక్తులనూ మరింత బలపరచడం వల్లనే ఈ జాతీయైక్యతా రక్షణ సాధ్యంకాగలదు" అని భారత కమ్యూనిస్టుపార్టీ ప్రధాన కార్యదర్శి శ్రీ అజయఘోష్ నేడు రత్నసింగ్‌నగర్‌లో ఒక పత్రికా గోష్ఠిలో ప్రసంగిస్తూ అన్నారు.

ఇక్కడ జరుగుతూన్న పార్టీ ప్రత్యేక మహాసభ సందర్భంలో ముసాయిదా తీర్మానాలను పత్రికలకు విడుదలచేశారు. అజయఘోష్ పత్రికాగోష్ఠి ఈ సందర్భంలోనే జరిగింది.

జాతీయైక్యతా పరిరక్షణ విషయమై ఆయన ఇంకా ఇలా అన్నారు: "చాలకాలం క్రిందట కాంగ్రెసు దేశం అంతటా జాతీయైక్యతను సాధించినది. కాని, ఆ కాంగ్రెసు

(మిగతా 4 వ పేజీలో)

కేరళలో నెహ్రూ కార్యక్రమం

తిరువనంతపురం, ఏప్రిల్ 7

ప్రధాని నెహ్రూ ఈనెల 24వ తేదీ మధ్యాహ్నం ఇక్కడికి ప్రత్యేక విమానంమీద వస్తున్నారు. ఆయన ఇక్కడ నాలుగు రోజులుంటారు. ఏప్రిల్ 26 వ తేదీన తిరుచూర్‌లో ఇంజనీరింగు కళాశాలకు శంకుస్థాపన చేస్తారు.

నీడకరలోని మత్స్యకేంద్రాన్ని కయంకుళంలోని కొబ్బరి పరిశోధన కేంద్రాన్ని, కొచ్చిన్ హార్బరుని ఆయన సందర్శిస్తారు.

తిరువనంతపురంలో మహాత్మాగాంధి కళాశాలకు 24న ఆయన ప్రారంభోత్సవం చేస్తారు. అల్లెప్పీ, కాలికట్టు బహిరంగసభల్లో ప్రసంగిస్తారు.

ఏప్రిల్ 27న కన్ననూరులో జరిగే కేరళ ప్రదేశ్ కాంగ్రెసు రాజకీయ మహాసభలో పాల్గొంటారు. ఆ మర్నాడు ఎర్నాకుళం నుంచి ఢిల్లీకి బయలుదేరుతారు.

నెహ్రూ టిబెట్ సందర్శన

పార్లమెంటులో వెల్లడి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 8

చైనా ప్రభుత్వఆహ్వానంపై ప్రధాని నెహ్రూ త్వరలో టిబెట్‌ను సందర్శించబోతున్నారు. ఆయన అక్కడ వారం పదిరోజులు గడుపుతారు.

శ్రీ భక్తదర్శన్ వేసిన ప్రశ్నకు సమాధానమిస్తూ శ్రీ నెహ్రూ పై విషయం లోక్‌సభలో నేడు వెల్లడించారు.

వేసవికాలంలో ఢిల్లీలో మంటెత్తి పోతుంది కనుక చల్లని ప్రాంతమైన టిబెట్‌కు వెళ్ళాలని ప్రధాని మంత్రి అనుకొంటున్నారా అని శ్రీ భక్తదర్శన్ ప్రశ్నించారు. కైలాసాన్ని మానస సరోవరాన్ని కూడా ప్రధాన మంత్రి సందర్శించబోతున్నారా అని కూడా ఆయన అడిగారు.

ఇంకా ఆ విషయం తాను ఆలోచించలేదని ప్రధాని నెహ్రూ చెప్పారు.

నేడే చూడండి!
మ్యాటినీతో ప్రారంభం
నాగేశ్వరరావు · అంజలీదేవి
రంగారావు..రేలంగి..ఎ.వి.సుబ్బారావు...మాస్టర్ బాబ్జీ
పుష్పవల్లి...ఇ.వి.సరోజ....సంధ్య....సీత
కోడేరు వస్తాదురాజు...నల్లరామమూర్తి...సీతారామ్
గుమ్మడి వెంకటేశ్వరరావు (గెస్టుఆర్టిస్టు)
వంగర.... ఎ.యల్.నారాయణ
కథ-మాటలు: సదాశివబ్రహ్మం
పాటలు...... ఆరుద్ర, కొసరాజు
కెమెరా........ సి.నాగేశ్వరరావు
కళ........ వాలి
నృత్యం........ వి.జె.శర్మ
స్టూడియో...... వాహిని
బి.ఏ.యస్. ప్రొడక్షన్స్ వారి......
చెంచులక్ష్మి
మహోత్తర పౌరాణిక జానపద చిత్రం.
నవయుగ రిలీజ్.
నిర్మాత-దర్శకుడు.... బి.ఏ.సుబ్బారావు
మ్యూజిక్.... యస్.రాజేశ్వరరావు.

విళంబి నామ సంవత్సర
చాంద్రమాన చైత్ర బహుళ
షష్ఠి రా 10-27
జ్యేష్ఠ 8 - 8

విశాలాంధ్ర

బుధవారం 9-4-58
చైత్ర-19-1880

చేతగానితనానికి నిదర్శనం

లోక్‌సభలో సమాచార, బ్రాడ్ కాస్టింగ్ శాఖ పద్దుపై చర్చ జరిగినప్పుడు వచ్చిన నిశితమైన విమర్శనలకు ఆ శాఖ మంత్రి డాక్టర్ కేస్కర్ యిచ్చిన సమాధానం ఎవరినీ సంతృప్తి పరచదు. ప్రెస్ కమిషన్ సిఫార్సులను అమలు జరపడంలో ప్రభుత్వం విఫలమైన మాట నిజమేనని మంత్రి అంగీకరించారు; ముమ్ముందు అమలుజరపడానికి ప్రభుత్వం ప్రయత్నిం చేస్తుందని వాగ్దానం చేశారు. కాని వార్తాపత్రికలపై కొలది మంది ధనాఢ్యులు సంపాదించిన గుత్తాధికారాన్ని తొలగించడానికి ప్రభుత్వం ఏమి చర్యలు తీసికోదలచిందో డాక్టర్ కేస్కర్ తెలుపలేదు.

దేశమంతటా విస్తృత ప్రచారంగల పత్రికలలో ఎక్కువ భాగం కొలదిమంది ధనాఢ్యుల చేతుల్లోవున్నాయనే సంగతిని ప్రెస్ కమిషన్ ప్రభుత్వదృష్టికి తెచ్చింది. 1957 లో ప్రెస్ రిజిస్ట్రార్ ప్రకటించిన లెక్కలు కూడా అదేవిషయాన్ని రుజువు చేశాయి.

ప్రెస్ కమిషన్ నివేదిక ప్రకారం 1954 నాటికి మొత్తం అమ్ముడవుతున్న పత్రికలలో నూటికి 51.1 వంతులు 15మంది పత్రికాధిపతుల చేతుల్లో వుండేవి. ప్రెస్‌రిజిస్ట్రార్ లెక్కల ప్రకారం 1957 నాటికి ప్రచురింపబడుతున్న పత్రికలమొత్తం కాపీలలో నూటికి 64 9 వంతులు కేవలం 15 మంది పత్రికాధిపతుల చేతుల్లో వున్నాయి. అనగా 1954 నాటికంటే 1957 నాటికి పత్రికలపై గుత్తాధికారం పెరిగిందే గాని తరుగలేదు.

ప్రెస్ కమిషన్ సిఫార్సులను, వేతనసంఘు సూచనలనూ భగ్నం చేయడానికి కోటీశ్వరులైన పత్రికాధిపతులు పూనుకున్నారు. అనేక వక్ర మార్గాలను అనుసరించి వేతన నిర్ణయసంఘు సూచనలను అమలు జరుగనివ్వకుండా చేయగలిగారు. కాని, పత్రికావ్యాపారంలో పాదుకుపోతున్న గుత్తాధికారుల పెత్తనాన్ని తొలగించడానికి ప్రభుత్వం యింతవరకు ఎలాంటి చర్యా తీసుకోలేదు.

పుటల సంఖ్యనుబట్టి పత్రికల ధరను నిర్ణయించాలని కూడ ప్రెస్ కమిషన్ సిఫార్సు చేసింది. క్రిందటి సంవత్సరం బడ్జెటు సమావేశం నాటినుంచి డాక్టర్ కేస్కర్ పై సూచనను అమలు జరుపుతామని వాగ్దానం చేస్తూ వచ్చారు. కాని పత్రికల గుత్తాధిపతులకు యీ సూచన సుతరాం గిట్టనందున వ్యతిరేకించుతూ వచ్చారు. ఏడాది గడచిపోయినా మంత్రిగారి వాగ్దానం అమలు జరుగలేదు. మళ్ళీ యీ సంవత్సరం కూడా డాక్టర్ కేస్కర్ అలాగే వాగ్దానం చేస్తున్నారు. ఈసారి మాత్రం అమలు జరుపుతారనే నమ్మకం ఏమిటి?

ఆకాశవాణి కేంద్రాలను అభివృద్ధి చేయడంలో కూడ బ్రాడ్ కాస్టింగ్ శాఖ పక్షపాత వైఖరిని అనుసరించుతూందని చెప్పవలసి వుంటుంది. ఇప్పటికే మద్రాసు రాష్ట్రంలో తిరుచునాపల్లి, మద్రాసు రేడియో కేంద్రాలు ఉత్తమ ప్రసార కేంద్రాలుగా వున్నాయి. తిరుచునాపల్లి కేంద్రంలో 50 కిలోవాట్ల ట్రాన్స్మిటర్ యంత్రాన్ని నెలకొల్పాలనీ, రెండు చోట్లా స్టూడియోలకు కొత్త బిల్డింగులు కట్టాలనీ స్కీములు వేశారు.

50 వేల చదరపు మైళ్ళ వైశాల్యం మాత్రము వున్న మద్రాసు రాష్ట్రంలో బ్రాడ్ కాస్టింగ్ సౌకర్యాలు ఇలా అభివృద్ధి చేస్తున్నందుకు సంతోషమే. కాని లక్షా పదివేల చదరపు మైళ్ళ వైశాల్యం గల ఆంధ్ర ప్రదేశ్‌లో యింతవరకు విజయవాడ, హైద్రాబాద్ రేడియో కేంద్రాలు రెండూ తగినంతగా అభివృద్ధి చెందలేదు. విజయవాడ రేడియో కేంద్రానికి యింతవరకు స్వంత బిల్డింగ్ కూడా లేనందున అద్దె కొంపలోనే వుంటూంది.

కొత్త ప్రాజెక్టులలో భాగంగా హైద్రాబాద్‌లో 10 కిలోవాట్ల ట్రాన్స్మిటర్‌ను నెలకొల్పుతామని శ్రీ కేస్కర్ అన్నారు. కాని యింతమాత్రాన తెలుగు దేశపు అవసరాలు తీరవు.

ఆంధ్రప్రదేశ్ అన్ని ప్రాంతాలకు రేడియో ప్రసారం అందాలంటే, మూడుకోట్ల ఇరవై లక్షల ప్రజలకూ ఈ సౌకర్యం వినియోగించుకునే అవకాశం వుండాలంటే, రెండు రేడియో కేంద్రాలలోనూ శక్తివంతమైన ట్రాన్స్మిటర్లను నెలకొల్పాలిసి వుంటుంది. విజయవాడ కేంద్రానికి స్వంతభవనం నిర్మించవలసి వుంటుంది.

భూసంస్కరణలపై కేరళ ప్రతిపక్షాల వైఖరి

మాటల్లో బలపర్చుతూ ఆచరణలో వ్యతిరేకిస్తున్నారని ప్రభుత్వపక్ష విమర్శ

[ఐ. పి. ఏ. వార్తాసంస్థ]

తిరువనంతపురం, ఏప్రిల్ 7

కేరళ శాసనసభలో వ్యవసాయ సంస్కరణ బిల్లుపై రెండు రోజుల పాటు జరిగిన చర్చలో పాల్గొన్న ప్రభుత్వపక్ష సభ్యులు, ప్రతిపక్ష సభ్యులు మొత్తం మీద బిల్లును బలపర్చుతూ ప్రసంగించినప్పటికీ ప్రభుత్వ పక్షానికి, ప్రతిపక్షాలకు మధ్య ముఖ్యమైన అభిప్రాయభేదాలున్నట్లు స్పష్టమైందని ఐ. పి. ఏ. ప్రత్యేక విలేఖరి వ్రాస్తున్నాడు.

కమతాల గరిష్ట పరిమితి విషయంలోనూ, నష్టపరిహారంవిషయంలోనూ ప్రతిపక్ష సభ్యులు సూచించిన మార్పులు ఆమోదిస్తే, అసలు వ్యవసాయ సంస్కరణల వల్ల ఎలాంటి ప్రయోజనం కలుగబోదని ప్రభుత్వపక్ష సభ్యులు విమర్శించారు.

భూమి విస్తీర్ణం ప్రాతిపదికపైన గాక, ఆదాయ ప్రాతిపదికపై కమతాల పరిమితిని నిర్ణయించాలంటూ ప్రతిపక్ష సభ్యులలో కొందరు కమతాల పరిమితిని కుటుంబ ప్రాతిపదికపైన కాక, వ్యక్తి ప్రాతిపదికపైన నిర్ణయించాలన్నంత దూరంకూడా పోయారు.

నష్టపరిహార సమస్య

భూస్వాములకు మార్కెట్టు రేటు ప్రకారం నష్టపరిహారం చెల్లించాలనీ, సగసమైన కౌలురేటుకు 16 రెట్లు నష్టపరిహారం మాత్రమే యివ్వటం చాలా అన్యాయమనీ కాంగ్రెసు నాయకుడు శ్రీ పి. టి. చాకో వాదించారు.

ఈ బిల్లు శాసనమైన తర్వాత ఒక సంవత్సరంపాటు భూస్వాములు తమ భూములను ఇతరులకు అమ్ముకోటానికి అవకాశం యివ్వాలనీ, గరిష్ట పరిమితికి తక్కువ భూమిగల రైతులు గరిష్ట పరిమితి వరకు భూములు సంపాదించుకోటందుకు వీలు కల్పించాలనీ ప్రతిపక్ష సభ్యులు వాదించారు. ఆతర్వాత భూస్వాముల వద్ద యింకా ఏమన్నా భూములు మిగులు తేలితే, వాటిని మాత్రమే ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని వారు అన్నారు.

బాండ్లు వద్దు: డబ్బే కావాలి

భూస్వాములకు చెల్లించే నష్టపరిహారాన్ని బాండ్ల రూపంలోకాక, డబ్బు రూపంలోనే ముట్టచెప్పాలని శ్రీ పి. టి. చాకో కోరారు.

పోతే రెండు రోజుల చర్చలోను ప్రభుత్వపక్షం తరఫున రెవెన్యూ మంత్రి శ్రీమతి గౌరీ థామస్, శ్రీ ఇ. గోపాలకృష్ణమీనన్ గార్లు మాత్రమే మాట్లాడారు. ఈ విధంగా ప్రతిపక్ష సభ్యులు తమ అభిప్రాయాలను పూర్తిగా వ్యక్తం చేయటానికి ప్రభుత్వపక్షం అవకాశం కల్పించారు.

శ్రీ ఇ. గోపాలకృష్ణమీనన్ తన ప్రసంగంలో ఇలా చెప్పారు:

ప్రతి పక్షాలవారు పైకి బిల్లును సమర్థిస్తున్నట్లు కనిపిస్తున్నా, ఆదరణలో బిల్లులోని అంశాలన్నింటినీ ప్రతిఘటిస్తున్నారు. చివరకు కేరళలోని భూస్వాములు కూడా వ్యవసాయ సంస్కరణలకు తాము సుముఖులమేనని చెప్పుతూ, అయితే మార్కెటు రేటుప్రకారమే తమకు నష్టపరిహారం యివ్వాలని కోరుతున్నారని ఆయన అన్నారు. భూస్వాముల వాదనలనే ప్రతిపక్షాల వారు శాసనసభలో వల్లించారని ఆయన విమర్శించారు.

చిన్న చిన్న భూస్వాముల రక్షణ కల్పించేందుకు ప్రభుత్వపక్షం సిద్ధంగా వుందని ఆయన హామీ యిచ్చారు.

* * *

కేరళలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని ప్రజాసోషలిస్టు నాయకుడు పట్టంథానుపిళ్లే అంటున్నారు.

అరబ్ రిపబ్లిక్‌లో ప్రజాతంత్ర వ్యవస్థ

క్రమేణా సాధ్యమని నాజర్ వెల్లడి

న్యూయార్కు, ఏప్రిల్ 6

ఐక్య అరబ్ రిపబ్లిక్ క్రమేణా ప్రజాతంత్ర వ్యవస్థని సాధిస్తుందనీ, ప్రస్తుతం ఈజిప్టులో సంపూర్ణ ప్రజాస్వామ్యం లేదనీ, అయితే ప్రజాతంత్రవ్యవస్థ నెలకొన్నతర్వాత పరస్పర విరుద్ధమైన మూడుపార్టీలు దేశంలో వుంటాయనీ కొలంబియ రేడియో వార్తా ప్రసార శాఖకి చెందిన ఫ్రాంక్ కిరన్స్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఐక్య అరబ్ రిపబ్లిక్ అధ్యక్షుడు నాజర్ అన్నారు. నాజర్ ఇంటర్వ్యూని ఫిలింతీసి అమెరికా టెలివిజన్‌వారు నేడు ప్రసారం చేశారు. ఫ్రాంక్ కిరన్స్‌తో జరిపిన ఇంటర్వ్యూలో తన దేశంలోని రాజకీయ వ్యవస్థనిగూర్చి మాట్లాడుతూ నాజర్ యింకా యిలా అన్నారు.

ఒక పార్టీ పశ్చిమ దేశాలకి అంటిపెట్టుకొని వుండమని అంటుంది. అటువంటివాళ్లు విప్లవ ప్రతీఘాతక వర్గం-వారినే ఫెడరలిస్టులంటాం. మరో పార్టీవారు ఏ పక్షానికీ అంటిపెట్టుకుని వుండక తటస్థ దేశంగా వుండాలని కోరుకుంటారు. ఈ వర్గం వారు జాతీయవాదులు. మూడవ పార్టీ- కమ్యూనిస్టుపార్టీ. సోవియట్ యూనియన్‌తోను, ప్రాచ్యదేశాలతోను సన్నిహితంగావుండాలని వీరంటారు. అయితే దేశం ఈనాడు యింతటి వైవిధ్యాన్ని తట్టుకునే దశలోలేదు. దేశంలోని ఫ్యూడలిస్టుల నుండీ, భూస్వాముల పలుకుబడి నుండి ఈజిప్ట్ పౌరుల్ని విముక్తిచేసిన తర్వాతనే మేము క్రమేణా ప్రజాతంత్ర వ్యవస్థకి చేరుకుంటామని భావిస్తున్నాను.

సోవియట్ అందించిన సహాయాన్ని ఈజిప్ట్ ఎందుకు అంగీకరించిందన్న ప్రశ్నకు సమాధానంగా ఆర్థిక ఒత్తిడినుంచి, ఆకలి చావుల్నుంచి మమ్మల్ని మేము రక్షించుకోడానికి తీసుకున్న చర్యయే యిది అని నాజర్ అన్నారు.

మాకు విదేశీకరెన్సీలోటు ఏర్పడ్డప్పుడు, అగ్రరాజ్యాలు విధించిన ఒత్తిడినుంచి తప్పించుకో ప్రయత్నించినప్పుడు రష్యా మాకు సాయం చేసింది. మాకు ప్రధాన పంటయైన పత్తిపంటనమ్మడానికి ప్రయత్నించాం. కాని మామీద అమెరికా ఆర్థిక దిగ్బంధనం విధించింది. అప్పుడు మాకుసాయంచేసింది రష్యాయే అని కూడా నాజర్ అన్నారు.

'వివిధ పార్టీలను ఐక్య పర్చటమే నా ధ్యేయం'

ఢిల్లీ మేయరు ఎన్నికపై శ్రీమతి అరుణా అసఫలీ ప్రకటన

న్యూఢిల్లీ, ఏప్రిల్ 7

ఢిల్లీ కార్పొరేషన్‌లోని వివిధ పార్టీలను, స్వతంత్రులను ఒక త్రాటిపైకి తీసుకురావటానికి తన అభ్యర్థిత్వం దోహదకరమైన పక్షంలోనే తాను మేయరు పదవికి పోటీ చేసేందుకు అంగీకరిస్తానని తెలుపుతూ శ్రీమతి అరుణా అసఫలీ నేడొక పత్రికా ప్రకటన చేశారు. ఆ ప్రకటనలో ఆమె యింకా ఇలా వివరించారు:

“నేనేదో మేయరుపదవికోసం ప్రాకులాడుతున్నట్లు కొన్ని పత్రికలు ప్రచారం ప్రారంభించాయి. వివిధ పార్టీలను, స్వతంత్రులను ఏక త్రాటిపైకి తీసుకురావటానికి నా అభ్యర్థిత్వం తోడ్పడేపక్షంలో మాత్రమే మేయరు పదవికి పోటీచేస్తానని నేను వివిధ పార్టీలవారికి ఇంతకు ముందే స్పష్టం చేశాను. ఢిల్లీ కార్పొరేషన్ లోని వివిధ పక్షాలు సమైక్యం కాకపోతే, కార్పొరేషన్ వ్యవహారాలు ఏమాత్రం బాగుపడబోవు. ప్రజలకు ఎలాంటి సౌకర్యాలు కల్గించుటం సాధ్యం కాదు; అందుచేత నా అభ్యర్థిత్వం వల్ల యిప్పటికే వున్న చీలికలు మరింతగా హెచ్చిన పక్షంలో నేను అసలు మేయరు పదవికి పోటీ చేయబోను” అని ఆమె తన ప్రకటనలో పేర్కొన్నారు.

మైనింగ్ ఇన్‌స్టిట్యూట్ నిర్మాణంలో జాప్యం

ఆంధ్ర ప్రభుత్వ అశ్రద్ధ

('విశాలాంధ్ర' విలేఖరి)

న్యూఢిల్లీ, ఏప్రిల్ 8

కొత్తగూడెంలో కేంద్రప్రభుత్వం స్థాపించనున్న మైనింగ్ ఇన్‌స్టిట్యూట్ ఇంకా ఏర్పాటు కాకపోవటానికి ఆంధ్రప్రభుత్వంయొక్క అశ్రద్ధే కారణమని ఇక్కడ తెలుస్తుంది.

ఈ సంస్థకోసం భవనాల నిర్మాణానికి 3 లక్షల రూపాయలను కేంద్ర ప్రభుత్వం గత సంవత్సరం జూలై నెలలోనే ఆంధ్రప్రభుత్వానికి మంజూరు చేసింది.

ఆ భవనాల నిర్మాణానికి ప్లానులు, ఎస్టిమేట్లు తయారుచేసి పంపటానికి రెండు నెలలు పట్టింది.

ఆంధ్ర ప్రభుత్వం తయారు చేయించి పంపిన ఎస్టిమేటు 3 లక్షల రూపాయలను మించినా కూడా కేంద్ర ప్రభుత్వం అదికూడా మంజూరు చేసింది.

ఇప్పటికి ఆరు నెలలు పైన కావస్తున్నా అక్కడపని ప్రారంభమయ్యే సూచనలే కానరావటంలేదు.

ఫిబ్రవరి నెలలోనే నిర్మాణం ప్రారంభించు తున్నామని ఆంధ్ర ప్రభుత్వం తమకు తెలియ చేసిందనీ, అయినా ఇంకా ప్రారంభించక పోవటం “తనకు ఆశ్చర్యం కలుగ చేస్తూందని” ఆ శాఖ డిప్యూటీ మంత్రి ఒక లేఖలో పార్లమెంటు సభ్యులైన శ్రీ టి. బి. విఠలరావుగారికి వ్రాశారని తెలుస్తూంది.

ఈ సంస్థ ప్రస్తుతం తాత్కాలికంగా హైదరాబాదు నగరంలోనే నడుస్తూంది.

హైదరాబాదు నుంచి కొత్తగూడెం వెళ్ళటానికి కొంతమంది వ్యక్తుల అభ్యంతరమే ఈ ఆలస్యానికి కారణమని తెలుస్తూంది.

లోహియాపై నిశిత విమర్శ

పశ్చిమ బెంగాల్ సోషలిస్టు పార్టీ మహాసభలో శ్రీ పి. వి. జి. రాజు ప్రసంగం

కలకత్తా, ఏప్రిల్ 7

సోషలిస్టు, ప్రజాసోషలిస్టు పార్టీలను సంలీనం చేయటంద్వారా దేశంలో ఐక్యసోషలిస్టు ఉద్యమాన్ని నిర్మించగల్గుతామని పార్లమెంటులో సోషలిస్టుగ్రూపు నాయకుడు శ్రీ పి. వి. జి. రాజు నేడిక్కడ పశ్చిమ బెంగాల్ సోషలిస్టు మహాసభలో మాట్లాడుతూ చెప్పారు.

ఐక్య సోషలిస్టు ఉద్యమాన్ని నిర్మించే విషయంలో సోషలిస్టు పార్టీ నాయకుడు డాక్టరు లోహియా వైఖరిని శ్రీ పి. వి. జి రాజు నిశితంగా విమర్శించారు.

సోషలిస్టుపార్టీ నాయకత్వంలో ఫాసిస్టు పోకడలు ద్యోతకమవుతున్నాయని శ్రీ రాజుగారు అన్నారు. ఐక్య సోషలిస్టు ఉద్యమం నిర్మించాలని కోరేవారందరినీ డాక్టరు లోహియా విద్రోహులుగా చిత్రించటం సమంజసం కాదన్నారు.

తరువాత పార్లమెంటు సభ్యుడు శ్రీ ఆంథోనీపిళ్ళే ప్రసంగిస్తూ, ఐక్య సోషలిస్టు ఉద్యమ నిర్మాణావశ్యకతను వక్కాణించారు.

రాజకీయాల నుంచి లోహియానిష్క్రమణ

లక్నో, ఏప్రిల్ 7

డాక్టరు రామ మనోహర్ లోహియా సోషలిస్టు పార్టీకి రాజీనామా యిస్తారనీ, అసలు రాజకీయరంగంనుంచే పూర్తిగా నిష్క్రమిస్తారని ఆయన సన్నిహితులు అంటున్నారు.

ప్ర. సో. పార్టీ మహాసభ

మే 25 న పూనాలో

కోయంబత్తూరు, ఏప్రిల్ 7

అఖిలభారత ప్రజా సోషలిస్టు పార్టీ మహాసభ పూనాలో మే 25, 26, 27 తేదీలలో జరుగుతుంది.

ఈ విషయాన్ని నేడిక్కడ ఆ పార్టీ అధ్యక్షుడైన శ్రీ గంగాశరణ్ సిన్హా తెలియజేశారు. ఈ మహాసభకు విదేశాలనుండికూడా సౌహార్ద ప్రతినిధులు హాజరవుతారన్నారు.

ఎన్. జి. ఓ. ల లాంఛన సమ్మె

పశ్చిమ కృష్ణా ఉద్యోగుల సమావేశంలో నిర్ణయం

విజయవాడ, ఏప్రిల్ 7

పశ్చిమ కృష్ణా ఎన్. జి. ఓ. ల సంఘ సర్వసభ్య సమావేశం ఏప్రిల్ 7 వ తేదీన శ్రీ జె. వి. రాజారావు గారిఅధ్యక్షతన జరిగింది. రాష్ట్ర సంఘ ఆదేశానుసారం ఏప్రిల్ 16 వ తేదీన ఎన్. జి. వో. లంతా సెలవు పెట్టాలనీ, రాష్ట్ర ప్రభుత్వం ఇంతవరకు పే కమిషన్‌ను నియమించనందుకు నిరసన తెల్పాలనీ ఈ సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించారు.

ఈ సమావేశానికి 300 మంది ఎన్. జీ. వోలు హాజరయ్యారు.

అఖిలభారత కాంగ్రెసు సంఘ సమావేశం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 7

అఖిలభారత కాంగ్రెసు సంఘ సమావేశం మే 10, 11 తేదీలలో ఢిల్లీలో జరుగుతుందని నేడు అధికారికంగా ప్రకటించారు.

గోల్కొండవద్ద వ్యవసాయ క్షేత్రాలు

ఆంధ్రప్రభుత్వ పథకం

హైద్రాబాదు, ఏప్రిల్ 8

గోలుకొండ కోటవద్ద సుమారు మూడువందల ఎకరాల భూమిని వ్యవసాయ క్షేత్రాలుగా విభజించి కౌలుకివ్వాలని నిశ్చయించినట్లు ఆంధ్ర ప్రభుత్వం నేడొక ప్రకటన చేసింది.

జిల్లాకలెక్టరు నిర్ణయించిన రేటు మేరకు యీ భూమిని అయిదేళ్ళ పర్యంతం కవులు కిస్తారు.

దరఖాస్తుదార్లలో ఈ క్రింద పేర్కొన్న వర్గాలవారికి వరుస క్రమంలో ప్రాధాన్యమిస్తారు.

(1) ప్రస్తుతం ఆ భూమిపై ఖబ్జా గలవారు (2) ఖామందులు స్వంత సేద్యంకోసం భూములు తీసుకోనగా బేదఖలు అయినవారు (3) మాజీ సైనికులు (4) వ్యవసాయ సహకార సంఘాలలో సభ్యులుగా వున్న నిజమైన వ్యవసాయదార్లు (5) సహకార సంఘాలలో సభ్యులుగా వున్న భూమిలేని నిరుపేదలు (6) స్కూలుఫైనలు వరకు చదువుకొని నిరుద్యోగులుగా వున్న భూమిలేని నిరుపేదలు. (వి. వి.)

దేశంలోకల్లా పెద్ద పారిశ్రామిక క్షేత్రం

ఏప్రిల్ 12న ప్రారంభోత్సవం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 7

రెండో ప్రణాళికా కాలంలో దేశంలో స్థాపించే మొత్తం 150 పారిశ్రామిక క్షేత్రాలన్నింటిలోకి పెద్దదైన 'ఓఖ్లా' పారిశ్రామిక క్షేత్రాన్ని ప్రధాని నెహ్రూ ఏప్రిల్ 12 వ తేదీన ప్రారంభిస్తారు. ఈ క్షేత్రం ఢిల్లీకి ఆగ్నేయంగా 12 మైళ్ళ దూరంలో స్థాపించబడుతోంది.

ఈ క్షేత్రం వైశాల్యం 110 ఎకరాలు. మొదటిదశ నిర్మాణం పూర్తయింది. మొదటిదశలో 35 ఫ్యాక్టరీలు, వాటిల్లో పనిచేసే ఉద్యోగులకు అవసరమైన గృహాలు, ఒక బ్యాంకు, ఒకపోస్టు ఆఫీసు, ఒక వైద్యశాల రెండు కాఫీ హోటర్లు నిర్మించబడ్డాయి. వీటి నిర్మాణానికి 58 లక్షలు ఖర్చయింది.

పోతే రెండవదశ నిర్మాణం త్వరలో ప్రారంభమవుతుంది. రెండోదశలో 100 ఫ్యాక్టరీలు స్థాపిస్తారు. రెండవదశ నిర్మాణ వ్యయం కోటి రూపాయలదాకా వుండవచ్చు.

కేరళకార్మికవిధానం

తిరువనంతపురం, ఏప్రిల్ 7

కేరళ ప్రభుత్వం తిరువాన్కూరు, కొచ్చిన్-మలబారు ప్రాంతాలలోగల వివిధ కార్మిక చట్టాలను సమన్వయిస్తోంది.

గత ఆర్నెల్లలోనూ కార్మిక తగాదాల పరిష్కారానికి ఎన్నో లేబరు కోర్టులను నియమించింది. తగాదాలు పరస్పరం గౌరవంతో పరిష్కరించుకునే పద్ధతిని ప్రోత్సహిస్తూ వచ్చింది. నిర్బంధ అడ్యుడికేషన్ విధానాన్ని తగ్గించడం ప్రభుత్వా అభిమతం.

ఈ ఆర్నెల్లలోనూ మొత్తం 2775 తగాదాలలో 104 మాత్రమే ఉభయ పక్షాల సమ్మతితో అడ్యుడికేషనుకు పంపారు.

బర్తరపు అయిన కార్మికునికి ఈ అడ్యుడికేషన్ కాలంలో ఆర్థిక సహాయానికి ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఇలాంటి ఏర్పాటు చేసిన రాష్ట్రం దేశం మొత్తంమీద ఇదొక్కటే.

వ్యవసాయం, ఏలకులతోటలు, కల్లుగీత వృత్తులలోవున్న వారికి ఈ కాలంలో కనీస వేతనాలను నిర్ణయించారు.

క్యూబాలో తిరుబాటు

హవానా (క్యూబా), ఏప్రిల్ 6

ఇటీవల క్యూబాలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా తలెత్తిన తిరుగుబాటు నెలా రెండు నెల్లలో అంతమొందుతుందని తానుభావిస్తున్నాననీ, తిరుగుబాటు దళాధిపతి ఫైడెల్ కాస్ట్రోని పట్టి, విచారణలు జరిపించాలని తన కోరికయనీ, నేడుక్యూబా అధ్యక్షుడు ఫుల్‌జెన్సియో బాటిస్టా అన్నారు.

ఇక్కడికి 15 మైళ్ళ దూరంలో వున్న తన గ్రామీణ ప్రాంత ఎస్టేట్‌ని సందర్శిస్తున్న విదేశీ పత్రికా విలేఖరుల్ని ఉద్దేశిస్తూ బాటిస్టా పైవిధంగా అన్నారు.

'కేంద్రప్రభుత్వ కార్మికవిధానం మరికొంత మారాలి'

లోక్‌సభలో ప్రతిపక్ష సభ్యుల విజ్ఞప్తి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 7

కేంద్ర ప్రభుత్వ కార్మిక మంత్రిత్వశాఖ మరింతగా కార్మిక అనుకూల వైఖరిని చేపట్టాలని లోక్‌సభలో కార్మిక శాఖ పద్దుపై జరిగిన చర్చలో పాల్గొన్న ఇద్దరు ప్రతిపక్ష సభ్యులు కోరారు.

ఈ పద్దుపై చర్చ పూర్తికాకుండానే సభ రేపటికి వాయిదాపడింది.

కమ్యూనిస్టుసభ్యుడు శ్రీ ప్రభాత్ కార్ ఈ పద్దుపై జరిగిన చర్చలో పాల్గొంటూ ఇలా చెప్పారు:

కార్మిక విధానాలను పరిష్కరించటంలో నైతేనేమి, కార్మికులకు ఇతోధిక సౌకర్యాలు సాధించటంలో నైతేనేమి, ఒప్పందాలను, తీర్పులను ఖచ్చితంగా అమలు జరిపించటంలో నైతేనేమి, కార్మిక మంత్రిత్వశాఖ తగినంత చొరవను ప్రదర్శించటంలేదు.

కార్మికులకు ప్రయోజనాల సమకూర్చే నిమిత్తం తయారుచేసిన శాసనాలను అమలుజరపటంలో కార్మికులకు సాధ్యమైనంత ఎక్కువన్యాయం చేకూరేటట్లు చూడవలసిన బాధ్యత కార్మిక మంత్రిత్వశాఖపైన కలదు. కాని, దురదృష్టవశాత్తు ఈ శాఖ ఆ విధంగా పనిచేయుటంలేదు. అందువల్ల వివాదాలను సామరస్య పూర్వకంగా పరిష్కరించుకోటం సాధ్యంకాదేమోనన్న అవిశ్వాసం కార్మికులలో ప్రబలిపోతున్నది.

పారిశ్రామిక వివాదాలలో సుప్రీం కోర్టుకు ఎలాంటి ప్రమేయంలేకుండా చేసేందుకు రాజ్యాంగాన్ని సవరించాలని శ్రీ ప్రభాత్ కార్ సూచించారు.

తరువాత స్వతంత్ర సభ్యుడు శ్రీ ఎన్.ఎమ్. జెనిన్జీ ప్రసంగిస్తూ, కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక విధానానికీ, కేంద్ర ప్రభుత్వోద్యోగుల ఉద్యోగ నిబంధనలకు మధ్యగల వైరుధ్యాన్ని తొలగించే నిమిత్తం ఆ నిబంధనలను సవరించాలన్నారు.

రెండో ప్రణాళికలో 80 లక్షల మందికి అదనంగా ఉద్యోగవసతి కల్పించగలమని ప్రభుత్వం ప్రకటించింది. కాని, ఆచరణలో అదనపు ఉద్యోగాలు లేకపోగా, ఉన్న ఉద్యోగాలే ఊడిపోతున్నాయి. నిరుద్యోగుల సంఖ్య పెరిగింది. కౌళి మిల్లులలో పనిచేస్తున్న 25,000 మంది కార్మికులను యజమానులు రిట్రెంచి చేశారని ఆయన చెప్పారు.

కాంగ్రెస్ సభ్యుని సూచన

డాక్టరు మేల్కోటే (కాం - ఆంధ్ర) ప్రసంగిస్తూ, పాత్రికేయుల వేతన నిర్ణాయక సంఘు సిఫారసులను రద్దుచేస్తూ సుప్రీంకోర్టు యిచ్చినతీర్పు కార్మికుల ప్రయోజనాలకు హానికరమైనదన్నారు. కనుక సుప్రీంకోర్టు తీర్పును వమ్ముచేసే విధంగా మరో శాసనం చేయవలసిన అవసరం కలదన్నారు. పత్రికా యజమానులు బర్తరఫు చేసిన పాత్రికేయులందరినీ తిరిగి ఉద్యోగాలలోకి తీసుకొనేటట్లు ప్రభుత్వంచూడాలని, పాత్రికేయులకు ప్రభుత్వం ఉద్యోగరక్షణ కల్పించాలని ఆయన చెప్పారు.

శ్రీ ఎస్. కేశవ (కాంగ్రెసు - మైసూరు) మాట్లాడుతూ, హిందూస్థాన్ విమానకర్మాగారంలో పరిస్థితులు ఏమంతబాగాలేవనీ, అధికారులుకనుక మానవత్వ దృష్టితో ప్రవర్తించి వుంటే, ఈ మధ్య సంభవించిన సమ్మెను నివారించ వీలయ్యేదనీ చెప్పారు.

పబ్లిక్ రంగంలోని పరిశ్రమలలో పనిచేస్తున్న కార్మికుల సమస్యను పరిశీలించేందుకు, ఉన్నతాధికార సంఘాన్నొక దానిని నియమించాలని ఆయన సూచించారు.

భద్రాచలం పడవ ప్రమాదం

కంట్రాక్టరుకు ఆర్నెల్ల శిక్ష

భద్రాచలం, ఏప్రిల్ 7

నిరుడు శ్రీరామనవమి ఉత్సవాల సందర్భంలో వందలాది యాత్రికుల మరణానికి కారకుడైన పడవ కంట్రాక్టరును భద్రాచలం ఫస్టుక్లాసు మేజిస్ట్రేటు విచారించి ఆర్నెల్ల శిక్ష, వేయిరూపాయల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. (వి. వి.)

ఆంధ్ర ప్రభుత్వ ప్రచారోద్యోగులు

ఎంపకానికి కమిటీ నియామకం

హైద్రాబాదు, ఏప్రిల్ 7

ఆంధ్రప్రభుత్వం ప్రచార ఉద్యోగాలకుతగినవారిని యెంచడం కోసం అయిదుగురితో ఒక కమిటీని నియమించింది. ఇందులో నలుగురు డెవలప్‌మెంటు కమిషనరు మున్నగు అధికారులు. అయిదవ వారు “ఆంధ్ర జనత” పత్రిక సంపాదకులు శ్రీ కూచిమంచి సత్య సుబ్రహ్మణ్యంగారు.

ఆంధ్ర ప్రభుత్వం పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను త్రోసిరాజన్న ఉదంతానికి యిది మరొక తార్కాణం.

కేరళలో ప్రభుత్వ కార్యాలయాల చప్రాసీలను కూడా యెంచే పనిని రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్‌కి అప్పజెప్పిన విషయం పాఠకులకు విదితమే. (వి. వి.)

పార్లమెంటు సభ్యత్వానికి టి. టి. కె. రాజీనామా?

మద్రాసు, ఏప్రిల్ 7

పార్లమెంటు సభ్యత్వానికి మాజీ ఆర్థికమంత్రి శ్రీ టి. టి. కృష్ణమాచారి రాజీనామా చేయాలని నిశ్చయించుకొన్నట్టు తెలుస్తోంది.

అయితే ఈయన రాజీనామా చేయుటంవల్ల జరిగే ఉపఎన్నికలో కాంగ్రెసు గెలుపొందే అవకాశం లేనందున, ప్రస్తుతానికి రాజీనామా యివ్వవద్దని మద్రాసు కాంగ్రెసు నాయకులు ఆయన్ని వేడుకొంటున్నారని వినవస్తున్నది.

ఆర్థిక విధానాలపై తాను అవలంబించిన వైఖరి ఎలా సరియైనదో విశదీకరిస్తూ శ్రీ టి. టి. కృష్ణమాచారి ఒక గ్రంథం వ్రాయబోతున్నట్లు తెలియవస్తున్నది. (ఐ. పి. ఏ.)

సంక్షేమ సంఘాధ్యక్షుల సభ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 7

రాష్ట్ర సంక్షేమ సంఘాధ్యక్షుల నాల్గవ వార్షికసభ నేడిక్కడ ప్రారంభమైంది. కేంద్ర సంఘ సంక్షేమసంఘం అధ్యక్షురాలు శ్రీమతి దుర్గాబాయి దేశముఖ్ ఈ సభలో ప్రసంగిస్తూ సంక్షేమశాఖ సర్వతంత్ర స్వతంత్ర శాఖగా ప్రవర్తిస్తున్నదనీ ఇలాంటి స్థితిలో సంక్షేమ కార్యక్రమాలను చాలా చక్కగా అమలు జరపవచ్చుననీ అన్నారు.

కొంతమంది సంక్షేమ సంఘం స్థానే ఒక మంత్రిత్వశాఖ కావాలని కోరుతున్నారనీ మంత్రిత్వశాఖను ఏర్పరచి సంక్షేమసంఘాన్ని రద్దు చేయడం ఉచితం కాదనీ ఆమె అన్నారు.

1957-58 సంవత్సరంలో ఆయా రాష్ట్రాలలో జరిగిన పనిని సమీక్షిస్తూ వివిధ రాష్ట్రాలసంక్షేమసంఘాధ్యక్షులు నివేదికలు సమర్పించారు.

ఈ నివేదికల ప్రకారం వివిధ రాష్ట్రాలసంక్షేమ వికాసకేంద్రాలల్లో పనిచేసే సేవికల సంఖ్య 1998, చేతివృత్తుల అధ్యాపకులసంఖ్య 1320, ముఖ్యసేవికలు 254. మంత్రసానులు 104 మంది.

సంక్షేమసంఘం 1953 లో ఏర్పడింది. అప్పటినుంచి 1958 మార్చి నెలాఖరువరకు వీరు 4547 సంస్థలకు ధనసహాయం చేశారు. ఇలా సహాయం చేసిన మొత్తం 2,31,22,258 రూపాయలు.

ఈజిప్ట్‌తో రష్యా వాణిజ్యం

లండన్, ఏప్రిల్ 7

సోవియట్ యూనియన్ ఈజిప్ట్ నుంచి 35 లక్షల పౌనుల విలువగల ప్రత్తిని ఖరీదు చేయటానికి ఒప్పందం కుదుర్చుకొన్నది. ప్రత్తికిబదులు లక్షన్నర టన్నుల గోధుమను రష్యా ఈజిప్ట్‌కు సరఫరా చేస్తుంది.

రు. 10 ల వేల నిధికి ఆంధ్ర ప్రదేశ్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెసు విజ్ఞప్తి

రాజమండ్రిలో జరిగిన జనరల్ కౌన్సిల్ సమావేశం నిర్ణయాలు

విజయవాడ, ఏప్రిల్ 6

ఆంధ్రప్రదేశ్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెసు జనరల్ కౌన్సిల్ సమావేశం రాజమండ్రిలో మార్చి 31, ఏప్రిల్ 1, 2 తేదీలలో జరిగింది. సమావేశానికి ఎ. పి. టి. యు. సి. అధ్యక్షులు శ్రీ మఖ్దూం మొహియుద్దీన్‌గారు మార్చి 31 న అధ్యక్షత వహించారు. ఏప్రిల్ 1, 2 తేదీలలో శ్రీ మహేంద్ర అధ్యక్షత వహించారు.

సమావేశానికి మొత్తం 70 యూనియన్‌లకు చెందిన 220 మంది ప్రతినిధులు హాజరయినారు. వీరిలో ఎ. ఐ. టి. యు. సి. కి అనుబంధించబడని 10 స్వతంత్ర సంఘాలనుండి వచ్చిన ప్రతినిధులు కూడావున్నారు.

ప్రథమంలో 'అబుల్ కలాం ఆజాద్, పోర్టు అండ్ డాక్ వర్కర్స్ యూనియన్ నాయకులు డిమెల్లో గార్ల మరణాలకు సంతాపం తెలుపుతూ తీర్మానాలు చేశారు.

ఎ. పి. టి. యు. సి. ప్రధాన కార్యదర్శి పార్లమెంటు సభ్యులు అయిన శ్రీ కె. యల్. నరసింహాం గారు ఎ. పి. టి. యు. సి. కార్యకలాపాలు సమీక్షిస్తూ, ట్రేడ్ యూనియన్ ఐక్యత, జీతాలసమస్య ట్రేడ్‌యూనియన్ హక్కులు మొదలగు సమస్యలపై ఎర్నాకుళం ఎ. ఐ. టి. యు. సి. మహాసభ రూపొందించిన విధానాలను వివరించారు. ఎ. పి. టి. యు. సి. బలపడి విస్తృతం అవుతూవున్న యీ దశలో దాని కనుగుణంగా నిర్మాణం పెంపొందనందున యీ సంస్థ నిర్మాణాన్ని, ఆర్థికపరిస్థితులను చక్కబరచడానికి అనుబంధ సంఘాలన్నీ కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఏప్రిల్ 1, 2 తేదీలలో పరిశ్రమవారీ తీర్మానాలు, 'వర్కర్' పత్రికకు సంబంధించిన సమస్యలపై తీర్మానం చర్చించి ఆమోదించడం జరిగింది.

పదివేల రూపాయల నిధి సేకరణకు విజ్ఞప్తి

అఖిలభారత ట్రేడ్‌యూనియన్ కాంగ్రెస్ యొక్క రాష్ట్రశాఖగా ఆంధ్రప్రదేశ్ ట్రేడ్‌యూనియన్ కాంగ్రెస్ చాలాకాలంగా రాష్ట్రంలోని కార్మికుల హక్కులకోసం తీవ్రంగా కృషిచేస్తూ వచ్చింది. నేటికి అది సుమారు 85000 సభ్యత్వంగల కార్మిక సంఘాల కేంద్ర సంస్థగా రూపొంది ఆంధ్రప్రదేశ్‌లో ప్రధాన కార్మిక శక్తిగా పెంపొందింది. రాష్ట్రంలో వివిధ ప్రాంతాలలోని అనుబంధ సంఘాలు ఎన్నో కష్టనష్టాలను ఎదుర్కొని వీరోచిత పోరాటాలు నడపి, అశేషత్యాగాలుచేసి మన రాష్ట్ర సంఘానికి బలాన్ని చేకూర్చాయి.

నేటి మన ఉద్యమ పరిస్థితులలో ప్రతి కార్మిక సంఘము ఎదుర్కొంటున్న అనేక సమస్యలను పరిష్కరించుటకు రాష్ట్ర కేంద్రము యొక్క అవసరం ఆ రోజు కారోజుకు అధికమవుతోంది. అంతేకాక అనేక సమస్యలు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల కార్మిక విధానాలతో ముడిపడియుంటున్నాయి. ఆ పరిస్థితులలో అట్టి సమస్యలను స్థానిక స్థాయిలోగాక రాష్ట్ర స్థాయిలో పరిష్కరించుటకు పూనుకోవలసియున్నది. ఈ పని సంతృప్తికరంగా నెరవేరాలంటే మనరాష్ట్ర కేంద్రాన్ని బలపరచుకోవలసిన ఆవశ్యకత యెంతైనా ఉన్నది.

వివిధ ప్రాంతాలలో నిర్వహింపబడుతున్న వివాదాల పోరాటాల అనుభవాన్ని క్రోడీకరించి రాష్ట్ర కేంద్రంనుండి నాయకత్వం స్థానిక సంఘాల కార్యకలాపాలకు యితోధికంగా తోడ్పడటం ఎంతైనా అవసరం. అన్నే అనేక సమస్యలపై రాష్ట్రవ్యాపిత ఆందోళనలు, ఉద్యమాలు నిర్వహించ వలసిన అవసరం రోజురోజుకు పెరుగుతున్నది. ఈ పని రాష్ట్రకేంద్రం నుండే నిర్వహింపబడాలి. అదేసమయంలో స్థానిక కార్యకలాపాలలో ఎప్పటికప్పుడు సలహాల నిచ్చి తోడ్పడాల్సిన నాయకుడుగా మన కేంద్రం అభివృద్ధి కావలసియున్నది. అంతేకాకుండా ప్రభుత్వం తెస్తున్న చట్టాలపై మనం తీసుకోవలసిన వైఖరిని ఎప్పటికప్పుడు నిర్ణయించుకుని అవసరమైన ఆందోళనను సాగించాల్సిన బాధ్యతకూడా ప్రధానంగా రాష్ట్రకేంద్రంపైవుంది. రాష్ట్ర ఆఫీస్ నిర్వహణకు కార్యకర్తలను పోషించుకోవలసి యున్నది కూడా. ఈ పనులన్నీ సమర్థవంతంగా నిర్వహించాలంటే రాష్ట్రకేంద్రానికి తగు ఆర్థిక స్తోమతను కార్మికులందరూ చేకూర్చవలసిన అవసరం ఎంతైనా వుంది.

పై అవసరాలు దృష్ట్యా రాష్ట్ర కేంద్రానికి యీ సంవత్సరం పదివేల రూపాయల నిధిని సమకూర్చాలని యీ కౌన్సిల్ అభిప్రాయ పడుతున్నది. ఈ నిధిని సమకూర్చుటకు కార్యకర్తలు, అందరు కార్మికులు దీక్షవహించి పనిచేస్తేనే మన రాష్ట్ర కేంద్రం సమర్థవంతంగా పనిచేయుటకు ప్రధాన అడ్డంకిగానున్న ఆర్థిక ఇబ్బందిని మనం తొలగించుకోగలం.

ఈ పదివేల రూపాయల నిధి సేకరణకు ఈ దిగువ రీతిని అన్ని అనుబంధ సంఘాలు, కార్యకర్తలు కృషి చేయాలని ఈ కౌన్సిలు విజ్ఞప్తిచేస్తోంది.

1. అనుబంధ సంఘాలు అన్నీ వెనువెంటనే తమ అనుబంధ రుసుము చెల్లించాలి.

2. స్థానికంగాగల అన్ని సంఘాలు జాయింటు సమావేశము జరిపి స్థానిక కార్యకర్తలతో దళాలను ఏర్పాటు చేసి పేటలలోను, ఫ్యాక్టరీలవద్ద ప్రతి కార్మికుని కలిసి రాష్ట్ర కేంద్ర నిధి వసూలు చేయాలి. దళాలుగా విభజించుకుని పనిచేయటం ద్వారా ప్రతికార్మికుని కలిసి వసూల్చు విరివిగా సాగించటం జయప్రద మవుతుంది.

3. ఈ కార్యక్రమం అన్ని సంఘాలు వెంటనే వేసికొని మేడే నాటికి రాష్ట్రం మొత్తంమీద కనీసం 5 వేల రూపాయలనిధి సేకరించాలి. మేడే కార్యక్రమంలో నిధి సమర్పణను ఒక ప్రధాన భాగంగా స్వీకరించి సాధ్యమైనంత ఎక్కువ మొత్తాన్ని రాష్ట్ర సంఘానికి సమర్పించాలి. ఈ నిధి సేకరణను మే దినోత్సవం నాటికి ఎ. పి. టి. యు. సి. నాయకులు వివిధ ప్రాంతాలకు వెళ్ళి ఆనాటి కార్యక్రమాలకు తోడ్పడి రాష్ట్ర సంఘ నిధికి స్వీకరిస్తారు.

4. స్థానిక సంఘాలు అనేక సమస్యలపై కృషి సల్పి అనేక విజయాలు సాగిస్తున్నారు. ఈ విజయాలకు రాష్ట్ర కేంద్రాలనుండి తోడ్పాటు వుంటుంది. కనుక ఆ విజయాలు సాధించిన సందర్భాలలో కార్మికులనుండి ప్రత్యేక నిధులను సేకరించి రాష్ట్ర కేంద్రానికి తోడ్పడటం అనే సుసాంప్రదాయాన్ని నెలకొల్పాలి.

ఈ పై పద్ధతుల ననుసరించి నిధి సేకరణను కొనసాగించి, మే దినోత్సవంనాటికి రు. 5000 లను ఆ తర్వాత సాధ్యమైనంత త్వరలో మిగిలిన మొత్తాన్నికూడా సేకరించి పదివేల రూపాయలనిధి సేకరణను జయప్రదం చేయాలని,యీ కౌన్సిల్ విజ్ఞప్తి చేస్తోంది.

ఎ. ఐ. టి. యు. సి. 17 పాయింట్ల కార్యక్రమం

ఎ. ఐ. టి. యు. సి. 25 వ మహాసభలో రూపొందించబడిన 17 పాయింట్ల ఈ క్రింది కార్యక్రమాన్ని ఆంధ్రప్రదేశ్ ట్రేడ్ యూనియన్ జనరల్ కౌన్సిల్ సమావేశం ఆమోదిస్తూ తీర్మానిస్తున్నది.

ఈ కార్యక్రమంలో హంశాలను, అనుబంధ సంఘాలన్నీ కార్మికులలో విరివిగా ప్రచారం చేయాలని, ఈ సమావేశం ఆదేశిస్తున్నది. ఈ కార్యక్రమంలోని హంశాలను సాధించుటకు విస్తృత ప్రాతిపదికపై ఐక్య ఉద్యమ నిర్మాణానికి అనుబంధ సంఘాలన్నీ చొరవతో స్థానికంగా ఐక్య సమావేశాలు, ప్రదర్శనాలు జరపాలని, ఈ సమావేశం విజ్ఞప్తి చేస్తున్నది. అందుకొరకు మే మొదటి వారం, ఎ. ఐ. టి. యు. సి. వారంగా, జరపాలని ఈ సభ తీర్మానిస్తున్నది.

1. ప్రపంచశాంతి, అటం ఆయుధాల నిషేధం.

2. జాతీయార్థిక విధానాభివృద్ధికి, జాతీయ సంపదాభివృద్ధికి ప్రణాళిక ప్రధానాంశాలను నెరవేర్చడం.

3. ప్రభుత్వరంగ విస్తరణ మే జాతి ప్రయోజనాలకు వ్యతిరేకంగా జరిగే విదేశీ గుత్తాధిపతుల కార్యకలాపాలు తుదముట్టించడం.

4. భూస్వామ్య పెట్టుబడిదార్ల లాభాలపై కార్మికుల ప్రజల కంట్రోలు.

5. ఉత్పత్తి, ధరల స్థిరీకరణ, కో ఆపరేటివ్‌లద్వారా నిత్యావసర వస్తువుల పంపకం.

6. పరిశ్రమ, ప్రాంతం, వృత్తిలో సగటున 25% ఉండేలా జీతాల పెంపకం.

7. అధికధరల అలవెన్సు జీతాలతో కలపడం.

8. ఆరోగ్యానికి, జీవితానికి ప్రమాదం సంభవించే గనులు, రసాయనవస్తువులు, రవాణా మొదలగు పరిశ్రమలలో పనిగంటల తగ్గింపు.

9. అభివృద్ధికరమగు చట్టాలు, కార్మికుల తోడ్పాటుతో వాటిని అవార్డులను అమలుజరపడం.

10. జీతాలను దేశవ్యాపితంగా ప్రతి పరిశ్రమలోనూ, వ్యాపారంలోనూ, ప్రాంతంలోనూ పెంచడానికి చర్యలు.

11. సాంఘిక భీమా పథకాలు. ఎంప్లాయీస్ స్టేట్ ఇన్సూరెన్స్ స్కీము, ప్రావిడెంటుఫండును అభివృద్ధి పరచుట.

12. ట్రేడ్‌యూనియన్‌లగుర్తింపు, అధిక ప్రాతినిధ్యంగల యూనియన్‌ను తేల్చడానికి బ్యాలట్ పద్ధతి.

13. రాజకీయ తదితర అనుబంధాలతో నిమిత్తం లేకుండా కార్మికోద్యమ ఐక్యత.

14. కాల్పులను, ట్రేడ్‌యూనియన్ ప్రజాస్వామ్య హక్కులు అణచడాన్ని తుదముట్టించడం, ప్రివెంటివ్ డిటెన్షన్ చట్టం, ప్రజాస్వామ్య వ్యతిరేక గవర్నమెంటు సర్వీసు కాండక్టురూల్సు రద్దు పరచడం.

15. పాలకవర్గాలలో లంచగొండితనం, ఆశ్రిత పక్షపాతం అంతమొందించడం.

16. కుల వివక్షణ, నిమ్నజాతులను తెగలను అణచుట మొదలైనవి రూపుమాపడం,కులంతో పనిలేకుండా వర్గ ఐక్యత సాధన.

17. సంఘటిత పడనివారిని సంఘటితపర్చడం, ఎ. ఐ. టి. యు. సి. ని బలవత్తర మొనర్చడం.

మన దేశంకొరకు, వర్గంకొరకు ఐక్యంగా వారి దారిద్ర్యాన్ని, నిరంకుశ పరిపాలనను ఎక్కొదున్నా అంతమొందించుమని అనే నినాదాలతో రపోర్టు ముగిసింది.

సోవియట్ యూనియన్ తనకు తానుగా అణుఆయుధ పరీక్షలను విరమిస్తూ చేసిన నిర్ణయాన్ని ఈ సమావేశం ఆహ్వానిస్తోంది. ప్రపంచ శాంతి సుస్థిరంగా కాపాడబడటానికి ఈ చర్య గొప్ప తోడ్పాటు నిస్తుందని ఇది సోవియట్ యూనియన్ అనుసరిస్తున్న శాంతి విధానానికి ఎంతో అనుగుణమైనదని ఈ సమావేశం అభిప్రాయపడుతోంది. ప్రపంచ శాంతి కాముకులు చాలాకాలంగాసాగిస్తున్న ఆందోళనను మన్నించి సోవియట్ ప్రభుత్వం తీసుకున్న ఈ మహత్తర చర్యకు సమావేశం సోవియట్ ప్రభుత్వాన్ని అభినందిస్తోంది. ఇతర ప్రభుత్వాలు కూడా వెంటనే అణుఆయుధ పరీక్షలను నిలుపవలసిందిగా ఆంధ్రప్రదేశ్ ట్రేడ్‌యూనియన్ కాంగ్రెసు విజ్ఞప్తి చేస్తున్నది. అందుకొరకు ఆందోళన చేయవలసిందిగా కార్మికవర్గాన్ని ఈసభ కోరుతున్నది.

ఆంధ్రరాష్ట్ర గ్రామోద్యోగుల సంఘ మహాసభ

కాకినాడలో ఏప్రిల్ 13 న

కాకినాడ, ఏప్రిల్ 5

ఆంధ్రరాష్ట్ర గ్రామోద్యోగుల సంఘ 21 వ వార్షిక మహాజనసభ ఈ నెల 13 వ తేదీన కాకినాడ బంగారువారి సత్రంలో జరుగుతుందని ఆహ్వానసంఘంవారు తెలియజేస్తున్నారు. మహాసభకు పార్లమెంటు సభ్యులు శ్రీ మైండా వెంకటనారాయణ గారు అధ్యక్షత వహిస్తారు. శాసన సభ్యులు శ్రీ దురిశేటి గోపాలరావుగారు సభను ప్రారంభిస్తారు.

తూర్పుగోదావరిజిల్లా మహాసభ కాకినాడలో నే 12 వ తేదీన జరుగుతుంది. సభకు శాసన సభ్యులు శ్రీ కొవ్వాసుల వెంకటసుబ్బారావు గారు అధ్యక్షత వహింపుతారు. రాష్ట్ర గ్రామోద్యోగుల సంఘాధ్యక్షులు శ్రీ ఎన్. వి. పట్నాయక్ గారు సభను ప్రారంభిస్తారు.

పొగాకు కార్మికుల తొలగింపును నిరసించండి

రాష్ట్రసంఘాధ్యక్షుని పిలుపు

విజయవాడ, ఏప్రిల్ 5

ఆంధ్రస్టేటు ఐ. యల్. టి. డి. కంపెనీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు, పార్లమెంటు సభ్యులైన శ్రీ కె. ఎల్. నరసింహాంగారు ఈ క్రింది విధంగా ప్రకటిస్తున్నారు.

పొన్నూరు డిపోను మూసివేసి 12 ఏండ్లు పనిచేసిన కార్మికులను నిరుద్యోగానికి గురిచేయడమే కాకుండా 14 మంది పర్మనెంటు కార్మికులను కంపెనీవారు రిట్రెంచిమెంటు చేశారు. ప్రతి డిపోలోను పర్మనెంటు కార్మికులలో వున్న ఖాళీలను భర్తీచేయుటానికినిరాకరించడమే కాకుండా ఇప్పుడే అవసరానికిమించి మెంగ కార్మికులు వున్నారని చెప్పతున్నారు. డిపోలలోని కాన్పెంటర్లు, మేస్త్రీలు, మొదలైన పనివారికి చాల కొద్దిరోజులే పనియిస్తున్నారు. బయట వర్తకులవద్ద గ్రేడింగ్ చేయించుకొనుట ద్వారా, మాస్టరు ఫారమ్సులో గ్రేడింగుకు సహాయపడుతూ, డిపోలలో పనిరోజులు తక్కువ చేయుటం జరుగుచున్నది. పైగా దీనికితోడుగా బడ్జెటు కంట్రోలు పేరుతో ప్రతి డిపోలోని కార్మికులను అంచనావేసి, సంఖ్య నిర్ణయిస్తున్నారు. ఈ విధంగా కార్మికుల సంఖ్య కుదించుటలో గుర్తించబడిన యూనియన్‌కు తెలియజేయుటంగాని ఈ విషయంలో సంప్రదించుటగాని చేయడంలేదు. కంపెనీ ఒక విషయంలో నిర్ణయం చేసుకొని మనం అంగీకరించాలనే ధోరణిలో వ్యవహరిస్తున్నది.

నిడదవోలు డిపోలో పనిసీజన్లలో పనిచేసిన 131 మంది మగకూలీలను 1-3-58 న తొలగించారు. రాజమండ్రి డిపోలోకూడ తక్కువసీజన్ల మగకూలీలను తగ్గించినట్లు తెలిసినది. పొన్నూరు కార్మికుల విషయంలో ఇతర డిపోలకు దానికి సంబంధం లేదని వాదించిన అధికారులు, కానూరు, నిడదవోలు డిపో ఒకటే అని వాదించి, కానూరునుండి స్త్రీ కార్మికులను, మగ కార్మికులను నిడదవోలు డిపోకు మార్చారు. వచ్చేసంవత్సరంనుండి కానూరు డిపో మూసివేస్తామంటున్నారు. ఇంకా ఎన్ని డిపోలు మూయాలని నిర్ణయించుకొన్నారో తెలియుటలేదు.

రాజమండ్రిలో సమావేశమైన మన రాష్ట్రకమిటీ, కంపెనీ అవలంభిస్తున్న ఈ విధానాన్ని సమీక్ష చేసింది. కంపెనీ మనతో చేసుకొన్న ఎగ్రిమెంటులో "పనివారలను పెట్టుకొనుట, తొలగించుటలో ప్రస్తుత పద్ధతి అమలు జరుపబడుతోంది" అని వుంది. అయినప్పటికి కంపెనీ ఎగ్రిమెంటుకుముందువున్న సర్వీసుపరిస్థితులను తారుమారుజేస్తూ, పనివారల సంఖ్య తగ్గించటం, పని రోజులు తగ్గించటం-కొన్ని డిపోలు మూయటం జేస్తున్నారు. అందువల్ల అట్టివిధానానికి మనం నిరసన తెలియజేయాలి.

ఏప్రిల్ 10 వ తేదీన రిట్రెంచిమెంటు వ్యతిరేకదినం జరిపి బహిరంగసభలు జరిపి, కంపెనీ అవలంభిస్తున్న ఈ విధానానికి మన నిరసన తెలియజేయాలని రాష్ట్ర కమిటీ నిర్ణయించింది. ఆరోజున కార్మికులు సభలు జరిపి ఆ సభలో మన రాష్ట్రకమిటీ తీర్మానాలను వివరించాలి. తీర్మానాలుచేసి కంపెనీకి, ప్రభుత్వానికి అందజేయాలి.

డిపోలు మూయుటవల్ల, పనివారలను రిట్రెంచిమెంటు చేయుటవల్ల, పనిరోజులు తగ్గించుటవల్ల, ఎక్కువమంది నిరుద్యోగాలకు గురికావలసి వస్తున్నది. కావున ప్రభుత్వం జోక్యం కలుగజేసుకొని డిపోలు మూయటాన్ని నిషేధించాలని, రిట్రెంచిమెంటు ఆపాలని ప్రభుత్వాన్ని కోరుచున్నాను.

తెలుగులో నాట్యశాస్త్ర ప్రచురణ; ప్రభుత్వ విరాళం

సికింద్రాబాద్, ఏప్రిల్ 5

ఉస్మానియా యూనివర్సిటీలో కేంద్ర ప్రభుత్వ ఉపకారవేతనంపై తెలుగునాటక రచనా పరిణామాన్ని గూర్చి పరిశోధనచేస్తున్న శ్రీ పి.ఎస్. ఆర్. అప్పారావుగారి నాట్యశాస్త్ర తెలుగు అనువాదాన్ని ముద్రించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా నాలుగువేల రూపాయలు మంజూరు చేసింది.

ఆంధ్రప్రభుత్వం 16 మందితో ఒక వాణిజ్యపన్నుల సలహా సంఘాన్ని నియమించింది

కమ్యూనిస్టుపార్టీ నిధి వసూళ్ల సంరంభం

కడపజిల్లాలో రు. 7 వేలకు పైగా వాగ్దానాలు, రు. 4,400 వసూలు

కడప, ఏప్రిల్ 5

కడపజిల్లాలో కమ్యూనిస్టుపార్టీనిధి క్రింద మార్చి నెలాఖరువరకు రు 7,083 వాగ్దానాలు వచ్చాయి. రు 4,404 వసూలైంది. ఏప్రిల్ నెలాఖరుకు మరో రు 4,800 సేకరించగలమని అంచనా వేస్తున్నారు.

తాలూకాలవారిగా వాగ్దానాలు, వసూళ్ళ వివరాలు: కమలాపురం రు 1880 లు వాగ్దానం (రు 1126 లు వసూలు); పులివెందుల రు 1750 (రు 1710); ప్రొద్దుటూరు, జమ్మలమడుగు తాలూకాలు రు717(రు450); కడప రు 869, (రు530); రాయచోటి రు 800 (రు 200); రాజంపేటరు100, (రు 100); బద్వేలు రు 36 (రు 5).

గత డిసెంబరులో జరిగిన జిల్లా కమిటీ విస్తృత సమావేశంలో బడ్జెటును చర్చించి జిల్లాలో ప్రస్తుతమున్న హోల్‌టైమర్లను తగ్గించకుండా కనీస నిర్మాణ, రాజకీయ బాధ్యతలను నెరవేర్చడానికి ఈ ఏడాది కనీసం రు. 10,000 లు అవుసర ముంటుందని అంచనా వేయబడింది. ఆర్థిక సమస్య జిల్లాలో పార్టీకి చావు బ్రతుకుల సమస్యగా గుర్తించ బడింది. కాని వసూళ్ళకు వున్న అవకాశాలను రు 6000 లకు మాత్రమే అంచనా వేశారు. ఈ మొత్తం కేవలం హోల్‌టైమర్ల పోషణకు మాత్రమే సరిపోగా, ఇక ప్రయాణభత్యాలు, ఆఫీసు బాకీలు, ప్రచార ఆందోళనల కయ్యే ఖర్చు ఎలాగన్నది ఒక అపరిష్కృత సమస్యగానే కనపడింది.

మార్చి 25 న జరిగిన జిల్లాకమిటీ సమావేశంలో ఈ మూడు మాసాల నిధి వసూళ్ళ వుద్యమాన్ని సమీక్ష చేశారు. విస్తృత సమావేశంలో వేసిన అంచనాలు చాలా తక్కువని తేలింది.

జిల్లాలో అన్ని ప్రాంతాలలోకూడ తరతమ భేదాలతో కరువు పరిస్థితులు వ్యాపించి డబ్బుకు కటకట ఏర్పడింది. ఈ పరిస్థితుల్లోకూడా కమ్యూనిస్టు కార్యకర్తలు కదలి పట్టుదలగా వసూళ్ళకు పూనుకున్న ప్రాంతాల్లో అంచనాలకు మించి వాగ్దానాలు వచ్చాయనేది స్పష్టం. కాంగ్రెసు ప్రభుత్వం అంటే అసంతృప్తిఎల్లెడలా ద్యోతకమైంది. కాంగ్రెసుకు ఓట్లిచ్చినవారు, యిప్పించినవారు సైతము కొన్ని కొన్ని గ్రామాలలో కమ్యూనిస్టుపార్టీనిధి వసూళ్ళలో చేతులు కలిపారు. పార్టీసభ్యులు, సానుభూతిపరులు భక్తి, విశ్వాసాలతో సాయపడ్డారు. పార్టీనిధి వసూళ్ళకు వుపక్రమించిన గ్రామాల్లో తిరస్కరించిన ఉదాహరణలేదు.

కమ్యూనిస్టు కార్యకర్తలు ప్రజలవద్దకు వెళ్ళి పార్టీ పరిస్థితి వివరించినప్పుడు ప్రజలు సానుభూతితో గుర్తించి తోడ్పడ్డారు. ప్రొద్దుటూరు పట్టణంలో పార్టీ కార్యకర్తలు 3 దళాలుగా ఏర్పడి యింటింటు వసూళ్ళకు పూనుకున్నారు. ఓట్లివ్వడమే కాదు. డబ్బిచ్చికూడా పార్టీకి తోడ్పడవలసిన అవసరాన్ని గుర్తింప చేస్తున్నారు. చేత దమ్మిడీ లేక ఏపూటా కాపూట జరిగేది కష్టంగా వున్న ఒక పేదరాలు రాగిపిండి పెట్టి తన ఆప్యాయతను చూపెట్టింది. సింహాద్రిపురం, కీర్తిపల్లె చేనేత ప్రజలు ప్రతి ఒక్కరూ లేదనకుండా యిచ్చారు.

రాయచోటి తాలూకాలో ప్రజలు కార్యకర్తలు చూపిన ఆదరణ ప్రశంసనీయం.

కడప తాలూకాలో నిధి వసూళ్ళ వుద్యమం క్రొత్త గ్రామాలకు వ్యాపించింది. కరువు పరిస్థితులు, అభివృద్ధి కార్యక్రమాలు నిధి వసూళ్ళలో పెద్ద పసుపుల ప్రజలకు అడ్డుపడలేదు. పార్టీనిధికి డ్రామా వేయించి సహాయపడుటకు దేవగుడి, చౌమూరు చుట్టుప్రక్కల కార్యకర్తలు విరివిగా టిక్కట్లు అమ్మకం సాగిస్తున్నారు. ఈ మొత్తం వుద్యమంలో సాయపడ్డ ప్రజలకు పార్టీ కార్యకర్తలకు జిల్లా కమిటీ ధన్యవాదాలు అందజేస్తున్నది.

ఈ మూడు మాసాల నిధి వసూళ్ల అనుభవం పార్టీ కార్యకర్తలకు ఆత్మవిశ్వాసం కలిగించింది. సమస్యలు తీసుకొని పనిచేయవలసిన అవసరాన్ని గుర్తించారు. కనీస నిర్మాణ రాజకీయ కర్తవ్యాలను నెరవేర్చడానికి అవుసరమైన డబ్బు వసూలు చేసుకోగలమనే ధైర్యం కలిగింది. ఈ ధైర్యంతోనే యింకా కొన్ని క్రొత్తనిర్మాణ, రాజకీయ బాధ్యతలనుకూడా చేపట్టడానికి పూనుకుంటున్నారు. వసూలు కాకుండావున్న వాగ్దానాలుకానీ, క్రొత్తవసూళ్ళుగానీ మొత్తం 7,000లు ఏప్రిల్ ఆఖరికి పూర్తిచేయవలసి వున్నది. ఈ ఏప్రిల్‌లో జరిగే కృషి మీదనే తక్కిన ఏడాదియొక్క భవిష్యత్తు ఆధారపడివుంది.

పెనమలూరులో ఆదర్శ కృషి

పెనమలూరు, ఏప్రిల్ 5

ఆంధ్రప్రదేశ్ కమ్యూనిస్టు మహాసభ యిచ్చిన 5 లక్షల పిలుపు నందుకొని కృష్ణాజిల్లా విజయవాడ తాలూకా పెనమలూరు గ్రామములో మార్చి 18 వ తేదీన 'విశాలాంధ్ర' సంపాదకులు శ్రీ కాట్రగడ్డ రాజగోపాలరావు, తాలూకా కమ్యూనిస్టు కమిటీ కార్యదర్శి శ్రీ అడుసుమల్లి సత్యనారాయణగారు, తాలూకా కమ్యూనిస్టు కమిటీ సభ్యులు శ్రీ చిగురుపాటి బుచ్చిరామయ్యగారు గ్రామ కమ్యూనిస్టు పార్టీ శాఖా సభ్యులు కలసి గ్రామములో వివిధ రాజకీయ వర్గాలకుచెందిన ముఖ్యులను కలుసుకొని, విరాళాలు అర్థించారు. వారు 1116 లు వరకు వాగ్దానాలు చేశారు. ఆదే రోజున రు 200 వసూలు అయినాయి.

తర్వాత తాలూకా కమ్యూనిస్టు కమిటీ సభ్యులైన శ్రీ చిగురుపాటి బుచ్చిరామయ్యగారు, గ్రామపార్టీ శాఖాసభ్యులు కలసి ఒక దళంగా బయలుదేరి రాజకీయ విభేదాలు లేకుండా యింటింటికి తిరిగి నిధి వసూళ్ళ కార్యక్రమాన్ని కొనసాగించారు.

225 మంది రు 1800 వాగ్దానాలు చేశారు. రు 1116 నగదు యిచ్చారు. మార్చి 31 వ తేదీ రాత్రి 9½ గంటలకు పెనమలూరు హైస్కూలు మైదానంలో చిగురుపాటి బుచ్చిరామయ్యగారి అధ్యక్షతను 2 వేల మందితో బహిరంగసభ జరిపారు. సభలో జిల్లాకమ్యూనిస్టు నాయకులు శ్రీ కడియాల గోపాలరావుగారు మాట్లాడారు. తర్వాత శ్రీ అడుసుమల్లి సత్యనారాయణగారు తాలూకా వుద్యమాన్ని గురించీ నిర్మాణాన్ని గురించీ, తాలూకాలో ఎంత పార్టీనిధి వసూలుచేసినది మొదలగు విషయాలనుగురించీ మాట్లాడారు. శ్రీ చిగురుపాటి బుచ్చిరామయ్యగారు వసూలు అయిన రు. 1116-0-0 లను కమ్యూనిస్టుపార్టీ నిధికిగాను విరాళాలు యిచ్చిన దాతల తరపున, గ్రామపార్టీ తరపున సమర్పించారు.

గ్రామములో వసూలు చేసే రు. 2000-0-0 లు కాక గ్రామాంతరం వెళ్లిన వారినుంచి రు. 500-0-0 లు వరకు యిప్పటికి వాగ్దానం చేయించారు. 500-0-0 వసూలయ్యే వరకు అవకాశం ఉంది. మొత్తం పెనమలూరు నుంచి రు. 3000 లు వరకు పార్టీకి విరాళం యివ్వడానికి అవకాశమున్నదని బహిరంగ సభలో తెలియజేశారు.

తర్వాత పెనమలూరు అభ్యుదయ నాట్యమండలివారు "మాలి" అను నాటకమును ప్రదర్శించారు.

చదలవాడ తిరునాళ్లలో నిధి వసూళ్లు

ఒంగోలు, ఏప్రిల్ 6

ఒంగోలు తాలూకా చదలవాడ తిరునాళ్ళలో కమ్యూనిస్టుపార్టీ కార్యకర్తలు రు 41-14-6 లు వసూలు చేసి తాలూకా పార్టీకి అందజేశారు.

దళాలలో పనిచేసిన సభ్యులపేర్లు ఇవి: ఇమ్మనేని సుబ్బయ్య, వంకినాల వెంకటేశ్వర్లు, చిక్కాల లూకా, కమ్మెన్న వెంకటేశ్వర్లు, పిన్నక రాఘవస్వామి, కొత్తపల్లి వెంకటేశ్వర్లు, మాకిళ్ళగుంటపాలెం సుబ్బయ్య, రామిరెడ్డి.

గూడెం తాలూకాలో పార్టీనిధి సేకరణ

పాతకృష్ణ దేవిపేట, ఏప్రిల్ 6

కమ్యూనిస్టు పార్టీనిధికి గూడెం తాలూకా చింతపల్లిలో శ్రీ కోట రామస్వామి గారు రూ. 25/-, అంతావ గ్రామంలో శ్రీమతి లోతా రాజులమ్మగారు రు. 10, తోటలూరు గ్రామంలో ఒక సానుభూతిపరుడు రు. 25 వాగ్దానం చేశారు.

కమ్యూనిస్టు పార్టీకి పెండ్లికానుక రు 116

మంగళగిరి, ఏప్రిల్ 6

శ్రీ వైకలోయిన కోటేశ్వరరావు గారు తన వివాహ సందర్భంలో కమ్యూనిస్టు పార్టీకి విరాళంగా రు 116-0-0 లు యిచ్చినారు.

కూచిపూడినాటకం - నేటిశోచనీయపరిస్థితి

కూచిపూడివారి నాట్యాలు, నాటకాలు యిదివరలో సాంప్రదాయసిద్ధమైన సంగీత, సాహిత్య వేషధారణలతోకూడి, లక్షణయుక్తమైన, శాస్త్రీయమైన భంగిమములు, ముద్రలతో, హావభావయుక్తమై భారతీయ సంస్కృతి యొక్క ఔన్నత్యమును చాటేవిగా వుండేవి.

కాలక్రమేణా కూచిపూడి నాట్య సాంప్రదాయాలు అన్ని విధాలా అడుగంటిపోతున్నాయని తెలియజేయవలసి వచ్చినందుకు విచారిస్తున్నాను.

ఈ మధ్య వెలసిన ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమీ ప్రారంభోత్సవ సమయమున కళామూర్తి, మద్రాసు ప్రధాన న్యాయమూర్తి, కేంద్ర సంగీత నాటక అకాడమీ అధ్యక్షులు అయిన శ్రీ పి. వి. రాజమన్నారుగారు కూచిపూడి నాట్యకళ సాంప్రదాయ ప్రాశస్త్యాన్ని గూర్చి చెబుతూ శాస్త్రీయమైన ఆ నాట్యాన్ని మనం కాపాడుకోకపోతే, నాట్యకళపట్ల క్షీణదశ తప్పదేమో ననిపిస్తోంది అని గట్టిగా హెచ్చరించారు.

శ్రీ రాజమన్నారుగారు సెలవిచ్చినట్లు నాట్యకళను గూర్చి చేసిన హెచ్చరికలో ప్రత్యక్ష సత్యం లేకపోలేదు.

ఈ మధ్య కృష్ణాజిల్లా పర్యటించవలసిన ఆవశ్యకత నాకు కలిగింది. 22 మార్చి 58 తేదీ రాత్రి బెజవాడ

శ్రీ నటనాచారి

రామమోహన లైబ్రరీ హాలులో కూచిపూడివారి 'శశిరేఖా పరిణయం' నాటకం చూడ్డం తటస్థించింది.

ఈ ప్రదర్శనం బెజవాడలోని నటరాజ్ కళామండలి వారిచే ఏర్పాటు చేయబడింది. మెంబర్లు, తదితరులుగూడ వచ్చారు. టిక్కెట్లు పెట్టారు. ఆ వచ్చినవారంతా కూచిపూడి నాట్యసాంప్రదాయాన్ని, ఆ శాస్త్రీయ కళా విధానాన్ని చూచి ఆనందించాలనే వచ్చారని అనడంలో అతిశయోక్తిలేదు.

కూచిపూడి నాట్య ప్రదర్శనాలను ప్రోత్సహించేవారుగాని, చూచేవారుగాని, ఆ నాట్యకళా ప్రాశస్త్యాన్ని ప్రోత్సహించాలనీ, చూడాలనే కోరిక తప్ప, ఆర్థిక వ్యాపార దృష్టితోగాని, నటీ నటవర్గ తారల మోజుకిగాని ఆకర్షింపబడిగాదు.

స్టేజి, కర్టెన్లు, లైట్లు, మైక్ మున్నగు పరికరాలు అమర్చబడ్డాయి. ఆ ప్రదర్శనం ఏర్పాటు గావించినవారు సంస్కారం, అనుభవంగలవారు గాన కిరాయి కంట్రాక్టర్లు కారు. కాబట్టి, ప్రదర్శనం అనుకున్న టైం ప్రకారం సరిగ్గా రాత్రి 9-30 గంటలకే ప్రారంభమయ్యేట్టు చేశారు.

ప్రదర్శనం ప్రారంభమయింది. బలరామ, కృష్ణులు ప్రవేశించారు. హాస్య పాత్రధారి, వంతపాట పాడుతూ ఒక బ్రాహ్మణ సూత్రధారి మొదటినుంచి చివరవరకూ రంగస్థలం మీద వున్నారు.

ఆ వంతపాటకుని వేషం గమనిద్దాం. నిత్య జీవితంలో కట్టే పంచ, తొడిగే లాల్చీ, పైమీద వేసుకునే కాలువమాదిరి కండువా, చేతిలో తాళాలు.

ఏం! సాంప్రదాయ సిద్ధంగా పట్టురంగు పంచకట్టి, ఒంటిమీద విభూతిరేఖలు, చెవులకు కుండలాలు ధరించి, చేతికి సింహతలాటాలు పెట్టి ముఖమున బ్రాహ్మణ వర్చస్సు తేజరిల్లే బొట్టుపెట్టుకుని, నడుంకి ఉత్తరీయం బిగించి, తాళం పట్టుకుని ఆ రంగస్థలంమీద నుంచుంటే, ఎంత చూడ ముచ్చటగా వుంటుంది.

ఆదేమీ లేకపోగా, వీధిలో తిరిగే మామూలు డ్రస్సుతోనే రావడం అంత విరుద్ధం యింకోటిలేదు.

ఇక - బలరామ, కృష్ణ పాత్రల వేషధారణ మామూలుగా మనం చూచే పౌరాణిక కిరాయి నాటకాల్లో చూచే దమ్మీకోట్లు, ఆభరణాలు కిరీటాలే వీళ్ళకీ గతి అయాయి. అంతేగాక - కాళ్ళకి మామూలు గజ్జెతో కూడిన జోళ్ళువేసుకుని, కాలుమీద కాలు వేసుకుని దర్జాగా కూర్చున్న సందర్భాలలో, ఆ జోడు ప్రేక్షకులకు బాగా కనబడి, ఎంతటి అసహ్యాన్ని కలిగించిందో చెప్పలేము.

ఇంతలో - ఆ రాజ దర్బారులో 'దశావతార' ప్రదర్శనం కొరకు ఒక స్త్రీపాత్ర ఒకటి వచ్చింది.

కూచిపూడి నాట్యప్రదర్శనాలలో స్త్రీ పాత్రలు గూడ పురుషులే ధరిస్తారని వేరే చెప్పనక్కర్లేదు. అందు నాడు, నేడు కూడ స్త్రీ పాత్రలకు కొందరు పురుషులు అర్హులే అన్న అభిప్రాయాన్ని బుజువుచేసినవారు వున్నారు.

కాని - ఆ నాటి 'దశావతారాలు' ప్రదర్శింపవచ్చిన పాత్ర కట్టిన చీర, వేషధారణ, అభినయం, రూపం అన్నీచూస్తుంటే ప్రేక్షకుల్లో 'కొజ్జాని' చూచే ఏవగింపు కలిగింది.

వంతపాట పాడే వారికి వారి ముందు మైకువుందని తెలిసికూడ, అందుకు అనుగుణ్యంగా పాడటం అనేది జరుగక పోవడంవలన, లోపల వున్న మైకు శబ్దాన్ని హెచ్చుతగ్గులు చేయడంలోను, అప్పుడప్పుడు అసలే మానివేసే పరిస్థితులు ఏర్పడి, శబ్ద ప్రసారంలో తికమికలు పడవలసి వచ్చింది.

హాస్యంలో చెప్పుకోతగ్గ గుంభన, సున్నితం ఏమైనా వుంటేనా!

నాయికపాత్ర శశిరేఖ, సుభద్రా వేషాలు వచ్చాయి. హావభావప్రకటన ఒప్పినా వారికట్టు, ఆభరణాల తీరు, వేషధారణ అంతా మామూలు నాటకాల్లో ధరించే పద్ధతిలోనే వుంది.

కూచిపూడి నాట్య ప్రదర్శనం అనగానే, ప్రజానీకంలో ఒకవిధమైన విశిష్టభావం ఏనాడో ఏర్పడివుంది.

పురుష పాత్రలకు ఆయా పాత్రలనుబట్టి, భుజకీర్తులు, కిరీటం, మెడలోని హారాలు, ఆకట్టు, నడక, తీరూ అన్నిటిలోనూ ప్రత్యేకత వుంది.

అలాగే - స్త్రీ పాత్రల్లో గూడ ఆయా వేషాలకు అనుగుణ్యంగా రాగిడి, చంద్రవంక, మొగిలిరేకు, తమలపాకు, తింత్రిణీ బిళ్ళలు, పిసాళిగె, కురాయి, బులాకి, పోచీలు, తాబేదులు, వడ్డాణం మున్నగు ప్రత్యేకత వుంది.

కూచిపూడి ఆభరణాలకు, వేషధారణకు పుడికి చెక్క సామానుతో చేయబడిన వాటిని ధరించడంలోనే విశిష్టత వుంది.

కూచిపూడి వారందరికీ ఆ విశిష్ట సాంప్రదాయమైన కట్టు, బొట్టు, జుట్టు, ఆభరణాలు, అలంకారం, నడక, తీరు తెలియక గాదు.

అయితే - కాలాన్నిబట్టి, ప్రేక్షకుల అభిరుచులనుబట్టి, నవీన పద్ధతుల్లోకి మారవలసి వస్తోందనీ, అలా ఆచరించడం వల్లనే యిలా ప్రదర్శనాలు యివ్వగలుగుతున్నామనే వాదన ఒకటివుంది. అది అపోహ.

ఆ విధంగా వారు చేస్తూండడం వలన, అటు ప్రాచీన మూపోయి, యిటు నవీన మూరాక, - 'అటు మొగాగాక, యిటు ఆడాగాక' - అన్న పద్ధతిలోకి దిగుతోందని వారు గ్రహించక పోవడం మన ప్రారబ్ధం.

పాటలు చూద్దాం. కూచిపూడివారి గ్రంథాల్లో అనేక రకాల అత్యద్భుతమైన పాటలువున్నాయి. ప్రతి పాటకీ ప్రత్యేకత వుంది. అంతకుమించిన శాస్త్రీయమైన పాటలు నాట్యవిధానంలో చూడబోము.

అలాంటిది యీ 'శశిరేఖాపరిణయం'లోనే, 'హాయె నయ్యాయో, నన్ను ఇపుడుబాసి' అనే పాటపాడేటప్పటికి, 'ఇదేమిరా! కూచిపూడి కస్తురిందామనివస్తే, ఇదంతాఏమిటి?' అని అసహ్యం కలిగి, ప్రేక్షకుల్లో కొందరు యింటిదారి పట్టారు. అందులో నేనొకణ్ని.

మామూలు నాటకాల్లోని పాటలు, సినిమాల్లోని పాటలు పాడటానికి, కూచిపూడివారికి పట్టిన ప్రత్యేక గతి ఏమిటో అర్థం కావటంలేదు. వాటిని ఆయా నాటకాల్లోనూ, సినిమాల్లోనూ ఎలాగూ వింటున్నాము కదా, వీరి నాట్య ప్రత్యేకతలో వీటన్నిటినీ జొరిపించడంలో ఆంతర్యం ఏమిటో? ఏ పాత్రకు ఎవరు తగుదురో,

(మిగతా 4 వ పేజీలో)

తిరుపతి దేవస్థానం మోటారు కార్మికుల సమ్మె నోటీసు

కోర్కెలంగీకరించని పక్షంలో ఈ నెల 24 వ తేదీన సమ్మె

తిరుపతి, ఏప్రిల్ 5

తిరుమల, తిరుపతి దేవస్థానం మోటారు కార్మికులు ఈ నెల 1 వ తేదీనజరిపిన సాధారణ సంఘ సమావేశంలో తమ కోర్కెలనుమేనేజిమెంటు అంగీకరించని పక్షంలో 24 వ తేదీ నుండి సమ్మె చేయాలని తీర్మానించారు. ఈ నెల మూడవ తేదీన మేనేజిమెంటుకు సమ్మె నోటీసు జారీచేశారు.

సమ్మె నోటీసులో ఈ దిగువ కోర్కెలను తెలియజేశారు.

1. తొలగించిన, సస్పెండు చేసిన కార్మికు లందరిని తిరిగి పనిలోనికి తీసుకోవాలి. తొలగించిన తేదీనుండి జీతం యివ్వాలి. సర్వీసు అవిచ్ఛిన్నంగా ఉండాలి. (2) రోజుకి 8 గంటల పని అమలు జరపాలి. పని గంటలు సరిగ్గా ఎన్నింటికి ప్రారంభమౌతాయో నిర్ణయించి ఒక రోజు ముందుగా చెప్పాలి. (3) బేటా యథాప్రకారంగా మైలుకు ఘాట్ రోడ్డుఅయితే ఆరుపైసలు, మామూలు రోడ్డు అయితే మూడు పైసలు చెల్లించాలి. లారీ, నీళ్ళలారీ, కాలేజివ్యాన్,టాక్సి,ట్రాక్టరు, మొదలైన అందరు కార్మికులకు ఈ బేటా సమానంగా ఉండాలి. (4) ట్రాక్టర్ లైసెన్సున్న వారికే ట్రాక్టర్‌డ్యూటీ యివ్వాలి. యితరులను నిర్బంధించరాదు. (5) తిరుమలలో పని చేసే కార్మికులందరిని దళాలుగా సీనియారిటీ, జూనియారిటీలనుబట్టి విడదీయాలి. బదిలీలుకూడా నిర్ణీత సూత్రాలపై చేయాలిగాని యిష్టం వచ్చినట్లు చేయడానికి, కార్మికులపై నిర్బంధవిధానం అమలుజేయడానికి మార్గంకారాదు (6) వివిధ తరగతుల్లో డ్యూటీలు నిర్ణయించడానికి ముందు కార్మిక ప్రతినిధులతో మేనేజిమెంటు సంప్రదించాలి. (7) కార్మికులపై విచారణ జరిపినపుడు సంజాయిషీలు అడిగినప్పుడు కార్మిక సంఘాధ్యక్షుని సమక్షంలో జరపాలి. (8) రు 50/- జీతం ఉన్న ప్రతివారికి 1957 అక్టోబరు నుండి ఇంక్రిమెంట్లు యివ్వాలి (9) కార్మికుల జీతాలలో, ఇంక్రిమెంట్లలో పెట్టిన కోతలన్నీ తిరిగి యిచ్చివేయాలి. (10) వర్కుషాపుల్లో కండక్టరు లైసెన్సు ఉన్న ప్రతివానికి ఈ అవకాశం వచ్చినపుడల్లా కండక్టర్ల ఉద్యోగాలివ్వాలి. (11) గత సంవత్సరం యిచ్చినట్టుగా వర్కుషాపులోని కార్మికులకు దేవస్థానం సెలవులన్నీ యివ్వాలి. (12) కార్మికులకు ఉచిత వసతి గృహ సౌకర్యం ఇవ్వాలి. స్టాండింగ్ ఆర్డర్లు యేర్పరచాలి.

తిరుమల తిరుపతి దేవస్థానంకార్మికులకు మేనేజిమెంటుకు ఆంధ్ర ప్రదేశ్ లేబర్ కమీషనర్ ముందు 1957 సెప్టెంబరు 22 వ తేదీన కార్మికుల కోర్కెలపై ఒప్పందం జరిగింది కాని ఇందులో ముఖ్య షరతులను పాటించకుండా మేనేజిమెంటు ఉల్లంఘించింది. తిరిగి కార్మికులపై నిర్బంధ విధానం ప్రారంభించింది. కార్మిక సంఘ కార్యదర్శిని పనినుండి సస్పెండు చేసింది. ఉపాధ్యక్షుని తొలగించింది. కార్మికులపై అనేక అసత్యారోపణలను మోపి విచారణ తతంగం నడుపుతోంది. ఈ నిర్బంధ విధానానికి వ్యతిరేకంగా కార్మికులు ఆందోళన ప్రారంభించారు. మేనేజిమెంటుకు ప్రభుత్వానికి అనేక విజ్ఞప్తులు పంపారు. కాని వీటన్నిటిని మేనేజిమెంటు ఖాతరు చేయలేదు. చివరకు గత్యంతరంలేక కార్మికులు సమ్మెనోటీసు యివ్వాల్సి వచ్చింది.

రాష్ట్రఫెడరేషన్ కార్యదర్శి ప్రకటన

ఆంధ్రరాష్ట్ర మోటారు కార్మిక ఫెడరేషన్ కార్యదర్శి శ్రీ జోశ్యభట్ల సత్యనారాయణగారు ఈసమ్మె నోటీసు విషయమై దిగువ ప్రకటన చేశారు.

తిరుపతి దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఆఫీసరు శ్రీ అన్నారావు, దేవస్థానం బస్ కార్మికుల సంఘాన్ని విచ్ఛిన్నం చేయబూనుకుని వారిని అనేక హింసల పాల్జేస్తున్నారు. లోగడఅగ్రిమెంటు షరతులను అమలు జరపకపోగా, కంటిసాకులతో యూనియన్ కార్యదర్శి, ఉపాధ్యక్షులు, మరొక ముఖ్య కార్యకర్తను డిస్మిస్ చేశారు. ఇంతటి దారుణానికి ఎగ్జిక్యూటివ్ ఆఫీసరు పూనుకోవడం సాహసమే.

ఒకవైపున సంఘంపెట్టుకోవడానికి హక్కుఉన్నదంటూనే, కార్మికులపై నిరంకుశంగా ఈ విధంగా విరుచుకుపడే ఆఫీసర్ల యెడల ప్రభుత్వం ఉదాసీనత వహించడం సరికాదు.

అందువల్లఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వెంటనే జోక్యం కల్పించుకొని, ఉభయ పార్టీలను పిలిచి, సమ్మె ప్రారంభం కాకముందే యీ సమస్యలను పరిష్కరించి యాత్రీకులకు యిబ్బంది కల్గకుండా చూడాలని కోరుతున్నాను. ప్రభుత్వం పూనుకొని పరిష్కరించేవరకు తీవ్ర ఆందోళన చేసి, ప్రభుత్వంపై వత్తిడి తేవలసిందిగా రాష్ట్రములోని కార్మిక సంఘాలను, ప్రజానీకాన్ని కోరుతున్నాను.

గుంటూరు జిల్లా మోటారు కార్మిక మహాసభ

ఆహ్వాన సంఘం ఏర్పాటు

నర్సరావుపేట, ఏప్రిల్ 5

గుంటూరుజిల్లా మోటారు కార్మిక కార్యకర్తలసమావేశం రాష్ట్ర నాయకులు శ్రీ జోశ్యభట్ల సత్యనారాయణగారి అధ్యక్షతను ఇటీవల జరిగింది. రాష్ట్ర కార్యవర్గం నిర్ణయించిన ప్రకారము "మే" నెలలో గుంటూరులో మహాసభజరుపుటకు, ఆహ్వాన సంఘ ఆఫీసును వెల్‌కం హోటలు సెంటరు అగ్రహారం గుంటూరులో నెలకొల్పుటకు, ఆఫీసు నిర్వహణకు శ్రీ షేకు మస్తానుగారిని నియమించుటకు నిర్ణయించారు.

ఆహ్వాన సంఘ అధ్యక్షులుగా శ్రీ జొన్నలగడ్డ జోషిగారిని, కార్యదర్శిగా వాసిరెడ్డి మల్లికార్జునరావుగారిని ఎన్నుకున్నారు. సభ్యులుగా దిగువ వారిని ఎన్నుకున్నారు.

కోటగిరి వీరయ్య, శ్రీ విష్ణుమొలకల కోటేశ్వరరావు (తెనాలి). పి. రంగారావు, బి. రాములు (ఒంగోలు). కె. వీరాచారి, నిశ్శంక కోటేశ్వరరావు, డి. గోపాలరెడ్డి (నర్సారావుపేట). బేతంచర్ల హనుమయ్య (వినుకొండ). షేకు సుభాని (మాచర్ల). కె. జానికిరామయ్య, షేకు గాలిబ్ (అమరావతి). తులసి వెంకటేశ్వర్లు(పర్చూరు) తోట ధర్మారావు, షేకు మేరా (చిలకలూరిపేట). వాసిరెడ్డి మల్లికార్జునరావు, ఆర్. నాగేశ్వరరావు (మంగళగిరి).

యింకను అవసరమైన సభ్యులను కో-ఆప్ట్ చేసుకొనుటకు యీ సంఘ సభ్యులకు అధికారమిచ్చారు.

సత్తెనపల్లి బస్ కార్మికుల సమావేశం

సత్తెనపల్లి, ఏప్రిల్ 7

సత్తెనపల్లి బస్ కార్మికుల సమావేశం యీనెల 6వ తేదీ రాత్రి శ్రీ మాదల వీరభద్రరావుగారి అధ్యక్షతన జరిగింది. 35 మంది సమావేశంలో పాల్గొన్నారు.

ఆంధ్రరోడ్డు ట్రాన్సుపోర్టు వర్కర్సు ఫెడరేషన్ కార్యదర్శి శ్రీ జోశ్యభట్ల సత్యనారాయణగారు మాట్లాడుతూ ఫెడరేషన్ ఏర్పడింది మొదలు ఇంతవరకు చేసిన కృషిని వివరించి, రాష్ట్రంలో బలమైన కార్మికసంస్థల్లో ఒకటిగా యీనాడు రూపొందిన దన్నారు.

ఇటీవలనే జాతీయంజేసిన రెండు రూట్లకు సంబంధించిన కార్మికులను రోడ్డురవాణా కార్పొరేషన్ సర్వీసులో జేర్చుటకుగాను ఫెడరేషన్ కృషి జేసి జయంపొందిందని చెప్పారు.

మేనెల ఆఖరు వారం గుంటూరులో జరుగబోతున్న ఫెడరేషన్ రాష్ట్ర మహాసభను జయప్రదం చేయుటకు సహకరించవలసిందనీ బలమైన ఐక్య ఉద్యమాన్ని నిర్మించ వలసిందనీ, కోరారు.

దర్వాత మంగళగిరి బస్ వర్కర్సు యూనియన్ అధ్యక్షులు శ్రీ వాశిరెడ్డి మల్లికార్జునరావుగారు మాట్లాడుతూ, తమ యూనియన్ అనుభవాలు చెప్పారు. రాష్ట్ర మహాసభకు విరాళాలివ్వాలని విజ్ఞప్తిచేశారు.

శాసనసభ్యుడు శ్రీ వావిలాల గోపాలకృష్ణయ్యగారు కూడా సమావేశంలో పాల్గొన్నారు. అనంతరం దిగువ తీర్మానాలు ఏకగ్రీవంగాఆమోదించ బడ్డాయి.

నాగార్జునసాగర్ బస్ క్లీనరును గుంటూరు లాలాపేట పోలీసు సబ్ ఇన్‌స్పెక్టరు కొట్టి అక్రమంగా లాకప్ చేశారు. యీ పోలీసు ఆఫీసరు దౌర్జన్యాన్ని ఖండిస్తూ వెంటనే ప్రభుత్వంవారు విచారించి సబ్ ఇన్‌స్పెక్టరుపై తగుచర్య తీసుకోవాలని విజ్ఞప్తిచేశారు.

స్థానిక యూనియన్ కార్యదర్శి శ్రీ బెహారీ కృష్ణమూర్తిగారి కృతజ్ఞతాభివందనములతో సమావేశం ముగిసింది.

గొల్లప్రోలులో నాటకకళోత్సవాలు

గొల్లప్రోలు, ఏప్రిల్ 5

కీర్తిశేషులు కొప్పరపు సుబ్బారావు స్మారక నాటక కళోత్సవాలు గొల్లప్రోలులో ఏప్రిల్ 4 వ తేదీన ప్రారంభింపబడ్డవి. శ్రీ కెప్టెన్ యస్. సి. మార్కండేయులుగారు సభకు అధ్యక్షత వహించారు.

శ్రీ మొక్కపాటి నరసింహంగారు సభను ప్రారంభిస్తూ కొప్పరపు సుబ్బారావుగారితో తమకుగల పరిచయాన్ని వివరించారు. నాటకాలలో పాశ్చాత్య దేశాలలోగల వైఖరులను విశదీకరించారు. నాటకాలు వ్రాయడంలో కవి చూపవలసిన నేర్పు, అవి ఆడటంలో నటులు తీసికోవలసిన శ్రద్ధ చూచేవారిలో ఉండే ఆసక్తి మొదలైనవన్ని కలసినపుడే నాటకం ప్రయోజనాన్ని పొందగలదని చెప్పారు.

హాస్యనట చక్రవర్తి శ్రీ గండికోట జోగినాథంగారు మాట్లాడుతూ నాటకాలు ప్రప్రథమంగా శ్రవ్య కావ్యాలవల్ల ప్రయోజనంగాని ఆనందంగాని పొందలేనివారికోసం దృశ్యకావ్యాలుగా ప్రారంభింపబడ్డాయన్నారు. తర్వాత వానిలో అనేక ఫక్కీలు - తోలుబొమ్మలాట, యక్షగానం వగైరామార్పులు వచ్చి ప్రస్తుత స్టేజి నాటకాలు తయారైనాయి. మైలవరపుకంపెనీ, గున్నేశ్వరరావు కంపెనీ మొదలైనవి కొన్ని నియమాలతో నడిచాయి. రాను రాను డబ్బు రావడం ప్రధానంగా నాటకాలు మారాయి. నటులు జ్ఞానాన్ని కలిగివుండక పోవడంవల్ల వాచకంలో చాలఅసందర్భాలు వస్తున్నాయంటూ కొన్ని పద్యాలు చదివి ప్రేక్షకులను నవ్వించారు. హాస్యనటులుగా తమకుగల కొన్ని అనుభవాల నువివరించారు.

అధ్యక్షులు శ్రీ కొప్పరపు సుబ్బారావుగారిని గురించి ప్రస్తావించి, వారి రోషనార నాటకమే కొందరు నటులు పేరులోనికిరావడానికి కారణమైన దన్నారు.

కార్యదర్శి, అధ్యక్షులకు, నర్తకులకు వందన సమర్పణచేస్తూ కొప్పరపు సుబ్బారావుగారి స్మారక చిహ్నంగా ఈ నాటక కళా పరిషత్తును ఏర్పాటు చేయడానికి కారణాలు చెప్పారు. శ్రీ కొప్పరపు సుబ్బారావుగారి ఛాయా చిత్రానికి పూలమాలలు వేసి నమస్కరించారు.

సభానంతరం నాటికా, నాటక పోటీలు జరిగాయి. ప్రజానాట్య మండలి తొండంగివారి "మూడో యుద్ధం" నాటిక, ప్రజానాట్య మండలి తునివారి "పరివర్తన" నాటకం శ్రీ సరస్వతీ నాట్య నికేతనం కాకినాడ వారి "నాబాబు" నాటిక ప్రదర్శనాలు ప్రేక్షకుల నానందింపజేశాయి.

శ్రీ వేమూరి అంజనేయ శర్మగారి అభినందనసభ

హైదరాబాద్, ఏప్రిల్ 5

శ్రీ వేమూరి అంజనేయశర్మగారు దక్షిణభారత హిందీ ప్రచార సభ ఆంధ్రశాఖకు కార్యదర్శిగా నియమింపబడిన సందర్భంలో హైదరాబాద్ నగర హిందీ ప్రేమీమండలి యాజమాన్యన శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషానిలయంలో అభినందనసభ జరిగింది. డాక్టరు పుట్టపర్తి శ్రీనివాసాచార్యులుగారు అధ్యక్షత వహించారు.

శ్రీ శర్మగారిని హిందీ ప్రేమీ మండలివారు చందన తాంబూలాదులతోను, బంగారపు ఉంగరంతోను, కాశ్మీరు శాలువతోను సత్కరించారు.

ఉపన్యాసాల అనంతరం హిందీ పరీక్షలలో సర్వప్రథమ, ద్వితీయ, తృతీయులుగా ఉత్తీర్ణులయినవారికి బహుమతులు, యోగ్యతాపత్రాలు శ్రీ శ్రీనివాసాచార్యులుగారు పంచిపెట్టారు.

* * *

ఏప్రిల్ 10 నుంచి 16 వరకు దేశమంతటా రైల్వే వారోత్సవాలు జరుగుతాయి.

తెలుగులో ఉత్తమ గ్రంధములకు బహుమతులు

హైదరాబాద్, ఏప్రిల్ 5

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వమువారి నెం. 2723, ఎడ్యుకేషను తే. 19-12-1947 నెం. 83, ఎడ్యుకేషను, తే. 15-1-1953; నెం. 345, తే. 22-2-1957 జీ.ఓ.లన్నూ, మెమో నెం. 14714L/56-5, తే.22-2-1957ల ననుసరించి తెలుగు భాషా సమితి కార్యదర్శి ఈ క్రింది ప్రకటన చేయుచున్నారు.

1954-55 వ సంవత్సరములో బహుమతి పోటీ బాపతు తిరిగి ప్రచురించబడిన విషయములకు ఈ క్రిందివి ఉత్తమ గ్రంథములుగా ఎన్నుకొనబడనవిగాన, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము వారిచే ఒక్కొక్క విషయమునకు రు. 500/- లు చొప్పున బహుమతి ఇవ్వబడును.

"తెలుంగు వచనము" శ్రీ గొబ్బూరి వెంకటానంద రాఘవరావు, "ఆంధ్ర వచన రచనా పరిణామము" శ్రీ నిడదవోలు వెంకటరావు, "పెంకుటిల్లు" శ్రీ కొమ్మూరి వేణుగోపాలరావు, "అన్వేషణము" శ్రీ పోతుకూచి సాంబశివరావు, "కుటీర పరిశ్రమలు" శ్రీమతి మునిపల్లె సరోజినీ దేవి, "కుటీర పరిశ్రమలు" శ్రీ కె. సత్యనారాయణవర్మ.

1956 - 57 వ సంవత్సరములో బహుమతి పోటీకి ప్రచురించబడిన విషయములలో ఈ క్రింది గ్రంథములు ఉత్తమములుగా ఎన్నుకోబడినవి గాన, ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం వారిచే ఒక్కొక్క విషయమునకు రు. 500/- లు చొప్పున బహుమతి ఇవ్వబడును.

"ఆయుర్వేదము — ఆధునిక శాస్త్రీయ పద్ధతి — దాని వికాసము" డాక్టరు ఎ. సుబ్బారావు.

"ప్రజాతంత్ర రాజ్యభావము" శ్రీ జి. ఎస్. శర్మ.

"ఆంధ్ర విద్యుత్ — జల ప్రాజెక్టులు" శ్రీ మాదల వీరభద్రరావు.

పైన వివరింపబడిన రెండు సంవత్సరముల బహుమతులును తెలుగు భాషా సమితివారి వార్షికోత్సవంలో పంచిపెట్టబడును.

శ్రీ కె. ఎల్. నరసింహంగారికి సన్మానం

రాజ్యసభ సభ్యులుగా ఎన్నికైన సందర్భంలో

విజయవాడ, ఏప్రిల్ 5

రాజ్యసభ సభ్యులుగా తిరిగి ఎన్నికైన రాష్ట్రట్రేడ్‌యూనియన్ కాంగ్రెస్ నాయకులు శ్రీ కె. ఎల్. నరసింహం బి. ఎ. గారి గౌరవార్థం, ఆంధ్ర విద్యుచ్ఛక్తిశాఖ కార్మిక సంఘం విజయవాడ బ్రాంచి తరఫున విజయవాడ పవరుహౌసు కార్మికులు 6 వ తేదీన సన్మానం, తేనీటివిందు జరిపారు. సభకు శ్రీ వెంకటస్వామిగారు అధ్యక్షత వహించారు.

శ్రీ నరసింహంగారిని శ్రీ కె. అప్పారావుగారు పుష్పమాలాంకృతులను గావించారు. తదుపరి శ్రీ ఎస్. చలపతిరావు, టి. వెంకటేశ్వరరావు, పి. జె. మనోహరం వగైరాలు, శ్రీ నరసింహంగారు గత ఆరుసంవత్సరాల నుండి చేసిన సేవను కొనియాడుతూ ప్రసంగించారు.

శ్రీ నరసింహంగారు తగు రీతిని సమాధానమిస్తూ కార్మిక ప్రజా సేవయే తమ లక్ష్యమని అన్నారు. ఇకముందు మరింతగా పాటుపడగలమనీ వాగ్దాన మొనర్చారు.

శ్రీ సి. హెచ్. బుచ్చయ్యగారి వందన సమర్పణతో సభ జయప్రదముగా ముగిసినది.

తెలంగాణా గ్రామాధికారుల సంఘం

హైదరాబాద్, ఏప్రిల్ 7

తెలంగాణా గ్రామాధికారుల సంఘంవారు మహబూబునగరుజిల్లా కల్వకుర్తి అచ్చంపేట తాలూకా గ్రామాధికార్ల సభను కల్వకుర్తిలో ఈనెల 27-28 తేదీలలో జరుపుతున్నారు. సభకు హోంమంత్రి రంగారెడ్డిగారు అధ్యక్షత వహిస్తారు. రెవెన్యూమంత్రి కళా వెంకటరావుగారు, రహదారులమంత్రి మందుముల నరసింగరావుగారు సభలో పాల్గొంటారు. (వి. వి.)

తేలప్రోలు

తేలప్రోలు గ్రామ కమ్యూనిస్టు కమిటీ కార్యదర్శి శ్రీ ఆళ్ళ నారాయణరెడ్డిగారి కుమారుని వివాహ సందర్భంలో కమ్యూనిస్టు పార్టీకి రు 5 లు విరాళం ఇచ్చారు.

విజయవాడలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం

విజయవాడ, ఏప్రిల్ 8

పదవ ప్రపంచ ఆరోగ్య దినోత్సవం నిన్న స్థానిక పురపాలకసంఘ ఆరోగ్యశాఖాధికారి ఆధ్వర్యం క్రింద ఇక్కడ జరిగింది. సాయంత్రం ప్రాథమికపాఠశాలలలోని బాలబాలికల ఊరేగింపు ఆరోగ్య విధులు, సూత్రాలు, వ్రాసిన అట్టలతో జరిపారు. పిల్లలకు మిఠాయిలు పంచిపెట్టారు. తర్వాత వెలిదండ్ల హనుమంతరాయ గ్రంథాలయంలో పురపాలక సంఘాధ్యక్షులు డాక్టరు జంద్యాల దక్షిణామూర్తిగారి అధ్యక్షతన బహిరంగసభ జరిగినది. శ్రీయుతులు తెన్నేటి వెంకట శేషాచలపతిరావు, తోలేటి కనకరాజు ప్రభృతులు ఆరోగ్య దినోత్సవ ప్రాముఖ్యతను వివరించారు. ఆరోగ్య శాఖాధికారి శ్రీ జి. నరసింహం ఆంధ్ర ప్రదేశ్ గవర్నరు పంపిన సందేశం చదివారు. తర్వాత 'కుక్కపిల్ల దొరికింది' అనే నాటిక, కొన్ని సమాచార చిత్రాలు ప్రదర్శించారు.

ప్రత్యేక శానిటరీ ఇన్‌స్పెక్టరు శ్రీ ఇ. వి. మునిరత్నం అభినందనలతో సభ ముగిసింది.

ఖమ్మం పోలీసు హెడ్ కానిస్టేబుల్ దౌర్జన్యం

ఖమ్మంమెట్టు, ఏప్రిల్ 7

యీరోజు మధ్యాహ్నం ఖమ్మం రిక్షా కార్మికుడు ఆకుల లక్ష్మయ్య అనే అతను తన రిక్షా తోలుకొని బజారులో వెళుతూ మనిషిని ఎక్కించుకుంటుండగా మోహన్‌దాసు అనే హెడ్ కానిస్టేబిల్ (100 నెం.) రిక్షా డ్రైవరును నడిబజారులో పట్టుకొని విపరీతముగా కొట్టి, పోలీసు స్టేషనుకు తీసుకొనివెళ్ళి మళ్ళీ కొట్టాడు. తరువాత జామీనుపై వదలినాడు. ఇదేగాక మరో రిక్షా డ్రైవరునుకూడా ఇదేరోజు కొట్టినాడు. ఇటీవల రిక్షా కార్మికులంతా తాము సంఘాన్ని పెట్టుకొని బజార్లవెంట సైడులవారీగా జాగ్రత్తగా వెళుతున్నారు. ఇటీవల రిక్షా కార్మిక నాయకుని పోలీసులు కొట్టినందులకు కేసుపెట్టి పోలీసును సస్పెండ్ చేశారు. ఈ పగతోను,రిక్షా యూనియన్‌ను విచ్ఛిన్నం చేయాలనే తలంపుతోను పోలీసులు కార్మికులను అనవసరంగా కొడుతున్నారు. రిక్షా కార్మికుల కోర్కెలు సమంజసమయినవని ఇటీవల పోలీసు అధికార్లుకూడా అంగీకరించారు. కాని క్రింది పోలీసులు కార్మికులను నానా ఇబ్బందుల పాలుచేస్తున్నారు. ఈ హెడ్ కానిస్టేబుల్ పట్టణంలోని రిక్షా కార్మికులనేగాక బజార్ల వెంట వెళుతున్న పల్లెటూరు బండ్లవారిని కూడా అనవసరంగా కొడుతున్నాడు. ఇతని ప్రవర్తన గురించి విచారించాల్సింది యీ రోజు ఖమ్మం రిక్షా యూనియన్ తరఫున పోలీసు ఉన్నతాధికార్లకు దరఖాస్తులు యిచ్చారు. (వి. వి.)

* * *

వరంగల్‌లో రోవర్సు క్లబ్బు ఆఫీసుకు, దానికి సంబంధించిన గేమ్సుకు శ్రీ జె. పిచ్చయ్య (బ్యాడ్మింటన్ ఛాంపియన్) ప్రారంభోత్సవంచేశారు. వరంగల్‌లోనివివిధక్లబ్బుల సభ్యులుఈఉత్సవంలోపాల్గొన్నారు.

కూచిపూడి నాట్యం

(3 వ పేజీ తరువాయి)

ఏఏ హావభావ ప్రకటనలు ఒప్పించే నేర్పు ఎవరికి వుందో, ఆయా పాత్రలకు శాస్త్రీయమైన ఆహార్యం ఏమిటో ఏమీ చూసుకోకుండా, నాట్య ప్రదర్శనాలు యిస్తుంటే, కొంత కాలానికి కూచిపూడి నాట్యకళ అధోగతిపాలై భారతీయ సంస్కృతికి ఒక కళంకాన్ని ఆపాదించినవారవుతారు.

అందుచేత-ప్రదర్శన విషయంలో పాత్రపోషణ, హావభావ ప్రకటన, వేషధారణ, పాటలు, నడక, తీరు, ఆఖరికి వంతపాట, హాస్యం మున్నగు వాటన్నిటిలోనూ పూర్తి ప్రాచీన సాంప్రదాయం చూపించిననాడే మన నాట్యకళకు న్యాయం చేకూర్చడ మవుతుంది.

అట్టి పరివర్తన కూచిపూడి నాట్య ప్రదర్శన నటీనటవర్గంలో అతి త్వరలోనే రాకపోతే, యీ నాట్యకళను ప్రోత్సహించే వారినుండీ, ప్రేక్షకుల్లోంచీ, అట్టి పరివర్తన వచ్చేటట్టు చేసే ఒత్తిడిరాక తప్పదని గ్రహించాలి.

వేయిభద్రతాసమితులు వచ్చినా కాశ్మీరును భారతదేశంనుంచి వేరుచేయడం అసంభవం

—బక్షి గులాం మహమ్మద్ ఉద్ఘాటన

హైద్రాబాదు, ఏప్రిల్ 7

ప్రపంచం పుట్టినప్పటినుంచీ కూడా కాశ్మీరు భారతదేశ అంతర్భాగంగానే వుంది. కాశ్మీరు రాజ్యాంగ పరిషత్తు యీ వాస్తవానికి రాజ్యాంగరూపం మాత్రమే కల్పించింది. ఇది ప్రజల తీర్పు కాకపోతే మరేది ప్రజల తీర్పు అవుతుంది? అని కాశ్మీర్ ప్రధాని బక్షిగులాం మహ్మాద్ నేటి సాయంత్రం యిక్కడ ఒక బహిరంగసభలో ప్రసంగిస్తూ ప్రశ్నించారు.

భద్రతాసమితి తిరిగి సమావేశమై కాశ్మీర్ సమస్యను గురించి చర్చించవచ్చును. కాని 40 లక్షల కాశ్మీరీలతోసహా 36 కోట్ల భారతీయులు చేసిన నిర్ణయాన్ని కొసకు నెహ్రూ తలుచుకొన్నా వేయిమంది బక్షీలు తలుచుకొన్నా మార్చజాలరు. అని ఆయన ఉద్ఘాటించారు.

నేటిమధ్యాహ్నం ఆయన విమానం మీద బొంబాయినుంచి ఇక్కడికి వచ్చారు. విమానాశ్రయంలో ముఖ్యమంత్రి, ఉభయనగరాల మేయర్లు, ఆంధ్రప్రదేశ్ జాతీయ కాశ్మీరు సంఘటన అధ్యక్షుడు సిరాజుద్దీన్ బాబూఖాన్ప్రభృతు లాయనకు స్వాగతం ఇచ్చారు. విమానాశ్రయానికి చేరిన వేలాది ప్రజల హర్షధ్వానాలమధ్య ఆయన విమానంనుంచి దిగారు.

ఆంధ్రప్రదేశ్ కాశ్మీర్ సంఘటన ఆధ్వర్యాన ఎగ్జిబిషన్ మైదానంలో నేటి సాయంత్రం జరిగిన బహిరంగ సభలో ప్రసంగిస్తూ ఆయన ఇలా అన్నారు:

కాశ్మీర్ భారతదేశంలోలీనమైంది. దానికింక తిరుగులేదు. వేయిభద్రతా సమితులు అయిదువందల ఐరాసలు కలిసినా ఆ నిర్ణయాన్ని మార్చజాలవు.

గ్రాహం నివేదిక సమర్పించిన తర్వాత ఇకనేం గరుగుతుంది అని ప్రశ్నిస్తున్నారు.

దీనికొకటేజవాబు. కాశ్మీరు భారత దేశంలో అంతర్భాగం, ఆచంద్రతారార్కం అది అంతర్భాగంగానే వుంటుందిఅని.

1947 లో దేశవిభజన జరిగినప్పుడు భారత పాకిస్తానలలో దేనిలోనైనా చేరే స్వేచ్ఛను ఆరువందల చిల్లర సంస్థానాలకిచ్చారు. తొలుత కాశ్మీరు పాకిస్తాన్‌తో యథాతథపు ఒడంబడిక చేసుకొంది. అయినప్పటికీ అక్టోబరు 22 న పాకిస్తాన్ కాశ్మీరుపై దాడి చేసింది. ఆ దాడిలో జరిగిన రక్తపాతం సంగతి అందరికీ తెలుసును. మతం పేరుతో ముస్లింల కుత్తుకలను ముస్లింలే నరుకుకోవడం కళ్ళారా చూశాను. మత నినాదాల వెనక కాశ్మీరును కాజేద్దామన్న పాకిస్తాన్ దురాశ వ్యక్తమయింది. ఆ దురాక్రమణను కాశ్మీరు ప్రతిఘటించింది. ఒకవైపున దురాక్రమణకు తలపడిన సాయుధ సైన్యం మరొకవైపున నిరాయుధులైన కాశ్మీర్ ప్రజలు నిలిచారు. కాశ్మీరు సహాయంకోసం భారత ప్రభుత్వాన్ని అర్థించింది. భారత ప్రభుత్వం సహాయం పంపి ఆదుకొంది. 180 మైళ్ళు చొచ్చుకొని వచ్చిన పాకిస్తాన్ బలాలను ఇప్పుడు యుద్ధ విరమణ శ్రేణివున్న ప్రాంతాలకు తరిమికొట్టింది.

కాశ్మీరు భారతదేశంలో లీనం అవడంతో సమస్య పరిష్కారమయింది. భారతపాకిస్తాన్ల ఏచట్టం ప్రకారం అధినివేశన ప్రతిపత్తిని పొందారో ఆదేచట్టం ప్రకారం కాశ్మీరు భారతదేశంలో లీనమైయింది.

భద్రతాసమితిముందు పాక్ దురాక్రమణను తొలగించాలని మనం కోరుతున్నాం. కాని భద్రతాసమితి ఈ న్యాయాన్ని చేయలేకపోయింది. సమస్యను పరిష్కరించకపోగా దాన్నింతి జటిలం చేసింది. వాస్తవ విషయాలను వాస్తవ రూపంలో చెప్పడం భద్రతాసమితికి అలవాటు లేదు. పాలస్తీనా, కొరియా, చైనా సమస్యలపట్ల దాని వైఖరే ఇందుకు తార్కాణం. తగాదాపడ్డ ఉభయ పక్షాలను సంతృప్తిపరచడంకోసం దేశాన్ని విభజించాలని భద్రతాసమితి సూచించింది. కాశ్మీరుకు సంబంధించినంత వరకు ఏదోఒక పక్షాన్ని సంతృప్తి పరచడం అన్న సమస్య లేదు. మనశరీరంనుంచి ఒక అంగాన్ని కోసి దాన్ని ఇతరులకుబహుమానంగా ఇస్తామా?

అయిదేళ్ళపాటు నిరీక్షించిన మీదట ఈ సమస్య పరిష్కారం కోసం ఇతరులవైపు చూసి లాభం లేదని జాతీయ మహా సభ నిర్ణయించింది. భద్రతా సమితి తీర్పు కోసం ఎదురు చూడ్డంకన్న తామే ఈ సమస్యను పరిష్కరించుకొనడం ఉచితమని భావించింది. తదనుగుణ్యంగా ఒక రాజ్యాంగ సభను ఎన్నుకొన్నాం. పంజాబు బెంగాలు మాదిరిగా ఈ రాష్ట్రాన్ని విభజించే సమస్య లేదు. భూమి పుట్టినప్పటినుంచి కాశ్మీరు భారతదేశంలో అంతర్భాగం. ఈ వాస్తవానికి రాజ్యాంగరూపం కలిగించింది రాజ్యాంగసభ.

కాశ్మీరులో జన వాక్యసేకరణ కావాలని పాకిస్తాన్ సన్నాయి నొక్కులు నొక్కుతున్నది. కాశ్మీరు ప్రజలు తమ అభిప్రాయాన్ని రాజ్యాంగ సభద్వారా ఏనాడో వ్యక్తం చేశారని నేను చెపుతున్నాను. మొన్నటి ఎన్నికల్లో ఆంధ్రప్రజలు, కేరళ ప్రజలు రెండు విభిన్న ప్రభుత్వాలకుఎంతస్పష్టంగావోటుచేశారో కాశ్మీర్ ప్రజలుకూడ అంత స్పష్టంగానే తమ నిర్ణయాన్ని ప్రకటించారు. ఇది ప్రజాభిప్రాయ ప్రకటన కాకపోతే మరేది ప్రజాభిప్రాయప్రకటన అని నే నడుగుతున్నాను.

భద్రతా సమితి తీర్పుకోసం అయిదేళ్ళు నిరీక్షించి ఆడియాసపొందాం. కమిషన్లు వస్తాయి. కమిషన్లు పోతాయి. కాని నెత్తిమీద న్యాయ ఖడ్గం వ్రేలాడుతూనే వుంటుంది. అందుకని రాష్ట్రాన్ని అస్థిరత్వానికి విడిచిపెట్టి నాశనం చేయడం ఉచితం కాదు. ప్రజలు ఈ సమస్యపై ఒక నిర్ణయం చేశారు. కాశ్మీరుపై నిర్ణయాలు న్యూయార్కులో కాని లేక్‌సక్సెస్‌లో కానిఅమెరికాఅధ్యక్షభవనం వైట్‌హౌస్ కాని జరగడానికి వీల్లేదు.

నేడు కాశ్మీర్ ప్రజలముందున్న ప్రధాన సమస్య జనవాక్యనిర్ధారణ కాదు. భారతదేశంలోని ఇతర రాష్ట్రాలతోపాటు కాశ్మీరునుకూడా అభివృద్ధిచేయడం ఎలాగనేది నేటిప్రధాన సమస్య. ప్రజల దృష్టి అంతా నేడు రాష్ట్ర ఆర్థికాభివృద్ధిపై కేంద్రీకృతమై వుంది.

గ్రాహం నివేదిక

గ్రాహం మళ్ళీ మొన్న కొత్తగా ఒక నివేదిక సమర్పించారు. దీనిలో ఉన్న అంశాలుమాత్రం పాతవే.

సామ్రాజ్యవాదులు భారతదేశాన్ని 150 సంవత్సరాలు పాలించినతర్వాత నిష్క్రమించారు. కాని తిరిగి దొడ్డిదారిన ప్రవేశించాలని చూస్తున్నారు.

పూర్వం చేసిన వాగ్దానాలను నిలుపుకొనవద్దా అని నన్నొకసారి ఒక పెద్దమనిషి ప్రశ్నించాడు. దానికి నేనిచ్చిన జవాబిది. సర్ ఆంథొనీ ఈడెన్ విదేశాంగమంత్రిగా వున్నప్పుడు సైప్రస్ సమస్య పరిష్కారానికి ప్రజాభిప్రాయసేకరణ అవసరం అని ఒక ప్రకటన చేశారు. కాని ఆయనే ప్రధాని అయినతర్వాత సైప్రస్ పరిస్థితులు మారిపోయాయి కాబట్టి ప్రజాభిప్రాయసేకరణ అనవసరం అన్నారు. అలాగే కాశ్మీరు పరిస్థితులుకూడా ఇప్పుడు మారిపోయాయి.

తెల్లవారు నల్లవారుకలసి ఒక పాఠశాలలో చదవరాదని ఆంక్ష పెట్టిన పెద్దమనుషులు మాకు నీతులు చెప్పవస్తున్నారు. ఎవరేం చెప్పినా వినడం మాకలవాటైంది. "ఎవరు ఏం చెప్పినా వినండి మీకుతోచినరీతిని చేయండి" అని మా నాయకుడు గాంధీజీ మాకు బోధించారు.

భద్రతాసమితి తిరిగి సమావేశం కావచ్చును. దానితో తంటాలు పడవలసినవాడూ మళ్ళీ పదిగంటలసేపు యేకధాటిన ఉపన్యసించ వలసినవాడూ శ్రీకృష్ణమీనన్, 40 లక్షల కాశ్మీరీలతోసహా 36 కోట్ల భారతీయులకు సంబంధించినంత మట్టుకు ఒక తిరుగలేని నిర్ణయం చేశారు. దాన్ని నెహ్రూ వచ్చినా వేయిమంది బక్షీలు వచ్చినా మార్చజాలరు.

శ్రీ కృష్ణమీనన్ కాశ్మీర్ సమస్యను గురించి ఎంత స్పష్టంగా చెప్పాలో అంత స్పష్టంగానూ అనేకసార్లు చెప్పారు. ఇంకా స్పష్టపరచవలసిన అంశమేదీ లేదు. దురాక్రమణ ముందు అంతం కావాలని భారతదేశం చెపుతున్నది. కాని ఈ మాట వినడం భద్రతా సమితివారికిష్టంలేదు. వారు ప్రపంచ జనాభిప్రాయాన్ని గురించి మాట్లాడుతారు. నిజమే ప్రపంచ ప్రజాభిప్రాయం కూడా ముఖ్యమైనదే. అయితే ఆ ప్రపంచ ప్రజాభిప్రాయం కోసం మనం కొంపకు నిప్పు పెట్టుకొంటామా?

వివిధ వర్గాలకు చెందిన భారతీయ ముస్లింలు కాశ్మీర్ విషయంలో భారత ప్రభుత్వాభిప్రాయాన్ని బలపరుస్తూ అనేక ప్రకటనలు చేశారు. కాశ్మీర్ విషయంలోభారతముస్లింలు ప్రభుత్వం వెనకలేరు అని పాకిస్తాన్ చేసే ప్రచారానికిది చెంపపెట్టు. కాశ్మీర్ సమస్యజాతీయ సమస్య కాని మత సమస్య కాదు.

భారత సేన దేశరక్షణకే వున్నది కాని దురాక్రమణకోసం కాదని ప్రధాని నెహ్రూ అనేక పర్యాయాలు ప్రకటించారు. మనమీద ఎవరైనా దాడిచేస్తే మాత్రం కన్యాకుమారినుంచి కాశ్మీరం వరకుగల ప్రజలంతా ఒకటిగాలేచి దాన్ని ఎదుర్కొంటారు.

కాశ్మీరుపై భారతదేశ వాదనను అంతా ప్రైవేటు చర్చలలో ఒప్పుకుంటారు. కాని బహిరంగంగా మాత్రం ఒప్పుకొనడంలేదు.

అబ్దుల్లా వ్యవహారం

షేక్ అబ్దుల్లాని 1953 లో అరెస్టు చేశాం. నేను ప్రధాని గద్దెమీద ఎక్కడంకోసం అబ్దుల్లాని అరెస్టు చేసినట్లు కొందరు భావించవచ్చును. అబ్దుల్లా కాశ్మీర్ విముక్తి ఉద్యమానికి నాయకత్వం వహించారు. దాన్నెవరూ కాదనరు. భారతదేశంలో కాశ్మీర్ సంలీనానికి కింక తిరుగులేదని ఆయన అనేకసార్లు ప్రకటించారు. కాని ఆయన సాధించిన ప్రతివిజయాన్ని 1953 లో వమ్ముచేయడానికి దురదృష్టవశాత్తు పూనుకొన్నాడు. మొన్న ఆయనను విడుదలచేసిన తర్వాత చేసిన ప్రసంగాలు వింటే షేక్ సాహెబ్‌ని అరెస్టు చేయడం ఎంత సబబైనదో విశదమౌతుంది.

జాతీయ మహాసభ 1953 కు పూర్వపు అబ్దుల్లాని సృష్టించింది. అదే జాతీయ మహాసభ నేటి బక్షీని సృష్టించింది. జాతీయ మహాసభ సూత్రాలను బక్షీ వుల్లంఘిస్తే బక్షీకికూడా అబ్దుల్లాగతే పడుతుంది.

నేను కళ్లుమూసుకుని కూర్చోజాలను. భారతదేశ గౌరవమర్యాదలతో చెలగాటమాడజాలను. నా కర్తవ్యాన్ని నేను నిర్వహించాలి. అందుకని అబ్దుల్లాని అరెస్టు చేశాను.

మాకు పాకిస్తాన్‌మీద కోపం లేదు. అది సర్వసంపదలతోనూ తులతూగాలని మా వాంఛ. మా పొరుగు దేశం పాకిస్తాన్‌లో ఏర్పడిన అస్థిరత గందరగోళాలు మాకు బాధకలిగిస్తున్నాయి. అని బక్షీ గులాంమహ్మద్ అన్నారు.

అస్సాం - పాక్ సరిహద్దు కాల్పులు

అస్సాం ముఖ్యమంత్రి ప్రకటన

గౌహతి, ఏప్రిల్ 7

అస్సాం, తూర్పు పాకిస్తాన్ సరిహద్దులలో పాకిస్తాన్ సరిహద్దు రక్షణ దళాలు ఆదేపనిగా భారత భూభాగంపైన సాగిస్తున్న తుపాకి కాల్పులను గురించి చర్చించే నిమిత్తం అస్సాం ప్రభుత్వ సూచనపై కరింగంజ్ లో ఉభయ ప్రభుత్వం అధికారులు సమావేశ మవుతున్నారని అస్సాం ముఖ్యమంత్రి శ్రీ బిమల ప్రసాద్ చాలిహా నేడిక్కడ తెలిపారు.

హైవేస్ పనివారికి కరువుభత్యం కోత

కృష్ణాజిల్లా సంఘాధ్యక్షులు శ్రీ వెల్లంకి విశ్వేశ్వరరావుగారి నిరసన

విజయవాడ, ఏప్రిల్ 5

హైవేస్ పనివారికి ఆరురూపాయలు కరువుభత్యాన్ని కోత పెట్టినందుకు నిరసిస్తూ కృష్ణాజిల్లా సంఘాధ్యక్షులు శ్రీ వెల్లంకి విశ్వేశ్వరరావుగారు ఈ దిగువ ప్రకటన చేశారు.

ప్రకటనలో వారిలా తెలిపారు:

అదనపు కరువుభత్యం రు 6/- లు హైవేస్ పనివారగు మేస్త్రీలు, డ్రైవర్లు, క్లీనర్లు, మజ్దూర్లు, వర్క్‌షాపు పనివారు అందరకు యివ్వాల్సిందిగా ఆంధ్రప్రదేశ్ హైవేస్ ఎంప్లాయీస్ యూనియన్, దాని బ్రాంచీలు చాలకాలంగా ఆందోళన చేస్తున్నాయి. ఈ విషయంలో ప్రభుత్వ విధానాలుకూడా చాలా అవకతవకలుగా వున్నాయి.

కేంద్రప్రభుత్వం యిస్తేనేగాని యివ్వలేమనీ ఒకసారి చెప్పడం; కరువుభత్యం ప్రత్యేకంగా యిస్తున్న పనివారందరికి యిస్తామనీ మరొకసారి యీ విధంగా రకరకాల ప్రకటనలు చేస్తున్నారు.

అయితే ఆచరణలో కరువుభత్యం ప్రత్యేకంగావున్న హైవేస్ మేస్త్రీలకు యింతవరకు యివ్వలేదు సరికదా, నేటి వరకు యిస్తూవచ్చిన రోలర్ డ్రైవర్లు, క్లీనర్లకు, హైవేస్ వర్క్‌షాపు వారికి కూడా గత మాసంనుండి నిలుపుచేశారు.

అందువల్ల ఈ అవకతవక విధానాలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విడనాడి, లోగడయిచ్చే డ్రైవర్లు, క్లీనర్లు, వర్క్‌షాపు పనివారికి వెంటనే తిరిగి యిస్తూ, మిగిలిన మేస్త్రీలకు మజ్దూర్లకు కూడా యీ ఆర్డరు వచ్చిన నాటినుండి అసలు జరిపి పనివారిలో నున్న అసంతృప్తిని తొలగించాలని కోరుతున్నాను.

* * *

తన పబ్బం గడుపుకునేందుకు బ్రిటిష్‌వాళ్లు అసభ్యంగా ప్రవర్తిస్తే మాత్రం మాల్టా బ్రిటిష్ ఆధిపత్యం క్రింద వుండదని మాల్టా ప్రధాని మిన్‌టాఫ్ అన్నారు.

బజారు ధరలు

విజయవాడ, ఏప్రిల్ 8

[మధ్యాహ్నం గం॥ 1 వరకు]

బంగారం ధరలు	
మేలిమి: తొల్లా	రు. 112 8 0
మూస	112 4 0
నవరసు	73 8 0
వెండి: 100 తులములు	195 0 0
1 తులము	2 0 0
ధాన్యం ధరలు	
24 కుంచాలు (కొత్తవి)	రు. 26 0 0
వంకసన్నాలు	28 12 0
12 కుంచాలు	28 8 0
అక్కుళ్లు	22 12 0
మసూరి	22 12 0
కొలాకాలి	22 8 0
బియ్యం ధరలు	
24 కుంచాలు (కొత్తవి)	రు. 60 0 0
వంకసన్నాలు	55 0 0
12 కుంచాలు	54 0 0
అక్కుళ్లు	52 8 0
మసూరి	52 0 0
కొలాకాలి	52 0 0
అపరాల ధరలు	
మినుములు 240 శే॥	రు. 48 0 0
కందులు	80/- 87 0 0
నల్లపెసలు(మాగాణి)	51 0 0
పచ్చపెసలు 230 శే॥	51 4 0
పచ్చపెసలు (మెట్టవి)	50 0 0
శనగలు (దేశవాళీ)	35 8 0
,, (పంజాబు)	32 8 0
ధనియాలు 90 పౌనులు	24 0 0
ఉలవలు	36 8 0
ఆముదాలు	42 0 0
పంచదార (ఉయ్యూరు)	107 8 0
కొబ్బరినూనె డబ్బా	38 14 0
తెల్లుల్లి మణుగు	6 8 0 7 0 0
బెల్లం ,,	2 12 0 4 10 0
మిర్చి ,,	18 0 0 18 0 0
ఉల్లి ,,	1 1 0 1 4 0
చింతపండు ,,	8 10 0 5 0 0
నువ్వులనూనె ,,	32 8 0
వేరుశనగ పప్పు 177 శే॥	59 8 0
	60 0 0
,, నూనె మణుగు	15 10 0
కేక్ 160 శేర్లు	17 0 0
కొబ్బరికాయలు 1000	178 0 0
పంచలు 100	102 12 0
ఫార్వర్డ్ ఏప్రిల్ వాయిదా	94 4 0

16 వ తేదీన ఎన్. జి. వో. ల నిరసన దినం

గన్నవరంలో సన్నాహాలు

గన్నవరం, ఏప్రిల్ 5

గన్నవరం తాలూకా యన్. జి. ఓ. ల అత్యవసరసమావేశం శ్రీ ధర్మారావు (తహశీల్‌దారు) గారి అధ్యక్షతను 5 వ తేదీన జరిగినది. సమావేశమునకు ఆంధ్రప్రదేశ్ యన్. జి. ఓ. సంఘ అసోసియేట్ ప్రెసిడెంటు శ్రీ జె. బి. రాజారావుగారు, వైస్ ప్రెసిడెంటు శ్రీ మహబూబ్‌ఖాన్ గారు హాజరై తమకోర్కెలను సాధించుటకుగాను ముందు అవలంబించ వలసిన కార్యక్రమమును గురించి ఉపన్యసించారు.

స్టేట్ రాష్ట్రసంఘంవారు తీర్మానించిన ప్రకారం 16వ తేదీన 'నిరసన' దినముగా పాటించి కాజుయల్ లీవుపెట్టి ఆఫీసుకు హాజరు కాకుండుటకు ఏకగ్రీవంగా తీర్మానించారు.

గానుగనూనె పరిశ్రమ

అభివృద్ధికి సూచనలు

ఎమ్మిగనూర్, ఏప్రిల్ 5

గానుగనూనె పరిశ్రమాభివృద్ధికి ప్రతి జిల్లాలోను ఒక ఉద్యోగిని నియమించాలనీ, ప్రస్తుతం రాష్ట్రమంతటికీ ఉన్న ఒక్క ఉద్యోగి సరిపోడనీ శ్రీ దేవి గానుగనూనె ఉత్పత్తిదారుల సహకార సంఘం అధ్యక్షుడు శ్రీ జి. యం. గంగన్నగారు ఒక విజ్ఞప్తి చేశారు. జిల్లా ఉద్యోగి రిబేట్ బిల్లులను, దరఖాస్తులను పరిశీలించడం, సహకార సంఘాలను, తెలకుల సంఘాలనీ తనిఖీచేయడం మొదలైన పనులు చూడవలసి ఉంటుందని తెలిపారు.

ఎమ్మిగనూరులోత్వరలో గానుగనూనె ఉత్పత్తిదారుల సహకార సంఘం ఏర్పడనున్నదనీ, ఇప్పటికప్పుడే గూడూరులోను, చిత్తూరు, అనంతపురం జిల్లాల్లోను ఇట్టి సహకార సంఘాలున్నవనీ, ఈ సొసైటీలన్నింటిని సరిగా పనిచేయించాలంటే ప్రభుత్వ సిబ్బందిని ఆయా ప్రాంతాలలో అవసరమైన విధంగా నియమించాలనీ కోరారు. గూడూరు గానుగ కేంద్రంలో వీలున్నందున దానిని ప్రదర్శన కేంద్రంగా అభివృద్ధి చేయాలని కోరారు.

హిందీప్రచారసభ కార్యాలయం మార్పు

హైద్రాబాద్, ఏప్రిల్ 5

దక్షిణభారత హిందీప్రచారసభ ఆంధ్ర, హైదరాబాదు కార్యాలయం ఖైరతాబాదులోని స్వంత భవనంలోనికి మార్చబడింది. ఉత్తర ప్రత్యుత్తరాలలో దక్షిణ భారత హిందీ ప్రచార సభ - ఆంధ్ర, ఖైరతాబాదు, హైదరాబాదు-4 అని వ్రాయవలెను. శ్రీ ఉన్నవ రాజగోపాలకృష్ణయ్యగారి కార్యాలయం కూడ పై భవనంలోనే వుంటుంది.

పాయికారి కర్షకపద్ద వెనుకబడినజాతులకాలనీ

కనిగిరి, ఏప్రిల్ 5

నెల్లూరుజిల్లా కనిగిరి తాలూకా వెనుకబడిన జాతుల సమావేశం శ్రీ బి. సి. పుల్లయ్యగారి అధ్యక్షతన ఇటీవల జరిగింది.

పునుగోడులో చేరిన పాయికారి కర్షకులలో పోరంబోకు, ఫారెస్టు భూమిని వెంటనే సొసైటీకి పట్టాలకు ఇవ్వాలని, యాకరువాగు నీరు వృథాకాకుండా ప్రభుత్వ డబ్బుతో కట్టవేయించి నీరు ఆపుదలచేసి 500 ఎకరాలు సాగుచేసుకోవడానికి సహాయపడాలని, వ్యవసాయము, చేతిపనులు చేసుకొనుటకు కావలసిన పరికరములు ప్రభుత్వం ఇప్పించాలని కోరుతూ తీర్మానించారు.

* * *

లంకనుంచి 1954-58 మధ్య 89 వేల 890 మంది భారతీయులు మద్రాసుకు తిరిగి వచ్చారు.

లేఖలు

బస్సులపై నిర్బంధ వసూళ్లు

మహాశయా,

శ్రీరామనవమి పేరుచెప్పి సుమారు నెలరోజులనుండి కొమరగిరిపట్నం నుండి బొబ్బర్లంక ప్రయాణీకులదగ్గర టిక్కెట్టు 1కి 0-1-0 వసూలు చేస్తున్నారు. ఈ నిర్బంధ వసూలు నవమి పూర్తయిన తరువాత కూడా జరుగుచున్నది. అలా యివ్వని ప్రయాణీకులను దింపివేస్తున్నారు. ముఖ్యముగా ఒక బస్సుమీద గుమస్తా దగ్గరవుండి చందా యివ్వమని ప్రయాణీకులను నానా యిబ్బందులు పెడుతున్నారు. సరిగా టిక్కెట్టుకు డబ్బులుగలవారు ఎక్కువ యిబ్బంది పడుచున్నారు. కావున పై అధికారులు నిర్బంధ వసూలు మాన్పించగలరని ఆశించుచున్నాను.

ఇట్లు
దొమ్మేటి సుబ్బారావు
ఎస్: కె. బి. ఆర్ కాలేజీ,
అమలాపురం.

దరిశిలో లోకల్ లైబ్రరీ బ్రాంచి స్థాపించాలి

మహాశయా,

నెల్లూరుజిల్లా దరిశి తాలూకా విద్యా, వైజ్ఞానిక రంగాల్లో పూర్తిగా వెనుకబడ్డ ప్రాంతం. దరిశి 5000 జనాభాకలిగి, తాలూకా కేంద్రమైయున్నది. ఇచ్చట తాలూకాకు సంబంధించిన అన్ని ఆఫీసులు, సబ్ మేజస్ట్రేట్ కోర్టు, హైస్కూలు, సబ్ పోస్టుఆఫీసు వగైరాయున్నవి. కాని యిక్కడ గ్రంథాలయములేదు. 1956 వ సంవత్సరములో నెల్లూరు జిల్లా లోకల్ లైబ్రరీ అథారిటీవారు తాలూకాలో మారుమూల గ్రామమయిన తాళ్ళూరులో బ్రాంచి గ్రంథాలయం ఏర్పాటుచేసియున్నారు. అందువలన తాలూకా ప్రజలకు అది అందుబాటులో లేకుండా యున్నది. నెల్లూరు జిల్లా విద్యాశాఖాధికారిగారుదరిశిలో గ్రంథాలయ అవసరమునుగుర్తించి, సర్వవిధాలా సహకారం చేయగలమని వాగ్దానం చేసియున్నారు. దరిశిలో అన్ని సౌకర్యములు గలిగి, విశాలమైన తాలూకాక్లబ్బుభవనమును, ఫర్నిచరును లైబ్రరీకి యిచ్చుటకు ఈ తాలూకా క్లబ్బు సర్వసభ్య సమావేశంవారు ఏకగ్రీవంగా తీర్మానించియున్నారు. స్థానిక పంచాయితీబోర్డు వారుకూడాతమ పూర్తిసహకారమును యిచ్చుటకు సిద్ధముగా నున్నారు. కనుక ప్రభుత్వంవారు, జిల్లా లోకల్ లైబ్రరీ అథారిటీవారు, బ్రాంచి గ్రంథాలయమును దరిశిలో నెలకొల్పగలరని కోరుచున్నాను.

ఇట్లు,
ఆర్. సుందరరావు

విజయవాడ హోటల్ కార్మికుని తొలగింపు

విజయవాడ, ఏప్రిల్ 7

విజయవాడ పట్టణంలోవున్న హోటలు యజమానులలో లక్ష్మణరావుగారు ఒక పెద్ద యజమాని. వీరి హోటలులలో షుమారు 250 మంది కార్మికులు పనిచేస్తున్నారు. వీరెవ్వరికీ చట్టప్రకారంగా యివ్వవలసిన సెలవులు యివ్వరు. యూనిఫారాలు లేవు. కార్మికులను చాలాహీనంగా చూస్తారు. కొట్టుట, తిట్టుట వీరికి పరిపాటి. గత 25 సంవత్సరముల నుంచి హోటలులో పని చేయుచున్న నారాయణరావుగారనే సర్వరు మాస్టరును అక్రమముగా తొలగించారు. లేబరు ఆఫీసరుగారు కూడా యీ వర్కర్‌ను వుద్యోగములోనుండి తొలగించుట అన్యాయమని, అందువల్ల నష్టపరిహారము యివ్వమని చెప్పినప్పటికి యజమాని నిరాకరించాడు. అందుపై కార్మికులు తీవ్రమైన ఆందోళనచెంది 5 వ తేదీన 200 మంది ఊరేగింపు జరిపి, వీధిమూలల సభలుపెట్టి యజమానుల చర్యలను నిరసించారు. కార్మికులు తమ ఆందోళనను కొనసాగిస్తున్నారు.

కార్మికుల కోర్కెల దినోత్సవం

నర్సారావుపేట, ఏప్రిల్ 4

అఖిలభారత కార్మిక కోర్కెల దినోత్సవం సందర్భంలో యిక్కడ మోటారు కార్మికసంఘం తదితర కార్మికసంఘాల ఆధ్వర్యాన బహిరంగసభ జరిగింది. కార్మికుల కోర్కెల గురించి పలువురు మాట్లాడారు.

ప్రాంతీయవార్తావళి

హిందూపురం మునిసిపల్ హైస్కూలు వార్షికోత్సవం

హిందూపురం, ఏప్రిల్ 6

"తెలుగు సాహిత్యంలోని చాటుపద్యాల విలువ, భావప్రకటనా సామర్థ్యం, రసానుభూతి, ఆనందమూ, శతక రచనల్లోని నీత్యుపదేశక అంశాలు, భావప్రకటనా నానాటికీ విద్యార్థులూ, యితరులూ విస్మరిస్తున్నారు" అని మైసూరు విశ్వవిద్యాలయ తెలుగు ప్రొఫెసర్, విద్వాన్ కె. సుబ్బరామప్పగారు ఈ వేళ మునిసిపల్ హైస్కూల్ వార్షికోత్సవానికి అధ్యక్షత వహిస్తూ అన్నారు.

ఈ సాహిత్యాన్ని యెక్కువగా చదివి దాని ప్రయోజనాన్ని పొందవలెనని విద్యార్థులనుకోరుతూ అనేక చాటు పద్యాలనూ, శతకాల్లోని పద్యాలను రసవత్తరంగా చదివి వివరించారు.

తెలుగువారికీ కన్నడిగులకూ ఒకే లిపి వుండాలనీ దీనిమూలాన అయిదు కోట్లు తెలుగు కన్నడిగులు ఒకటి కావడమే కాక, పుస్తక ప్రకటనకూ, టైపు ఫౌండ్రీ వ్యాపారానికి, పత్రికా ప్రకటనకూ ఆర్థికంగా ప్రయోజనం కాగలదనీ చెప్పారు. ఈ విషయంలో కన్నడ సాహిత్యపరిషత్తువారూ, ఆంధ్ర ఉపాధ్యాయ పండిత పరిషత్తువారు చూపించిన ఉత్సాహాన్ని అభినందించారు. త్వరలోనే దీనిని కార్యగతం చేయాలని ఆంధ్ర సాహిత్యపరిషత్తువారికీ, విశ్వవిద్యాలయాలవారికీ కోరారు.

మైసూరు విశ్వ విద్యాలయంలో కన్నడ ఎం. ఏ., విద్యార్థులు తెలుగు మైనర్ సబ్జెక్టుగా చదువుతూవుండేటట్టు ఆంధ్ర, ఉస్మానియాలలో కూడా కన్నడం మైనర్‌గా ఎం. ఏ., తరగతి పెట్టాలనికోరారు.

త్రిపురాంతకంఫిర్కా ప్రథమ రైతుమహాసభ

ఎర్రగొండపాలెం, ఏప్రిల్ 5

మార్కాపురం తాలూకా త్రిపురాంతకం ఫిర్కా ప్రథమరైతుమహాసభ ముడివేములగ్రామంలో మార్చి 30 వ తేదీన జరిగింది. 10 గ్రామాల నుండి 30 మంది ప్రతినిధులు హాజరైనారు. శ్రీ పూల సుబ్బయ్య, శ్రీ గోను పాపిరెడ్డిగార్లు మహాసభలో పాల్గొన్నారు.

అనావృష్టివల్ల మెట్టభూములందు పైర్లు పండలేదు కాబట్టి పూర్తిఫిర్కా మెట్టభూములకు శిస్తు రెమిషన్ ఇవ్వాలని, తక్షణమే కరువుపనులు, మైనర్ ఇరిగేషన్ పనులు ప్రారంభించాలని గణపవరంనుండి మర్రివేములకు వేయబడిన మట్టిరోడ్డును, త్రిపురాంతకంనుండి ముడివేములమైగ వుమ్మడివరం వరకు వేసిన మట్టిరోడ్లను కంకర రోడ్లుగా వేయాలని, కంట్రాక్టుపనులు సొసైటీల పరంగా చేయించాలని, వినుకొండనుండి త్రిపురాంతకం వరకు వచ్చే ట్రిప్పుల బస్సును ఎర్రగొండపాలెంవరకూ పొడిగించాలని తీర్మానాలుచేశారు.

శ్రీ మాగులూరి యోగయ్యగారు అధ్యక్షులుగాను, శ్రీ పుత్తరాది సుబ్బయ్యగారు కార్యదర్శిగాను కార్యవర్గాన్ని ఎన్నుకొన్నారు.

రాత్రి శ్రీ యోగయ్యగారి అధ్యక్షతను బహిరంగసభ జరిగింది. సభానంతరం తిరుపతి దళంవారు 'కష్టజీవి' బుర్రకథ చెప్పారు.

సీతారాం మైకాగని కార్మికులపట్ల అన్యాయం

గూడూరు, ఏప్రిల్ 5

నెల్లూరుజిల్లా కలిచేడు, సీతారాం మైకాగనిలో మార్చి 20 వ తేది పాత కార్మికులను తొలగిస్తూ కొత్తవారిని పనిలోపెట్టుకోవడం ఒకస్త్రీని దౌర్జన్యంగా చేయిపట్టుకొని బయటికి నెట్టడంతో ఫ్యాక్టరీలోను, గనిలోను పనిజేయు కార్మికులందరు నిరసన తెలియజేస్తూ పనిమానివేశారు.

మార్చి 24 తేది కార్మికుల యజమానులమధ్య రాజీ సంప్రతింపులు ఫలితంగా కార్మికులు పనిలో ప్రవేశించేరు. కార్మికుల మీద మేనేజ్‌మెంటువారు ఏలాంటి చర్యలు తీసుకోరని గని కామందులు తరఫున శ్రీ నెల్లటి వెంకట కృష్ణారెడ్డిగారు హామీ ఇచ్చారు.

కాని మార్చి 26వ తేదీన వ్యతిరేకంగా సమ్మె చేశారని 18 మంది కార్మికులకు నోటీసులు అందజేశారు. దీనితో కార్మికులలో అలజడి, ఆందోళన ఏర్పడ్డాయి. గని కమిటీ కార్యకర్తలకు, ముఖ్యులైన కార్మికులకు కూడా యజమానులు నోటీసులు జారీ చేశారు. గనిలో ప్రస్తుతానికి ఎక్కువ పని లేనప్పటికీ మేనేజ్‌మెంటువారు రోజుకి పదిమందికి పైగా కొత్త కార్మికులకు పనులు కలిగిస్తున్నారు. వెల్‌ఫేర్ కమిటీ ఏర్పాటు చేసిన ఆటల పోటీలలో అవకాశం కల్గించలేదు.

ఇంతేగాకుండా, స్థానిక పోలీసుల అండజూచుకొని పాత కొత్త వారి మధ్య కొట్లాటలు, తగాదాలు పెంచడం జరుగుతూయున్నది.

తగాదాలు పెరిగి గని పనులు స్తంభించే పరిస్థితులు రావచ్చునని, మద్రాస్ రీజనల్ లేబర్ కమీషనర్, నెల్లూరు మైనింగు ఇనస్పెక్టర్లుగార్లు జోక్యం కలిగించుకొని సీతారాం గనిలో యజమానుల కార్మికుల మధ్య సామరస్యం ఏర్పాటుచేయాలని కలిచేడు గనుల కార్మికులు కోరుతున్నారు.

గ్రంథాలయ సహాయార్థం నాటక ప్రదర్శన

పెదనందిపాడు, ఏప్రిల్ 5

పెదనందిపాడు యువజన గ్రంథాలయ సహాయార్థం పర్వాయపాలెం ప్రజానాట్యమండలి వారిచే "కులం లేని పిల్ల" అను నాటకం ప్రదర్శించబడింది. ఈ నాటకాన్ని కె.వి. శేఖర్ నిర్వహించారు.

* * *

కనిగిరి వైశ్యులు శ్రీరామనవమి వుత్సవాల సందర్భంలో 750 మంది బీదలకు పసుమటిబజారు పందిర్లలో భోజనం పెట్టారు.

పొనుగుపాడు బోర్డు హైస్కూలు వార్షికోత్సవం

పొనుగుపాడు, ఏప్రిల్ 7

గుంటూరుజిల్లా పొనుగుపాడు బోర్డు హైస్కూలు వార్షికోత్సవం ఏప్రిల్ 5 వ తేదీన శ్రీ బచ్చెవూడి రాధాకృష్ణమూర్తిగారి అధ్యక్షతను జరిగింది. స్థానిక శాసన సభ్యులు శ్రీ వావిలాల గోపాలకృష్ణయ్య, శ్రీ పి. హనుమయ్య తదితర ప్రముఖులు ఉపన్యసించారు.

అధ్యక్షులు, విద్యార్థులు సరియైన నైతిక జీవనము నలవరచుకొనవలెనని ఉద్బోధించారు. శ్రీ గోపాలకృష్ణయ్యగారు విద్యార్థులు బాగుగ శ్రమించి మంచి విద్యాస్థాయిని సంపాదించవలెనని చెప్పారు. శ్రీ పి. హనుమయ్యగారు భిన్న భిన్న రాజకీయ సిద్ధాంతాల సంఘర్షణలో చిక్కుకొనిన నేటి ప్రపంచములో మానవుడు యదార్థ విజ్ఞానానికై కృషిసల్పవలెనని ఉద్బోధించారు.

ప్రధానోపాధ్యాయులు శ్రీ పి. ఎ. ప్రసాదుగారి వందనములతో సభ ముగిసింది.

సంక్షిప్తవార్తలు

గుంటూరుజిల్లా తాడేపల్లిలో మార్చి 29వతేదీన గ్రామ కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యాన బహిరంగసభ జరిగింది. శ్రీ మేకా సోమిరెడ్డిగారు అధ్యక్షత వహించారు. మంగళగిరి అభ్యుదయ నాట్యమండలివారు "కష్టజీవి" బుర్రకథ చెప్పారు.

◆ ◆ ◆

గుంటూరుజిల్లా నంబూరులో శ్రీ కూరకుల తిరుపతయ్యగారి వివాహ సందర్భంలో కమ్యూనిస్టు పార్టీకి ఒకరూపాయి విరాళమిచ్చారు.

సభలు-సమావేశాలు

నల్లగొండ రైతుసంఘ కార్యవర్గ సమావేశం

హైద్రాబాద్, ఏప్రిల్ 7

నల్లగొండజిల్లా రైతుసంఘ కార్యవర్గసమావేశం నల్లగొండలో ఈనెల 12-13 తేదీలలో జరుగుతుంది. రాష్ట్ర రైతు సంఘ కార్యదర్శి శ్రీ వై. వి. కృష్ణారావుగారు సమావేశానికి హాజరవుతారు. భూసంస్కరణల విషయంలో జరపదగు రైతు యాత్రలను గురించి చర్చలు జరుపుతారు. (వి.వి.)

◆ ◆ ◆

ఒంగోలు తాలూకా వ్యవసాయ కూలీ కార్యవర్గ సమావేశం ఈ నెల 11 వ తేదీ ఉదయం 11 గంటలకు ఒంగోలు తాలూకా కమ్యూనిస్టుపార్టీ ఆఫీసులో జరుగుతుంది.

◆ ◆ ◆

సత్తెనపల్లి తాలూకా కమ్యూనిస్టు కమిటీ సమావేశం ఈ నెల 10 వ తేదీ ఉదయం 11 గంటలనుండి సత్తెనపల్లిలో జరుగుతుంది.



శులేఖా
పెన్
సంతృప్తి
నిచ్చును

సోల్ డిస్ట్రిబ్యూటర్లు:
పెన్ మెన్స్
ఇండస్ట్రియల్ సర్వీసెస్,
కాందివ్లి, బొంబాయి-3, యస్. డి.
లోకల్ సేల్సు:
10, షామ్‌సెట్‌వీధి, బొంబాయి.

పళ్లను
తోము
కొనుటకు
దివ్యమైనది

క్లీన్
టూత్‌బ్రష్

★ దృఢ పర్చ బడిన నైలన్ కుంచెలు
★ బొటన వ్రేలుకు అదిమి యుండే ఒడి

సోల్ డిస్ట్రిబ్యూటర్లు:
హెర్బర్ట్ సన్స్ ప్రైవేట్ లిమిటెడ్.,
బొంబాయి - కలకత్తా - ఢిల్లీ - సికింద్రాబాద్.

టెండరు నోటీసు

గుంటూరుజిల్లా రేపల్లె తాలూకా పల్లపట్ల పంచాయితీకి ఈ క్రింద కనపరచిన బిల్డింగుకు పంచాయితీ ప్రసిడెంటుగారిచే 16-4-58 బుధవారం ఉదయం 10-30 గంటలకు సీలు టెండర్లు స్వీకరించబడును. అదేరోజు 11 గంటలకు టెండరుదార్ల సమక్షములో టెండర్లు తెరువబడును. మిగతా అన్ని విషయములు ఆఫీసు పనిచేయు వేళలలో కనుగొనవచ్చును.

పనిపేరు: పంచాయితీ ఆఫీసు అండ్ రీడింగు రూము: ఎస్టిమేటు మొత్తం: రు 3000/- డిపాజిట్టు: రు 150/-.

ఎన్. బి.:- బిల్డింగునకవసరమగు రాయి పంచాయితీ ద్వారా సప్లయి చేయబడును.

(సం) నల్లమల లింగయ్య
పంచాయితీ ప్రసిడెంటు,
పల్లపట్ల, 7-4-58.





నూతనముగా
ప్రవేశపెట్టబడుచున్నది!

DT-14B
డీసిల్ ట్రాక్టర్
(రష్యాలో తయారు)

అన్నివిధములా, అత్యద్భుతంగా అభివృద్ధి పరచబడిన మోడల్ DT-14 B. అటు వ్యవసాయమునకు ఇటు రవాణా సౌకర్యమునకు తగినట్లుగా హిచ్డ్ అండ్ మౌంటెడ్ పరికరాలతో బహుళార్థ ప్రయోజనకారిగా డిజైన్ చేయబడినది

అత్యుత్తమంగా పనిచేసేదు 14 హెచ్. పి. ఇంజనుతో అమర్చబడిన యీ నాలుగు చక్రాల రో-క్రాప్ యూనివర్సల్ ట్రాక్టర్ అన్నిరకాల పరికరాలతో, స్పేర్సు, టూల్సు, స్లిప్, కలిపి రు. 6000/- లు మాత్రమే.

ప్రత్యేకతలు:
* హైడ్రాలిక్ పంపు అండ్ లిఫ్ట్
* పి. టి. ఒ. అండ్ బెల్ట్‌పుల్లి
* ఎలక్ట్రిక్ లైటింగ్
* సెల్ఫు స్టార్టింగ్
* గంటలు చూపు మీటరు
* రివర్సిబుల్ స్టీరింగ్ అండ్ గేర్‌డాష్సు
* గ్రౌండ్ క్లియరన్సు ఎడ్జస్టబుల్
* డ్రైవర్సు కానాపి

అస్సాం, పశ్చిమ బెంగాల్, ఒరిస్సా, ఆంధ్ర, మద్రాస్, కేరళ & రాజస్తాన్‌లకు
సోల్ ఏజంట్లు అండ్ దిగుమతిదార్లు:
భారత ఇండస్ట్రీస్ అండ్ కమర్షియల్ కార్పొరేషన్
ఒపెరహౌస్, చౌరంగి స్క్వేర్, కలకత్తా—1 ఫోన్: 23-3886 & 23-5556
సర్వీస్ & స్పేర్‌పార్టుల డిపో.. ఫారం & వర్క్‌షాప్, 8 బి. టి. రోడ్, బెల్‌ఘోరియా
ఫోన్: PANIHATI—286

EXPORTERS: % "AVTOEXPORT" MOSCOW

సబ్ డిస్ట్రిబ్యూటర్లు:

రాజస్తాన్
లైలా ట్రాక్టర్ కంపెని,
శ్రీ గంగనగర్

ఆంధ్ర
నవభారత్ ఎగ్రికల్చరల్ & కమర్షియల్
కార్పొరేషన్, విజయవాడ-2

అస్సాం
బోడి మోటార్ & సైకిల్ కంపెని
టిన్‌సుకియ

ప్రెస్‌కమిషన్ సిఫార్సులుఅమలు జరపడంలో ప్రభుత్వ వైఫల్యం

లోక్‌సభలో డాక్టర్ కేస్కార్ ఒప్పుకోలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 7

ప్రెస్ కమిషన్ చేసిన సిఫార్సులలో కొన్నింటిని అమలుజరపడంలో ప్రభుత్వం విఫలమైనమాట నిజమేనని నేడు లోక్‌సభలో సమాచార, బ్రాడ్‌కాస్టింగ్ శాఖామంత్రి డాక్టర్ కేస్కార్ ఒప్పుకొన్నారు.

అయితే ప్రభుత్వం తన శక్తి వంచనలేకుండా వాటిని అమలుజరపడానికి ప్రయత్నం చేసిందనీ, ఇక ముందుకూడా ప్రయత్నం చేస్తుందనీ ఆయన వాగ్దానం చేశారు.

సమాచార, బ్రాడ్‌కాస్టింగ్ మంత్రిత్వశాఖ పద్దుపైజరిగిన చర్చకు డాక్టర్ కేస్కార్ సమాధానమిస్తూ పైవిధంగా చెప్పారు.

ఈ పద్దుపై చర్చకు మొట్టమొదట మూడు గంటలు మాత్రమే కేటాయించారు. కాని చర్చలో సభ్యులు చూపెట్టిన ఆసక్తిమూలంగా మరో గంటా 20 నిమిషాలపాటు చర్చను పొడిగించారు.

పుటల సంఖ్యననుబట్టి పత్రిక వెలను నిర్ణయించేవిషయమై ప్రభుత్వము "చాల త్వరలో"నే ఒక నిర్ణయానికి రాగలదని ఆయన ప్రకటించారు.

పత్రికలవారి కోరికేదన్నా - ప్రభుత్వం పాత్రికేయుల నీతి నియమాలకు సంబంధించిన ప్రెస్ కౌన్సిలును నెలకొల్పేందుకు ఒక శాసనం ప్రవేశపెట్టవలసివుందని డాక్టర్ కేస్కార్ ఖచ్చితంగా చెప్పారు.

వార్తా సంస్థలను పునర్నిర్మాణం చేయాలన్న ప్రెస్‌కమిషన్ సిఫార్సులనువార్తాసంస్థలఅధిపతులకుపంపించామని ఆయనన్నారు. అయితే శాసనం ద్వారా వాటిని పునర్నిర్మించే ప్రయత్నం సముచితం కాదని తాము భావించుచున్నట్లు ఆయన తెలిపారు.

ఆలిండియా రేడియో భాషా విధానంపై సభ్యులు చేసిన విమర్శలకు ఆయన సమాధానం చెపుతూ, ప్రాంతీయ భాషలను ప్రచారం చేయడంలో ఏ యితరసంస్థ చేయనంతటి కృషిని ఆలిండియా రేడియో చేసిందని అన్నారు.

చర్చ సందర్భంలో చాలమంది సభ్యులు ఆలిండియా రేడియో ప్రభుత్వంలోని ఒక శాఖగాగాక, ఒక కార్పొరేషన్‌క్రింద నిర్వహించబడాలని కోరారు.

చర్చ వివరాలు

పద్దుపై చర్చను కమ్యూనిస్టు సభ్యుడు శ్రీ యం. కె. కుమారన్ (కేరళ) ప్రారంభించారు. పత్రికల పట్ల ప్రభుత్వం అనుసరించుచున్న వైఖరిపై ఆయన తన ప్రసంగంలో ఎక్కువభాగాన్ని కేంద్రీకరించారు. ప్రెస్ కమిషన్ సిఫార్సులన్నింటిని అమలుజరపక పోవడం అత్యంత శోచనీయమైన విషయమని ఆయన అన్నారు.

పత్రికల యాజమాన్యంలో గుత్తాధికారాన్ని నిర్మూలించి, వికేంద్రీకరణ, ప్రజాతంత్రీకరణకు ప్రయత్నం చేయాలని ఆయన కోరారు.

పుటలసంఖ్యనుబట్టి పత్రికధర నిర్ణయించేపద్ధతిని వెంటనే ప్రవేశపెట్టాలనీ, ప్రెస్‌కౌన్సిల్‌ను ఏర్పాటు చేయాలనీ, దేశంలోని ప్రధానమైన వార్తాసంస్థలను పునర్నిర్మాణం చేయాలనీ,ఆలిండియా రేడియోను ఒక పబ్లిక్ కార్పొరేషన్ యాజమాన్యంలో నిర్వహించాలని శ్రీ కుమారన్ కోరారు.

పత్రికలకు ప్రభుత్వం అడ్వర్టయిజుమెంటులను ఇచ్చే విషయంలో విశాల దృక్పథాన్ని అనుసరించాలని కూడా ఆయన కోరారు.

ఆలిండియా రేడియో కాంగ్రెసు పార్టీ ప్రచారసాధనంగా మారింది

శ్రీ ఇ. వి. కె. సంపత్ (డి.యమ్.కె.-మద్రాసు) మాట్లాడుతూ ఆలిండియా రేడియో రోజురోజుకూ కాంగ్రెసుపార్టీ ప్రచార సాధనంగా మారిపోతున్నదని విమర్శించారు. పాలకవర్గపార్టీ కార్యకలాపాలను అత్యంత వివరంగా, ఆసక్తికరంగా రేడియో ప్రసారంచేయడానికి యత్నిస్తుందన్నారు. అలాగే ఫిలిమ్స్‌డివిజనుకూడానన్నారు. ఇతర రాజకీయపార్టీలకు ఈ సంస్థ కొద్దిపాటి స్థానంకూడా యివ్వడం లేదని ఆయన విమర్శించారు. అలాగే హిందీకి యిచ్చిన ప్రాధాన్యత ఇతర దేశ భాషలకు ఇవ్వడం లేదన్నారు.

శ్రీమతి వేదకుమారి (కాంగ్రెసు-ఆంధ్ర) మాట్లాడుతూ, ఆలిండియా రేడియోస్టాఫ్ ఆర్టిస్టుల పరిస్థితులు చాల అధ్వాన్నంగా వున్నాయన్నారు. గత సంవత్సరం ఈ విషయాన్ని తాను మంత్రిదృష్టికితీసుకొని వచ్చినా ఇంతవరకూ వారి పరిస్థితిని బాగుపరచడానికి ఏ చర్యలను తీసుకోలేదన్నారు.

శ్రీ అన్సార్ హార్వాని (కాంగ్రెసు యు. పి.) సమాచార, బ్రాడ్ కాస్టింగ్ మంత్రిత్వశాఖకు గల ప్రాధాన్యతదృష్ట్యా ఈ శాఖను కేబినెట్ హోదాగల మంత్రిచేతిలో వుంచడం అవసరమని సూచించారు.

పాత్రికేయుల వేతనాలబోర్డు నిర్ణయాలపై సుప్రీమ్‌కోర్టు తీర్పును గురించి ఆయన ప్రస్తావించి ఇలా అన్నారు:

"ఏదో ఒక విధంగా ఆ నిర్ణయాలను అమలు జరపగలశక్తిసామర్థ్యాలు ప్రభుత్వానికి గలవని నేను విశ్వసించుచున్నాను."

పత్రికాధిపతులు జమాఖర్చులను, వారి ఆర్థిక పరిస్థితిని గురించిన వివరాలను ఒక కమిషను ముందు సమర్పించేటట్లు చేయాలని ఆయనన్నారు. అలా చేయకపోతే ప్రజలకు పార్లమెంటుకు ప్రజాస్వామికంపై విశ్వాసం సడలిపోతుందని చెప్పారు.

శ్రీ యస్. జి. గోరే (ప్ర. సో. పార్టీ) సమాచార బ్రాడ్‌కాస్టింగ్ మంత్రిత్వశాఖ, ఆలిండియా రేడియో వ్యవహారాలను గురించి దర్యాప్తు జరిపించడానికి ఒక కమిషన్‌ను నియమించాలని కోరారు.

ప్రభుత్వం సమాచారశాఖ వారి ప్రచురణలు ఇంగ్లీషులో ప్రకటించరాదని శ్రీ గోరే అన్నారు. అవి ప్రజలకు ఎందుకూ ఉపయోగపడవు కాబట్టి దేశభాషల్లోనే ప్రచురించడం అవసరమని సూచించారు. పుటల సంఖ్యనుబట్టి పత్రిక ధర వుండాలన్న సూత్రాన్ని త్వరగా అమలు జరపాలనికూడా ఆయన కోరారు.

శ్రీ మహావీర్ త్యాగి (కాంగ్రెసు-యు. పి.) మాట్లాడుతూ, సుప్రీమ్ కోర్టునిర్ణయాలదృష్ట్యా, పాత్రికేయుల పరిస్థితులను బాగుపరచడానికి ప్రభుత్వం ఏదో ఒకటి చేయాలని కోరారు.

శ్రీ నవప్రభాకర్ (కాంగ్రెసు-ఢిల్లీ) రేడియో లైసెన్సుఫీజును పది రూపాయలకు తగ్గించాలన్నారు.

చర్చలో శ్రీమతి ఉమానెహ్రూ (కాంగ్రెసు), ఆర్. కె. ఖాడిల్కర్ (స్వతంత్ర), శ్రీ జగదీష్‌అవస్థి(సోషలిస్టు), శ్రీ భక్తదర్శన్ (కాంగ్రెసు), డాక్టర్ సుశీలనయ్యార్ (కాంగ్రెసు), డాక్టర్ యన్. సి. కె. భట్టాచార్య (కాంగ్రెసు), శ్రీ బ్రిజాసింగ్ (సోషలిస్టు) పాల్గొన్నారు.

ఆ తరువాత డాక్టర్ కేస్కార్ చర్చకు సమాధానం చెప్పారు.

నాట్య సముద్ధరణకు పథకం

సంగీతనాటక అకాడమీ నాట్య గోష్ఠి తీర్మానాలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 7

దేశంలో నాట్యకళాభివృద్ధికికొన్ని సూచనలనుచేస్తూ సంగీత నాటక అకడమీవారు ఏర్పరచిన నాట్య గోష్ఠిలో తీర్మానాలు చేశారు.

వివిధ నాట్య రీతులలోనూ ప్రసిద్ధులైన వారికి బహుమానలివ్వడమే కాకుండా నాట్యశాస్త్రంలో అర్హులైన విద్యార్థులకు, అధ్యాపకులకు అకాడమీవారు ప్రత్యేక బహుమతులివ్వాలని సూచించారు.

భరతనాట్య శిక్షణపద్ధతులను, నాట్యోపకరణాలను సమన్వయపరచడంకోసం దేశంలోని నట్టువనార్లందర్నీ(నాట్యాచార్యులు) సమావేశపరచి చర్చలుజరిపి ఒక నాట్యశిక్షణ పద్ధతిని నిర్ణయించాలన్నారు.

నాట్యానికి అంగుదార్లుగా వుండే 'నట్టువాంగం' ఇప్పుడు దేశంలో కొరవడింది. అందుకని నట్టువాంగానికి తగు శిక్షణ నివ్వడంకోసం ఒక కేంద్ర కళాశాలను నెలకొల్పాలి.

కథక నృత్యంలో ప్రసిద్ధులు దక్షిణాది నాట్యోత్సవాలలోనూ భరతనాట్య కోవిదులు ఉత్తరాది నాట్యోత్సవాలలోనూ పాల్గొని వారి వారి కళా కౌశలాన్ని ప్రదర్శించడం అవసరం.

కథక నృత్యంలో కూడా వివిధ అధ్యాపక రీతులను సమన్వయ పరచడంకోసం దేశంలో కథక నాట్యాచార్యులను సమావేశపరచి చర్చలు జరిపి ఒక పద్ధతిని నిర్ణయించాలి.

భరత నాట్య శిక్షణ పొందే విద్యార్థులకు విద్యాశాఖవారు స్కాలరుషిప్పులు ఏర్పాటుచేయాలి.

ఆగ్నేయాసియా నాట్యరీతులను, నాట్యోపకరణాలను పరిశీలించడంకోసం ఒక నాట్యబృందాన్ని ఆదేశాల పర్యటనకు సంగీత నాటక అకాడమీవారు పంపాలి.

కథకాళి నృత్యాన్ని పునరుద్ధరించి పెంచి పోషించిన మహాకవి వళ్లత్తోల్ నారాయణమీనన్ స్మృతికి సంతాపం తెల్పుతూ గోష్ఠిలో ఒక తీర్మానం చేశారు.

నేటి సమావేశానికి శ్రీమతి కమలాదేవి ఛటోపాధ్యాయ అధ్యక్షత వహించారు. నాట్యాన్ని గురించి చర్చించడానికి ఇలాంటి గోష్ఠులు నింకా ఎన్నింటినో జరపవలసిన అవసరం వుందని ఆమెఅన్నారు.

సంగీత నాటక అకాడమి కార్యవర్గ సభ్యుడు శ్రీ నిత్యానంద కనుంగో భారత నృత్యరీతులను సర్వే చేయించడం అవసరమన్నారు.

గోష్ఠిని ఏర్పరచినందుకు అకాడమీని అభినందిస్తూ శ్రీమతి మృణాళినీ సారాభాయి, గురుగోపీనాథ్‌లు ప్రసంగించారు.

చైనా, లంక, నేపాల్‌ల నుంచి వచ్చిన ప్రతినిధులకు అకాడమీవారు బహుమతులిచ్చారు.

సరస్వతి కంచువిగ్రహాన్ని, సరిగ పనిచేసిన శాలువను, నట్టువ విగ్రహాలు చెక్కిన ఒక పళ్లాన్ని చైనా ప్రతినిధి బృందాని కిచ్చారు.

నట్టువ విగ్రహాలుగల ఒక పళ్లాన్ని నటరాజ విగ్రహంగల ఒక వెండి పళ్ళాన్ని లంక ప్రతినిధుల కిచ్చారు.

నట్టువ బొమ్మల పళ్ళెం, సరిగ శాలువ, వెండి శిరోభూషలు నేపాల్ బృందాని కిచ్చారు.

అణ్వస్త్ర పరీక్షల నిలుపుదల

అమెరికాకు డెమాక్రాటిక్ పార్టీ సెనేటర్ విజ్ఞప్తి

వాషింగ్టన్, ఏప్రిల్ 7

వచ్చే వసంత కాలంలో అణ్వస్త్ర పరీక్షల్ని పూర్తిచేసుకొని ఆ తర్వాత అమెరికా మున్ముందుగా అణ్వస్త్ర పరీక్షల్ని నిలుపుదల చేస్తుందని అమెరికా ప్రభుత్వం ప్రకటించాలని గతంలో అమెరికా ఉపాధ్యక్ష పదవికి పోటీ చేసిన డెమాక్రాటిక్‌పార్టీ అభ్యర్థి సెనేటర్ ఎస్టిస్ కుఫావెర్ నేషనల్ టెలివిజన్ ప్రసంగంలో విజ్ఞప్తిచేశారు.

అమెరికాగనుక ఈ చర్య తీసుకోకపోతే అణ్వస్త్రాల ఉత్పత్తి పోటీలో ఎప్పుడైనా సరే యితర దేశాలుకూడా పాల్గొనడం ఖాయమని, ఈ పోటీగనుక అంతం కాకపోతే ఎవరో ఒకరు బాంబు వదలడం కూడా ఖాయమని సెనేటర్ ఎస్టేస్ అన్నారు.

లంక భారతీయులను గురించి మద్రాసు శాసనసభలో తెచ్చిన వాయిదా తీర్మానాన్ని స్పీకరు త్రోసి వేశారు.

అజయఘోష్ పత్రికా గోష్ఠి

(1 వ పేజీ తరువాయి)

యిప్పుడు జాతీయైక్యతను కాపాడలేక పోతూంది."

కమ్యూనిస్టుపార్టీ ముసాయిదా తీర్మానంలో కాంగ్రెసు పలుకుబడితగ్గిపోవడంతో అక్కడక్కడ అభివృద్ధి నిరోధక, విచ్ఛిన్నకరశక్తులు తలెత్తుతున్నాయని వున్న భాగంలో అకాలీ పార్టీని చేర్చలేదేమని ఒక విలేఖరి ప్రశ్నించాడు.

"అకాలీలు కాంగ్రెసుపార్టీలోనే ఉన్నారు. పంజాబులో కాంగ్రెసు హిందూ, సిక్కు మతతత్వవాదుల ప్రాబల్యంకింద ఉంది" అని అజయఘోష్ జవాబు చెప్పారు.

పంజాబు పరిస్థితి

పార్టీ ముసాయిదా తీర్మానంలో సంయుక్త మహారాష్ట్ర, మహా గుజరాత్ నిర్మాణ వాంఛను బలపరుస్తూ వున్న భాగాన్ని ఉదహరించి, పంజాబ్ రాష్ట్రానికి భాషా ప్రయుక్త సూత్రాన్నిఎలా వర్తింపచేస్తారని ఒక విలేఖరి అడిగాడు.

"పంజాబు విషయంలో కూడా భాషా ప్రయుక్తరాష్ట్ర నిర్మాణమే సమస్యా పరిష్కార మార్గమని మేము సూత్రప్రాయంగా చెప్పాము. అయితే, పంజాబీలందరూ ఐక్యతతో నిలబడి డిమాండు చేసినప్పుడే ఈ సూత్రం అమలు జరగడం సాధ్యం. కాని, పంజాబు ప్రజల్లో ఒక పెద్ద భాగం దీనికి వ్యతిరేకం. అందువల్ల భాషాప్రయుక్త పంజాబీ రాష్ట్రం అనే నినాదం పంజాబీలను ఐక్యపరిచే నినాదం కాజాలదు. కాబట్టి, భాషాప్రయుక్త రాష్ట్రం అనే సూత్రాన్నే అమోదిస్తున్నప్పటికీ, పంజాబు విషయంలో మండల ప్రాతిపదికపై రాష్ట్రనిర్మాణ సూత్రాన్ని మేము బలపరిచాము" అని అజయఘోష్ జవాబుచెప్పారు.

ఎన్నికలలో ప్రజాశక్తులు విజయం సాధించిన పిమ్మటకూడా ప్రజాసమీకరణ అవసరం ఎంతవున్నదో కేరళ అనుభవం రుజువుచేస్తున్నది అని పార్టీ ముసాయిదా తీర్మానంలోని భాగాన్ని పేర్కొని, "ప్రజా సమీకరణ" అంటే ఏమిటని విలేఖరులు అడిగారు.

"ఈ మాటకు బెదిరిపోనవసరం లేదు. శాంతియుత ప్రజాచర్యలని అర్థం చెప్పుకోవచ్చు. అక్కడ ప్రభుత్వానికి వ్యతిరేకంగా అభివృద్ధి నిరోధకులు ప్రదర్శనలు సాగిస్తే, ప్రభుత్వపు అభివృద్ధికర విధానాలను బలపరుస్తూ మేముకూడ పెద్ద ఎత్తున ప్రజా సమీకరణ గావించి ప్రదర్శనాలు జరుపుతాము" అని అజయఘోష్ జవాబుచెప్పారని పి. టి. ఐ. వార్తాసంస్థ తెలుపుతూంది.

ప్రత్యామ్నాయ ప్రభుత్వాల స్థాపనకు అవకాశాలు

"కమ్యూనిస్టుపార్టీ, తదితర ప్రజాతంత్రశక్తులుఐకమత్యం కుదుర్చుకొని, ప్రజలపట్ల తమ కర్తవ్యాలను చిత్తశుద్ధితో నిర్వహించేందుకు ఈ క్షణం నుంచిపూనుకొన్నట్లయితే, కాంగ్రెస్ గుత్తాధికారానికి మరికొన్ని తూట్లు పొడవడం సాధ్యమ"ని పార్టీ ముసాయిదా తీర్మానంలో ఉన్న భాగాన్ని అజయఘోష్ పత్రికా విలేఖరుల దృష్టికి తెచ్చారని "విశాలాంధ్ర విలేఖరి" రాస్తున్నారు.

అప్పుడు, మరికొన్ని రాష్ట్రాల్లో కూడా ప్రత్యామ్నాయ ప్రజాతంత్ర ప్రభుత్వాల నేర్పరచి, కేరళలో ప్రారంభమైన పరిణామాన్ని ఇంకా విస్తరింప జేయ వీలవుతుందని కూడా తీర్మానంలో ఉన్నభాగాన్ని ఆయన పేర్కొన్నారు.

ఈ తీర్మానభాగాన్ని వివరిస్తూ అజయఘోష్ ఇలా అన్నారని "విశాలాంధ్ర విలేఖరి" రాస్తున్నారు:

"దీని అర్థం ఆ ఇతర రాష్ట్రాల్లో కూడా కమ్యూనిస్టు ప్రభుత్వాలు ఏర్పడతాయని మేము భావిస్తున్నామని కాదు. కేరళలో ప్రభుత్వాన్ని ఏర్పరచినప్పుడుకూడా, రాష్ట్రంలోని వామపక్షాల నన్నిటినీ కలిపి ప్రభుత్వాన్నేర్పరచడానికే మేము ప్రయత్నించాము. ఎన్నికలు జరగడానికిముందూ, ఆ తరువాతకూడా ఇదే దృష్టితో ప్రయత్నాలు సాగించాము. ఆ ప్రయత్నాలు సఫలం కాలేదు అంటే నేరం కమ్యూనిస్టులది కాదు. "వివిధ రాష్ట్రాల్లో ప్రజాతంత్ర, అతివాదపార్టీలనూ, అభివృద్ధి కాముకులయిన స్వతంత్రులనూ, తదితరులనూ కలిపి ప్రభుత్వాల నేర్పరచాలనేదే మా లక్ష్యం.

"ఈ సంవత్సరంలో ఏ ఒక్క రాష్ట్రాన్నీ పేర్కొనాలనే ఉద్దేశం నాకులేదు. ఎందుకన్నంటే, రాబోయే రెండుమూడేళ్ళలో రాష్ట్రాల్లో పరిస్థితులు ఎలా పరిణమిస్తాయో నేను చెప్పలేను."

కేరళ ఉపఎన్నికలో ప్ర. సో. పార్టీ వైఖరి

శ్రీ గంగాశరణ్‌సిన్హా వివరణ

కోయంబత్తూరు, ఏప్రిల్ 7

ప్రతిపక్షాల వోట్లు చీలిపోకూడదనేది ప్రజాసోషలిస్టుపార్టీ సిద్ధాంతమని, కేరళ ఉపఎన్నికల్లో కూడా తమపార్టీ అదేసూత్రాన్ని అనుసరించవలసిందనీ ప్రజాసోషలిస్టు పార్టీ అధ్యక్షుడు శ్రీ గంగాశరణ్ సిన్హా నేడిక్కడ పత్రికల వారితో అన్నారు.

కేరళలో జరగబోయే ఉపఎన్నికల్లో మీపార్టీవైఖరి ఏమిటని ప్రశ్నించగా ఆయన పైవిధంగా చెప్పారు.

తమపార్టీ ప్రస్తుతస్థితిని గురించి ఆయన చెపుతూ ఆచార్య నరేంద్రదేవ్ మరణంవలన జయప్రకాశ్ నారాయణ పార్టీనుండి తప్పుకోవడం వలన, లోహియా వర్గం విడిపోవడం వలనా పార్టీ చాలవరకు దెబ్బతిన్నప్పటికీ, మరల కోలుకోగలుగుతున్నామన్నారు. కష్టాలన్నీ చాలవరకు గట్టెక్కినట్లేననీ, పార్టీ బలం ఇక ముందు పుంజుకోగలదని అన్నారు.

పశ్చిమ బెంగాల్ కాంగ్రెసు రాజకీయాలను గురించి అడిగిన ప్రశ్నకు ఆయన జవాబు చెపుతూ యిలా అన్నారు:

అక్కడ కాంగ్రెసుసంస్థ అంతా డాక్టర్. బి. సి. రాయి చుట్టూ నిర్మితమై వుంది. శ్రీ సిద్ధార్థరాయ్ చేసిన ఆరోపణలు చాల తీవ్రమైనవే. కాంగ్రెసు అధిష్టానవర్గం, కేంద్ర ప్రభుత్వం వాటి విషయమై దర్యాప్తు జరిపించగలదని ఆశించుచున్నాం. అని సమాధానం చెప్పారు.

లోహియా పార్టీతో ఐక్యత

తమ పార్టీ సంసిద్ధమని ప్ర. సో. పార్టీ అధ్యక్షుని ప్రకటన

కోయంబత్తూరు, ఏప్రిల్ 7

ప్రజాసోషలిస్టుపార్టీ, సోషలిస్టు పార్టీలు - రెండూ ఐక్యంకావాలనే భావం ఉభయపార్టీలలోని పెక్కుమంది సభ్యులకు గలదని తాను విశ్వసించుచున్నట్లు ప్ర. సో. పార్టీ అధ్యక్షుడు శ్రీ గంగాశరణ్ సిన్హా నేడిక్కడన్నారు.

కేరళపార్టీ మహాసభలో పాల్గొని ఢిల్లీ వెడుతున్న శ్రీ సిన్హా రెండు పార్టీలు విలీనంకావాలని కొంతమంది సోషలిస్టుపార్టీ నాయకులు ఇటీవల చేసిన ప్రకటనపై వ్యాఖ్యానించుచూ యింకా ఇలాఅన్నారు:

జయప్రకాశ్-లోహియా సంప్రతింపులు విఫలమైన తరువాత ఉభయ పార్టీల ప్రతిష్టకు భంగం కలుగని విధంగా, ప్రజాతంత్ర పద్ధతిపై ఐక్యంకావాలనే అభిప్రాయాన్ని నేను వెలిబుచ్చాను.

ఇప్పటికికూడా మా వైఖరి అదే. మేము చిత్తశుద్ధితో ఐక్యతను వాంఛించుచున్నాం. భారతదేశంలో ప్రజాతంత్ర సోషలిస్టు ఉద్యమ ప్రయోజనాలదృష్ట్యా మనలక్ష్య సాధనకు ప్రజాతంత్ర సోషలిస్టు శక్తులన్నీ ఏకంకావడం అవసరం.

ఎలాంటి షరతులతో నిమిత్తం లేకుండా సోషలిస్టు నాయకులతో సంప్రతింపులకు మేము సిద్ధంగా వున్నాం. సమావేశమై భవిష్యత్తులో అనుసరించవలసిన కార్యక్రమాన్ని గురించి చర్చించుకోవచ్చు. ఒకవేళ అభిప్రాయభేదాలు వుంటేవాటిని ప్రజాతంత్ర పద్ధతులద్వారా, పరస్పర విశ్వాసంద్వారా పరిష్కారం చేసుకోవచ్చు.

కేరళ, రాజస్థాన్ హైకోర్టులలో ప్రాంతీయ భాషలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 7

కేరళ, రాజస్థాన్ హైకోర్టులలో ప్రాంతీయభాషలు ఉపయోగించడానికి అధికారం యివ్వబడిందని నేడు లోక్‌సభలో అడిగిన ఒక ప్రశ్నకు దేశీయవ్యవహారాల మంత్రి పండితపంత్ లిఖితపూర్వకమైన సమాధానమిచ్చారు.

రాజధాని విశేషాలు

సైకిల్ ఛాంపియన్‌షిప్ పోటీకి ఆంధ్రులు

హైదరాబాదు, ఏప్రిల్ 7

ఈ నెల 11 వ తేదీన ఢిల్లీలో జరగనున్న జాతీయ సైకిల్ ఛాంపియన్‌షిప్ పోటీలో పాల్గొనడానికి ఆంధ్ర సైకిలిస్టు సంఘం కార్యవర్గంవారు నగరంనుంచి ఒక జట్టును పంపుతున్నారు.

ఈ జట్టుకు శ్రీ కె. రామస్వామి నాయకుడు. బి. బాలయ్య, కె. దేవానందం, ఎస్. యాదగిరి, ఎస్. ఎస్. రాజ్, సర్దార్‌సింగ్, జగన్నాథన్, అంజయ్య ఈ జట్టులో వుంటారు. జట్టు మేనేజరు ఎం. మక్దుం.

ఆజాద్ స్మారక గ్రంథాలయం

మౌలానా ఆజాద్ స్మారక చిహ్నంగా యాకుత్‌పురాలో నిన్న పౌర గ్రంథాలయాన్ని ప్రారంభించారు. దీనికి హైదరాబాద్ మేయరు మహబుద్దీన్ అహమద్‌ఖాన్‌గారు ప్రారంభోత్సవం చేశారు.

ఎన్నికల కమిషన్ నిర్ణయం

పోస్టల్ బ్యాలెట్ పద్ధతి పనికి రాదని నిర్ణయించినందుకు ఎన్నికల కమిషన్‌ని అభినందిస్తూ కర్నూలు జిల్లా ఉపాధ్యాయ సంఘ కార్యదర్శి శ్రీ గాలి రాజరత్నంగారు ఎన్నికల కమిషన్‌కి ఒక లేఖ వ్రాశారు. సంచార పోలింగు కేంద్రాలను స్థాపించడంవల్ల అందరికి ఎక్కువ సౌకర్యం వుండగలదనీ కనుక ఆ పద్ధతిని కూడా ప్రవేశపెట్టవలసిందనీ ఆయన కోరారు.

ఆరోగ్య దినోత్సవం

ప్రపంచ ఆరోగ్యదిన సందర్భంలో నేడు నగరంలో ఉత్సవాలుజరిగాయి. ఆరోగ్య విశేషాలను తెలిపే పటాలు వగైరాలతో ఒకమైలు ఊరేగింపు సాగింది.

యూనాని ఆస్పత్రి, ఉస్మానియా ఆస్పత్రి, కె. యి. యం ఆస్పత్రుల నుండి ఊరేగింపులు వేర్వేరుగా బయలుదేరి జమ్రుద్‌మహల్ టాకీసు వద్ద కలిశాయి.

తర్వాత జరిగిన బహిరంగ సభకు హోంమంత్రి శ్రీ రంగారెడ్డిగారు అధ్యక్షత వహించారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆశయాలను ఆదర్శాలను వివరించి ఆరోగ్యంపట్ల ప్రజానీకం ఎక్కువ శ్రద్ధచూపాలని హితవు చెప్పారు.

దేవికుళంలో ఉపఎన్నిక

ఎన్నికల కమిషన్ ఉత్తర్వు

తిరువేంద్రం, ఏప్రిల్ 7

కేరళలో దేవికుళం నియోజకవర్గంలో ఉపఎన్నిక జరుపవలసిందిగా ఎన్నికల కమిషన్ నేడు ఉత్తర్వు జారీచేసింది.

గత జనరల్ ఎన్నికల్లో ఈ నియోజకవర్గంలో కమ్యూనిస్టుపార్టీ అభ్యర్థిని శ్రీమతి రోశమ్మ పున్నూస్ ఎన్నికయారు. ఆ నియోజకవర్గంలో పోటీచేసిన అభ్యర్థుల్లో కాంగ్రెస్ అభ్యర్థి నామినేషన్ పత్రం నిరాకరణ సక్రమంగా జరగలేదన్న కారణంచేత ఎన్నికల ట్రిబ్యునల్ ఈమె ఎన్నికను రద్దు చేసిన విషయం పాఠకులకు విదితమే. ఈ నిర్ణయంపై కేరళ హైకోర్టుకు శ్రీమతి పున్నూస్ అప్పీలుచేయగా హైకోర్టు ఎన్నికల ట్రిబ్యునల్ నిర్ణయాన్ని ధ్రువపరుస్తూ తీర్పు ఇచ్చింది. ఈ తీర్పుపై అప్పీలు చేసుకోడానికి అనుమతిని కోరుతూ ఆమె పెట్టుకున్న అర్జీని సుప్రీమ్‌కోర్టు ఈ వేళ కొట్టివేసింది.

[illegible] ఎన్నికల కమిషన్ ఇవ్వాడే ఉత్తరువు జారీచేసింది. నామినేషన్లకూ, స్క్రూటినీకీ, ఉపసంహరణలకూ తేదీలనుకూడా నిర్ణయించారు. పోలింగు మే 16 వ తేదీని జరగాలన్నారు. ఈ ఉపఎన్నికలో బేలెట్ కాగితంపై గుర్తుపెట్టేపద్ధతిని అనుసరించడానికికూడా నిశ్చయించారు.

కోయంబత్తూరులో [illegible] శాస్త్ర సభకు ఆంధ్ర విద్యామంత్రి శ్రీ పట్టాభి రామారావుగారు ప్రారంభోత్సవం చేశారు.

కాకినాడలో వైద్యకళాశాల

విరాళాలకు శ్రీ అల్లూరి విజ్ఞప్తి

హైదరాబాదు, ఏప్రిల్ 7

కాకినాడలో నెలకొల్పనున్న వైద్య కళాశాలకు ప్రజలు ఉదారంగా విరాళాలు యివ్వవలసిందిగా విజ్ఞప్తి చేస్తూ అఖిలభారత కాంగ్రెసుకమిటీ ప్రధాన కార్యదర్శి శ్రీ అల్లూరి సత్యనారాయణరాజుగారు ఒక పత్రికా ప్రకటన చేశారు.

ఆ ప్రకటనలో యిలా వుంది:

కాకినాడలో వైద్య కళాశాలను నెలకొల్పాలన్న ప్రతిపాదనను ఇండియన్ మెడికల్ కౌన్సిల్ అధ్యక్షుడు డాక్టర్ సి. [illegible] బలపర్చడం ఎంతో సంతోషించదగిన విషయం. తూర్పు, పశ్చిమగోదావరి లాంటి జిల్లాలకు ఒక వైద్యకళాశాల వుండటంఅవసరం. ఈ కాలేజీకోసం విరాళాలువసూలు చేయడానికి పార్లమెంటు సభ్యుడు కర్నల్ డి. యస్. రాజు, మరికొందరు పూనుకోవడం అభినందించ వలసిన విషయం.

రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నీలం సంజీవరెడ్డిగారుకూడా కాకినాడలో వైద్య కళాశాల స్థాపనకు సుముఖంగావున్నారు. అందుకు ఆయన అన్నివిధాల సహాయపడతానని వాగ్దానం చేశారు. ఈ అవకాశాన్ని వినియోగించుకొని విరాళాలు యిచ్చి కాలేజీ స్థాపనకు సహాయపడవలసిందిగా అందరికి విజ్ఞప్తి చేస్తున్నాను.

ఇండొనేషియాలో అమెరికాజోక్యం

'పీపుల్స్‌డైలీ' విమర్శ

హాంకాంగ్, ఏప్రిల్ 7

ఇండొనేషియా అంతరంగిక వ్యవహారాల్లో తన జోక్యాన్ని మరింత పెంపొందించుకునేందుకై అమెరికా తైవాన్ దీవిని వినియోగించుకుంటుందని నేడు పెకింగ్ 'పీపుల్స్ డైలీ' విమర్శించింది.

ఈవిధంగా చైనా భూభాగాన్ని ఇండొనేషియాకి వ్యతిరేకంగా వుపయోగించడంతో, ఆందోళనకర పరిస్థితి, ఏర్పడిందని 'పీపుల్స్ డైలీ'లో ఒక వ్యాఖ్యాత అన్నారు.

అమెరికా అవలంబించేదుష్టచర్యల వల్ల ఇండొనేషియా స్వాతంత్ర్యానికి, దాని భద్రతకు విఘాతం కల్గడమే గాకుండా, ఆశియాలో శాంతికే ఈ చర్యలు ముప్పుతెస్తాయి అని ఈ వ్యాఖ్యాత వ్రాసినట్లు నవచైనా వార్తాసంస్థ భోగట్టా.

కలకత్తాలో నిర్వాసితులపై బాష్ప వాయువు

కలకత్తా, ఏప్రిల్ 7

ఈవేళ చిన్‌సూరా (హుగ్లీ) కోర్టు వద్ద నిరసనప్రదర్శన చేస్తూన్న ఆరు వందలమంది నిర్వాసితులపై పోలీసులు బాష్పవాయు ప్రయోగం చేశారు.

అమెరికాలో విమాన ప్రమాదం: 47 మందిదుర్మరణం

మిడ్లాండ్, ఏప్రిల్ 7

న్యూయార్కునుండి చికాగో వెళ్తూన్న విమానం ఒకటి దారిలో మిడ్లాండ్‌వద్ద నేలకూలి, వెంటనే ప్రేలిపోయింది. అందులోని 47 మంది చనిపోయారు.

కేరళ ముస్లింలీగు ప్రజాసోషలిస్టు పార్టీతో ఎల్లప్పుడూ సహకరిస్తూనే వుంటుందని లీగు నాయకులు తిరిగి హామీ ఇచ్చారు.

సత్సంప్రదాయం

మంత్రులకు ఎన్నికల కమిషనర్ సూచన

న్యూఢిల్లీ, ఏప్రిల్ 7

ఏదైనా నియోజకవర్గంలో ఎన్నికలు జరుగబోతున్నట్లయితే మంత్రులు అక్కడ అధికార హోదాలో ప్రభుత్వ కార్యక్రమాలు పెట్టుకోకుండానూ, ప్రభుత్వపు రవాణా సౌకర్యాలను ఉపయోగించకుండానూ ఉండే సంప్రదాయాన్ని నెలకొల్పడం మంచిదని ప్రధాన ఎన్నికల కమిషనర్ ఇటీవల అన్నిరాష్ట్రాల ముఖ్యమంత్రులకూ జాబులు రాశారు.

అంతగా ఏ మంత్రి అయినా అలాంటి నియోజకవర్గాలకు అధికార పర్యటనపై వెళ్ళవలసివస్తే, ఆయన తనపార్టీకి చెందిన అభ్యర్థి తరఫున ప్రచారం చేయకుండా జాగ్రత్త పడాలనికూడా ఈ జాబులో సూచించారు.

ఈ విషయాన్ని నేడులోక్‌సభలో డాక్టర్ రామసుభాగ్‌సింగ్ అడిగిన ప్రశ్నకు జవాబుచెబుతూ న్యాయశాఖ ఉపమంత్రి హజార్నవీస్ తెలిపారు.

ఇలాంటి సందర్భాల్లో ఆక్షేపణ తెలుపగల పర్యటన కార్యక్రమాలను ఇదివరకే మానుకుంటున్నామనీ, ఇక ముందుకూడా మానుకుంటామనీ ముఖ్యమంత్రులు ఎన్నికల కమిషనరుకు తెలియ జేశారనికూడా మంత్రిగారన్నారు.

నిర్వాసితుల అరెస్టు

కలకత్తా, ఏప్రిల్ 7

కలకత్తాలో రాజభవన్ వెలుపల ప్రదర్శనలు జరిపిన 1000 మంది నిర్వాసితులను పోలీసులు నేటిరాత్రి అరెస్టు చేశారు.

కావలెను

పోస్టలు టెలిగ్రాఫిస్టులు, రైల్వే సిగ్నలర్లు, వైర్‌లెస్ ఆపరేటర్లు, మరియు రేడియో ఇంజినీర్లు మొదలగు గవర్నమెంటు ఉద్యోగములకొరకు ట్రయినింగ్ పొందుటకుగాను (S. S. L. C. Inter Pased or Failed) అభ్యర్థి, అభ్యర్థులనుండి దరఖాస్తులు కోరబడు చున్నవి. మొత్తం అయిదుకోర్సుల వివరములు తెలిసికొనుటకు,మీ విద్యార్హతల వివరములు వ్రాయుచూ 30 n. p. స్టాంపులు పంపవలెను. (పోస్టల్ వసతులు కలవు)

DIRECTOR OF NATIONAL,
TECHNICAL COLLEGE.
Seelamvari Street, GUNTUR-1

టెండరు నోటీసు

పశ్చిమ గోదావరిజిల్లా నరసాపురం తాలూకా ఆచంట పంచాయితీ తాలూకు ఈ దిగువ చూపిన వాటికి సీలు వేసిన టెండర్లు 19-4-1958 వ తేదీ సాయంత్రము 4 గంటల వరకు ఆచంట పంచాయితీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసరుగారిచే గాని వారి అనుమతి పొందిన వారిచే గాని తీసుకొనబడును. ఇతర వివరములకు ఈ పంచాయితీ పనిచేయు కాలములో వ్రాత పూర్వకముగా గాని, స్వయముగా గాని వచ్చి తెలిసికొనవచ్చును.

1 ఆచంట పంచాయితీలోవున్న రామగుండం చెరువు గట్టులు పటిష్ఠముచేసి, ఎత్తు చేయుట.
ఎస్టిమేటు మొత్తం రు. 2000/-లు
ధరావత్తు రు. 100/-లు.
2. 1958-59 సంవత్సరమునకు, ఆచంట పంచాయితీకి వీథిలాంతర్లు వెలిగించుటకు కావలసిన తెల్లకిరసనాయిలు సప్లయి చేయుట.
ధరావత్తు రు 50/-లు.

(సం) ఎ. సాంబశివరావు,
ఎగ్జిక్యూటివ్ ఆఫీసరు.

ఓవర్సీర్స్‌కోర్స్

యస్. యస్. యల్. సి. విద్యార్థులు (ప్యాసయినను, లేక కొద్ది మార్కుల తేడాతో తప్పినను లేక 1958 మార్చి పరీక్షలకు హాజరయిన వారునూ) ఓరల్‌గాను, పోస్టుద్వారాను కూడ యీకోర్సు చదువవచ్చును. కాంపోజిట్ లెక్చర్లు అవసరములేదు.

విద్యార్థులకు 1959 ఏప్రిల్‌లో మద్రాస్, ఆంధ్ర ప్రభుత్వములచే జరుపబడు సివిల్ ఇంజనీరింగు పరీక్షలకు కోచింగు యివ్వబడును. హాస్టలు కలదు.

కాంపోజిట్ లెక్చర్లు చదువనివారికి 28-4-58 నుండి, కాంపోజిట్ లెక్చర్లు చదివినవారికి 23-6-58 నుండి తరగతులు ప్రారంభించబడును.

ప్రాస్పెక్టస్‌కు మనియార్డరుద్వారా రు. 1/- "Principal, Madras College of Engineering, Chintadripet, Madras-2"కు పంపవలెను. M. O. కూపనులో మీపేరు, చిరునామా స్పష్టముగా విడిఅక్షరములలో వ్రాయవలెను.

సంపాదకవర్గం: మద్దుకూరి చంద్రశేఖరరావు (అధ్యక్షుడు); కాట్రగడ్డ రాజగోపాలరావు, ఏటుకూరు బలరామమూర్తి - ఎడిటర్, ప్రింటర్ & పబ్లిషర్: విశాలాంధ్ర విజ్ఞానసమితి తరఫున కాట్రగడ్డ రాజగోపాలరావు, స్వతంత్ర ఆర్టు ప్రింటర్సు, విజయవాడ-2.